www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పేజీలు: 14

సంపుటి (Volume) : 66

సంచిక (Issue) : 21

బుధవారం | 7-5-2025

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.10:20 తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుబ్బ సా.6:17 తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.2:19-4:06, దుర్ముహూర్తం: ఉ.11:46-12:37, అమృతఘడియలు: ఉ.11:14-1:00, రాహుకాలం: మ.12:00-మ.1:30, సూర్యోదయం: 5:49, సూర్యాస్తమయం: 6:33

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గాలికి ఏడేళ్ల జైలు

ఓబుళాపురం గనుల అక్రమ తవ్వకాల్లో గాలి జనార్దన్‌రెడ్డి దోషే

14 ఏళ్ల విచారణ తర్వాత సీబీఐ న్యాయస్థానం తీర్పు

మరో ముగ్గురికి ఆయనతో పాటు ఏడేళ్ల కారాగారం

నిర్దోషులుగా సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందం

తన ప్రజా సేవను గుర్తించి, తన వయసును పరిగణనలోకి తీసుకొని శిక్ష తగ్గించాలని జడ్జిని అభ్యర్థించిన గాలి

ఆరోపణలు రుజువయ్యాయి.. మీకు యావజ్జీవం ఎందుకు విధించకూడదు?.. అని ప్రశ్నించిన న్యాయమూర్తి

తీర్పు వెలువడగానే చంచల్‌గూడకు గాలి తరలింపు

జైలు శిక్ష నేపథ్యంలో గాలి ఎమ్మెల్యే పదవికి గండం

'ఓబుళాపురం'తో అప్పట్లోనే ఖజానాకు 884 కోట్ల నష్టం

కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా.. న్యాయం గెలిచింది.. తీర్పుపై సబిత హర్షం

హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఓబుళాపురం ఇనుప ఖనిజం గనుల అక్రమ తవ్వకాల కేసులో మైనింగ్ మాఫియా డాన్, కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. ఆయనతోపాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురికి కూడా ఏడేళ్ల కారాగార శిక్షను ఖరారు చేసింది. 14 ఏళ్ల సుదీర్ఘ విచారణానంతరం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి టి.రఘురామ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో అనంతపురం జిల్లా ఓబుళాపురంలో గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ 2007-09 మధ్య కాలంలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలకు పాల్పడిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు పెట్టింది. ఐపీసీ 120బి (నేరపూరిత కుట్ర), 420 (మోసం), 409, 468, 471 (ఫోర్జరీ), అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13 (2), 13 (1)(డి) కింద 2009లో కేసు నమోదైంది. కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని

మిగతా 13వ పేజీలో...



కానిస్టేబుల్ కుమారుడు.. కోట్లకు పడగెత్తాడు!

గాలి జనార్దన్‌రెడ్డి ప్రస్థానం

2011లో అరెస్టు.. జైలు జీవితం

బెయిల్ కోసం న్యాయమూర్తులకే లంచాలు ఇవ్వజూపిన గాలి

గాలిని పట్టుకునేందుకు మారువేషాల్లో వెళ్లాం

అక్రమ తవ్వకాలు జరిపే వారికి ఈ తీర్పు గుణపాఠం: లక్ష్మీనారాయణ

ఇక 'బ్రదర్' జగన్ వంతేనా?!

గాలికి శిక్షతో సర్వత్రా ఇదే చర్చ.. ఒక్క కేసులోనే జనార్దన్‌రెడ్డికి ఏడేళ్ల కఠిన శిక్ష

జగన్‌పై 11 సీబీఐ కేసులు.. 12 ఏళ్లుగా సీబీఐ కోర్టులో పెండింగ్.. అదే కోర్టులో ఇప్పుడు గాలికి దండన.. వైఎస్ హయాంలో ఒక వెలుగు వెలిగిన గాలి

జగన్ తన బ్రదర్ అంటూ అప్పట్లో వ్యాఖ్యలు

సోదరబంధంతోపాటు అక్రమ వ్యాపార బంధమూ!

త్వరలో అదీ బయటపడుతుందంటున్న న్యాయ నిపుణులు

నేతలపై కేసుల్లో విచారణ వేగవంతానికి సుప్రీం ఆదేశం

గాలి కేసును పర్యవేక్షించిన సర్వోన్నత న్యాయస్థానం

ట్రయల్ పూర్తయితే జనార్దన్ చెంతకే జగన్!



13

ఫ్లాష్ ఫ్లాష్

పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం

మెరుపు దాడులు

ఆపరేషన్ సింధూర్ స్టార్ట్



ప్రతీకార దాడులు ప్రారంభించిన భారత్

మొత్తం 9 ఉగ్ర స్థావరాలు ధ్వంసం

న్యూఢిల్లీ, మే 6 : పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత సైన్యం మెరుపు దాడులు ప్రారంభించింది. ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్ర శిబిరాలపై భారత సైన్యం దాడి చేసి పాక్ ఆక్రమిత కశ్మీర్‌తోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసింది. మొత్తం 9 ఉగ్ర స్థావరాలను, వారి సదుపాయాలను భారత సైన్యం ధ్వంసం చేసినట్లు తెలిసింది. అత్యంత కచ్చితత్వంతో ఈ దాడులు జరపడం విశేషం. ఈ దాడులకు సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని రక్షణ శాఖ ప్రకటించింది. కాగా భారత సైన్యం దాడులను పాకిస్థాన్ సైన్యం నిర్ధారించింది. భారత్ దాడి చేసిందని ప్రకటించింది. కోట్లీ, ముజఫరాబాద్, బహవల్‌పూర్‌లపై మిసైల్స్‌తో దాడులు చేసినట్లు పాకిస్థాన్ సైనిక ప్రతినిధి తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు మరణించగా, మరో 12 మంది గాయపడ్డట్టు చెప్పారు.

యాక్సిస్‌పై యాగీ

జగన్ రోత పత్రికలో నిజాలు దాచి నిస్సిగ్గు రాతలు

నాడు ఒప్పందం చేసుకుంది జగనే

2022లో యూనిట్ రూ.5.12కు ఒప్పందం

దీనిని రూ.4.60కు తగ్గించిన బాబు సర్కార్

వైసీపీ ఒప్పందంతో పోలిస్తే 52 పైసలు ఆదా

జీఎస్టీ కింద ఏటా మరో రూ.784 కోట్లు మిగులు

కీలక అంశాలు దాచిపెట్టి.. రోత పత్రిక రాతలు

నాటి సెకీ ఒప్పందంపై వైసీపీ అడ్డగోలు వాదన

అప్పట్లో యూనిట్ రూ.2.49కే కొన్నామని కథలు

కానీ ట్రాన్స్‌మిషన్ చార్జీల పేరిట దోపిడీపై గోప్యత

ద్వంద్వ ప్రమాణాలపై విద్యుత్ నిపుణుల మండిపాటు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై జగన్ రోత పత్రిక నిస్సిగ్గు రాతలతో రెచ్చిపోతోంది. నాడు వైసీపీ హయాంలో చేసుకున్న ఒప్పందాలకు మసిపూసి మారేడు చేస్తూ.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై రోత రాతలు రాస్తూ.. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. యాక్సిస్‌తో తాజాగా చేసుకున్న ఒప్పందంపైనా యాగీ చేస్తూ.. నాడు జగన్ చేసుకున్న ఒప్పందాలే మేలని బుకాయిస్తోంది. నిజానికి 2022లో అప్పటి సీఎంగా జగనే యాక్సిస్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లో యూనిట్‌కు రూ.5.12 చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదిరింది. కానీ.. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక.. దీనిని రూ.4.60కు

మిగతా 12వ పేజీలో...



12

మాజీమంత్రి పెద్దిరెడ్డికి

నోటీసులు

ఎల్లుండి దేవదాయ శాఖ అధికారి ఎదుట హాజరవండి

బుగ్గమఠం భూముల వ్యవహారంలో మరో నలుగురికి...

హాజరుకాకుంటే ఆక్రమణల తొలగింపునకు ఉత్తర్వులు

వంశీ రిమాండ్

పొడిగింపు

14



14

13న దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'

ఈ ఏడాది వారం ముందే రాక

నేడూ పలు జిల్లాల్లో వర్షాలు

భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య

ఒప్పందం

ఇరు దేశాల మధ్య కస్టమ్స్ సుంకాల తగ్గింపు

పదేళ్లలో వాణిజ్యం మరో 2.90 లక్షల కోట్లు పెరుగుతుందని అంచనా

ఒప్పందం చారిత్రాత్మకం..

దౌత్య, వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతమవుతుంది: ప్రధాని మోదీ

యూకేలో భారత ఉద్యోగులకు లబ్ధి కలిగేలా మరో ఒప్పందం

11

'దేవదాయ'లో పోస్టుల భర్తీకి

గ్రీన్‌సిగ్నల్

6 డిప్యూటీ కమిషనర్ పోస్టులు సహా 137 ఉద్యోగాల భర్తీ చేయాలని సీఎం ఆదేశం


200 వైదిక సిబ్బంది నియామకానికీ ఆమోదం

16 ప్రముఖ ఆలయాల్లో నిత్యాన్నదానం అమలు

23 ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

దేవదాయ శాఖపై సమీక్షలో చంద్రబాబు ఆదేశాలు

ఖాళీలపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు



అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న డిప్యూటీ కమిషనర్, గ్రేడ్-1, 3 ఈవోలతో సహా అన్ని పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంగళవారం ఆయన సచివాలయంలో దేవదాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం ఘటనతో పాటు ఆలయాల నిర్వహణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా దేవదాయ శాఖ, ఆలయాల్లో

మిగతా 3వ పేజీలో...

బేబీ కిట్స్ పథకం

పునరుద్ధరణ

11

ఆరోగ్యశాఖకు సీఎం పచ్చజెండా

నేటి నుంచి కొత్త రైస్ కార్డులకు దరఖాస్తులు

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్వీకరణ: మంత్రి మనోహర్

14



జమ్మూలోని ఓ పాఠశాలలో విద్యార్థుల మాక్‌డ్రిల్

లష్కరే.. మీ భూభాగంలోది కాదా?

ఉగ్రదాడిపై మీ ప్రమేయం లేదా?.. మీ తప్పులు కప్పిపుచ్చుకోవద్దు!

పాక్ తీరుపై నిప్పులు చెరిగిన ఐరాస భద్రతా మండలి సభ్యులు

'పహల్గాం'పై ఉగ్రవాద దాడి సహా అణు, క్షిపణి హెచ్చరికలపై నిలదీత

భారత్‌పై దుష్ప్రచారం చేయబోయి చీవాట్లు తిన్న దాయాది దేశం

యుద్ధ సన్నద్ధతకు సైరన్

కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లో మాక్ డ్రిల్ నిర్వహణకు రంగం సిద్ధం

తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖ, బాపట్లలో ఎయిర్ రైడ్ సైరన్లు, క్రాష్ బ్లాకవుట్లు, పౌర శిక్షణ, తరలింపు చర్యలతో ప్రజల్లో అవగాహన పెంపు

యుద్ధం వస్తే ఎలా వ్యవహరించాలో నేర్పే ప్రక్రియ

1971 తర్వాత మాక్ డ్రిల్ నిర్వహించడం ఇదే!

విశాఖ, బాపట్లలో 'ఆపరేషన్ అభ్యాస్'

పాక్ ప్రతిదాడి చేస్తే ఏం చేయాలో వివరణ

సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల దాకా!

న్యూఢిల్లీ, మే 6: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. కేంద్ర ఆదేశాల మేరకు బుధవారం దేశవ్యాప్తంగా పౌరుల భద్రత సన్నద్ధతను పరీక్షించే మాక్‌డ్రిల్స్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. యుద్ధమంటూ మొదలైతే.. 33 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో.. దాడులకు గురయ్యే ప్రమాదం ఉన్న 244 జిల్లాల్లోని అత్యంత సున్నితమైన 259 ప్రాంతాల్లో వీటిని నిర్వహించనున్నారు. వాటిలో.. తెలంగాణలో హైదరాబాద్, ఏపీలో విశాఖ, బాపట్ల ఉన్నాయి. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో.. ఈ మాక్ డ్రిల్ నిర్వహణకు సంబంధించి మంగళవారం అత్యున్నతస్థాయి సమావేశం జరిగింది. అత్యంత కీలకస్థానాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ భేటీలో పాల్గొని చర్చించారు. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగేటప్పుడు

మిగతా 2వ పేజీలో...

భారత్‌తో పోరాటమా?

పాక్‌లో ఓ మతగురువు ప్రశ్నకు అక్కడి ప్రజల నుంచి మౌనమే సమాధానం

ఇళ్లు, డిపాజిట్లు, భూములు!

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల

ఆస్తుల వెల్లడి

33 మందిలో 21 మంది వివరాలు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో

రూ.120 కోట్లతో శ్రీమంతుడు జస్టిస్ విశ్వనాథన్

సీజేఐ ఖన్నాకు రెండు ఇళ్లు, రూ.2.77 కోట్ల నగదు, స్విఫ్ట్ కారు

సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామక వివరాలూ వెల్లడి

గత రెండున్నరేళ్లలో 14 మంది న్యాయమూర్తుల బంధువులకు చాన్స్

మొత్తం నియామకాల్లో అది 6 శాతమే

న్యూఢిల్లీ, మే 6: భారత సర్వోన్నత న్యాయస్థానం పారదర్శకతలో భాగంగా తన న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను తన వెబ్‌సైట్లో పెట్టింది. ఇప్పటివరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 33 మందిలో 21 మంది తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. వారిలో జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు అత్యధికంగా రూ.120 కోట్ల ఆస్తి ఢిల్లీ,

మిగతా 11వ పేజీలో...



రిజర్వేషన్లు రైలు కంపార్టుమెంట్ లాంటివి

ముందు ఎక్కినవారు ఇతరులను అనుమతించరు: సుప్రీంకోర్టు



ధనుంజయ్‌రెడ్డి | కృష్ణమోహన్‌రెడ్డి

మద్యం కేసులో నిందితులుగా

ఇద్దరు బాసులు

ఎఫ్ఐఆర్‌లో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పేర్లు

భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప కూడా

కసిరెడ్డి, చాణక్య, సజ్జల, దిలీప్ రిమాండ్ పొడిగింపు

14

గ్రూప్-1 మూల్యాంకనం కేసులో..

పోలీసుల అదుపులో 'కామ్‌సైన్' మధు!

హైదరాబాద్ కార్యాలయంలో సోదాలు.. అనంతరం బెజవాడకు తరలింపు

టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సుదీర్ఘ విచారణ

ఏపీపీఎస్సీ ఆఫీసులోనూ ప్రశ్నించిన వైనం

నేడు కోర్టులో హాజరుపరిచే అవకాశం

ప్రధాన నిందితుడు పీఎస్‌ఆర్‌పై పీటీ వారెంట్

14



భూకబ్జాల

భూమన!

వైసీపీ హయాంలో 16.30 ఎకరాల చెర

తిరుచానూరు, తిమ్మినాయునిపాలెంలో ఇనాం, స్వర్ణముఖి, పోరంబోకు భూముల ఆక్రమణ

నిర్ధారించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

తాజాగా సర్కారుకు నివేదిక

తక్షణ చర్యలకు ఆదేశించిన ప్రభుత్వం

సర్వే జరిపి కబ్జాగా తేలిన భూములు వెనక్కి

క్రిమినల్, సివిల్ చర్యలకు మంత్రి ఆదేశం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కమ్యూనిజం అంటూనే శ్రీవారి సేవలో తరిస్తుంటారు. ప్రగతిశీల సూక్తులతో రాయలసీమ అభినవ శ్రీశ్రీలా తనను తాను ప్రమోట్ చేసుకుంటూ.. తనలోని అన్నమయ్యను బయటకు తీస్తారు. ఇన్ని విద్యలున్న ఆయన మరో విషయంలోనూ సిద్ధహస్తుడినని నిరూపించుకున్నారు. విలువైన ప్రభుత్వ, పోరంబోకు భూములు, స్వర్ణముఖి నదీ పరీవాహకాన్ని సైతం ఆయన చెరపట్టారు. ఈ బాగోతాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బయటపెట్టింది. ఆయనలోని కబ్జాకోరు కోణాన్ని ఆవిష్కరించింది. ఆయన మరెవరో కాదు.. భూమన కరుణాకర్‌రెడ్డి. వైసీపీ నేత. వైసీపీ హయాంలో శాసనసభ్యుడిగా ప్రజాసేవలో

మిగతా 14వ పేజీలో...

యుద్ధ సన్నద్ధతకు సైరన్!


జమ్మూలో బంకర్లను శుభ్రం చేస్తున్న స్థానికులు

ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తరహా డ్రిల్

పహల్గాం దాడి, పాకిస్థాన్-ఇండియా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. దేశ రాజధాని ఢిల్లీలో పోలీసు దళాలు ఇప్పటికే నిఘాను తీవ్రతరం చేశాయి. కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్, జన్‌పథ్ వంటి కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ పెంచాయి. ఇక బుధవారం మాక్ డ్రిల్‌లో భాగంగా చండీగఢ్‌లో.. ఎంపిక చేసిన ప్రాంతాల్లో బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో 10 నిమిషాలపాటు బ్లాక్ అవుట్ డ్రిల్ నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటల సమయంలో సైరన్ మోగించడం మొదలుపెడతామని.. అది 10 నిమిషాలపాటు మోగుతుందని.. అది మోగినంతసేపూ పౌరులందరూ తమ ఇళ్లు, దుకాణాలు, వ్యాపారసముదాయాల్లో విద్యుద్దీపాలను ఆపేయాలని.. ఎవరూ జనరేటర్లు, ఇన్వర్టర్లను వాడొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. వీలైనంతవరకూ ఆ సమయంలో పౌరులందరూ ఇళ్లల్లోనే ఉండడానికి ప్రయత్నించాలని.. రోడ్లపై ప్రయాణిస్తున్నవారు తమ వాహనాలను ఒక పక్కగా పార్క్ చేసి హెడ్‌లైట్లను ఆపేయాలని సూచించారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్య సంస్థలకు మాత్రం ఈ డ్రిల్ నుంచి మినహాయింపునిచ్చారు. ఇది కేవలం మాక్ డ్రిల్ మాత్రమేనని.. ప్రజలు అనవసరంగా కంగారుపడి, ఆందోళనకు గురికావొద్దని.. పెట్రోల్, డీజిల్, ఆహారం వంటివాటిని పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవద్దని సూచించారు. కాగా, అజ్మల్ కసబ్ అతడి సహచర ఉగ్రవాదులు 2008లో ముంబైలోకి ప్రవేశించింది సముద్రమార్గంలోనే. అందుకే మహారాష్ట్ర సర్కారు తీర ప్రాంతాల్లో భద్రత సన్నద్ధతపై దృష్టి సారించింది. సివిల్ డిఫెన్స్ అగ్నిమాపక, ఇతరత్రా అత్యవసర విభాగాల మధ్య సమన్వయాన్ని ఈ మాక్ డ్రిల్‌లో పరిశీలించనున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఫైర్ హ్యాండ్లింగ్ టెక్నిక్స్‌ను (అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే జాగ్రత్తలు), క్యాజువాలిటీ రెస్పాన్స్‌ను పరీక్షించనున్నట్టు ఆ రాష్ట్ర డీజీపీ తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో పోలీసులు, విపత్తు స్పందన దళాలు, పర్యాటకుల భద్రతకు సంబంధించిన గస్తీ దళాలు దాల్ సరస్సుపై డ్రిల్స్ నిర్వహించనున్నారు. అలాగే, ఆ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లోని విద్యార్థులకు.. సైరన్లు మోగినప్పుడు, వైమానిక దాడులకు సంబంధించిన సంకేతాలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలో నేర్పిస్తారు. పంజాబ్‌లో మొత్తం 23 జిల్లాలుండగా.. వాటిలో 20 జిల్లాల్లో పౌర భద్రత విభాగాలు మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నాయి. ఒడిశాలో మాక్ డ్రిల్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ అవుట్ సిమ్యులేషన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేమోఫ్లేజ్ వంటివి నిర్వహించనున్నారు. కర్ణాటకలో బెంగళూరు, కర్వార్ (ఉత్తర కర్ణాటక- అక్కడ కైగా న్యూక్లియర్ విద్యుత్ కేంద్రం ఉంది), రాయ్‌చూర్‌లో (అక్కడ థర్మల్ పవర్‌స్టేషన్ ఉంది) మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు.ఇలా అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మాక్ డ్రిల్స్ నిర్వహణకు చర్యలు చేపట్టినట్టు కేంద్ర వర్గాలు తెలిపాయి. పౌర భద్రత వలంటీర్లు ఈ డ్రిల్‌లో భాగమవుతారని ఆ వర్గాలు వెల్లడించాయి.


ప్రయాగ్‌రాజ్‌లో

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో ఇలాగే మాక్ డ్రిల్ నిర్వహించారు. మళ్లీ 50 ఏళ్ల తర్వాత.. ఇప్పుడు అలాంటి కసరత్తే జరగనుంది. ఇంతకీ ఏమిటీ మాక్ డ్రిల్? ప్రభుత్వం వీటిని ఎందుకు నిర్వహిస్తోంది? అందులో పౌరుల పాత్ర ఏమిటి? అంటే.. యుద్ధ సమయంలో ప్రజలు, రక్షణ, విపత్తు స్పందన, ప్రభుత్వ సిబ్బంది ఎలా వ్యవహరించాలో శిక్షణ ఇవ్వడం ఇలా మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. అందులో భాగంగా పలు చర్యలు చేపడతారు. అవేంటంటే..

ఎయిర్ రైడ్ సైరన్లు: వైమానిక దాడులు జరిగే ప్రమాదం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే సైరన్లు. ఆ సైరన్ మోగిందంటే ముప్పు ముంచుకొస్తున్నట్టే. ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాల్లో తల దాచుకోవాలి. ఇంట్లోనే ఉండాలి.

క్రాష్ బ్లాకవుట్స్: యుద్ధ సమయాల్లో రాత్రి వేళల్లో వైమానిక దాడులు జరగకుండా.. విద్యుద్దీపాలన్నీ ఆర్పేసి కారుచీకట్లు కమ్ముకునేలా చేయడం. 1971లో జరిగిన బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో ఈ వ్యూహాన్ని విస్తృతంగా వినియోగించారు.

కేమోఫ్లేజ్ మెజర్స్: పాకిస్థాన్‌తో 1971లో యుద్ధం జరిగిన సమయంలో.. శత్రువుల విమానాలు మన తాజ్‌మహల్‌పై దాడులు చేయకుండా దాన్ని జనపనార తాళ్లతో కప్పి ఉంచారు. అలా కీలక, చారిత్రక కట్టడాలను, సైనిక కేంద్రాలు, సమాచార టవర్లు, విద్యుత్ కేంద్రాల వంటివాటిని శత్రువుల కంటపడకుండా చేసి, వాటిని కాపాడుకునే ప్రక్రియ ఇది.

తరలింపు చర్యలు: ఇది అందరికీ తెలిసిందే. వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టుగా.. యుద్ధ సమయంలో పౌరులను హైరిస్క్ జోన్ల నుంచి సేఫ్ జోన్లకు తరలిస్తారు.

పౌర శిక్షణ: యుద్ధ సమయాల్లో ఎలా ప్రవర్తించాలో పౌరులకు శిక్షణ ఇస్తారు. ఇందు కోసం పాఠశాలలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్లలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. వారు ఉన్న చోట దాడి జరిగినప్పుడు తలభాగాన్ని ఎలా కాపాడుకుంటూ నేలపై కూర్చుండిపోవాలి, సమీపంలోని ప్రభుత్వ షెల్టర్లను ఎలా గుర్తించాలి?, ప్రాథమిక చికిత్స ఎలా చేయాలి? ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఒత్తిడికి, భయాందోళనలకు గురికాకుండా ఎలా ఉండాలి వంటి అంశాలను ఆ వర్క్‌షాపుల్లో బోధిస్తారు.

ఇలా మాక్ డ్రిల్ నిర్వహించడం వల్ల.. నిజంగా యుద్ధం వచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాలో, ప్రాణాలు కాపాడుకోవాలో ప్రజలకు తెలుస్తుంది. ఈ శిక్షణతో గందరగోళానికి గురి కాకుండా, క్రమశిక్షణతో మెలగడం అలవడుతుంది. అదే సమయంలో అటు ప్రభుత్వ విభాగాలకు కూడా ఎక్కడెక్కడ ఏయే లోపాలున్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుకునే వీలు కలుగుతుంది. ఎయిర్ రైడ్ వార్నింగ్ సిస్టమ్స్ (శత్రు దాడుల గురించి హెచ్చరించే వ్యవస్థలు) ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి? కంట్రోల్ రూములు, షాడో కంట్రోల్ రూముల పనితీరు ఎలా ఉంది? వంటి అంశాలపై ఒక స్పష్టత వస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం 'సివిల్ డిఫెన్స్ రూల్స్, 1968' ప్రకారం ఈ మాక్ డ్రిల్ నిర్వహణకు ఆదేశాలు జారీచేసింది. బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు.. తాము గమనించిన లోపాలు, వాటిని సరిదిద్దుకోవడానికి అవసరమైన సూచనలు, సిఫారసులతో కేంద్ర ప్రభుత్వానికి 'యాక్షన్ టేకెన్ రిపోర్టు'లు సమర్పిస్తాయి.


జమ్మూలో ఓ పాఠశాలలో మాక్ డ్రిల్

మోదీతో దోభాల్ భేటీ

పహల్గాం ఉగ్రదాడికి గట్టిగా బదులివ్వాలని భారత్ భావిస్తున్న తరుణంలో కీలక సమావేశాలు, చర్చలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య భేటీ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. కాగా, మోదీ ఇప్పటికే రక్షణ మంత్రి రాజ్‌నాథ్, సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులతో కూడా సమావేశమయ్యారు.

కొన్నిచోట్ల మంగళవారమే..

దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లో బుధవారం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రం ఆదేశించగా.. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని రాష్ట్రాలు మంగళవారమే ఆ ప్రక్రియ చేపట్టి పౌరులను అప్రమత్తం చేశాయి. ఉదాహరణకు.. పంజాబ్‌లో ఇండో-పాక్ సరిహద్దుకు అత్యంత సమీపంగా ఉండే ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో ఆదివారం సాయంత్రమే 30 నిమిషాల బ్లాకవుట్ డ్రిల్ (విద్యుద్దీపాల ఆర్పివేత) నిర్వహించారు. మాక్ డ్రిల్ సమయంలో అధికారులకు ప్రజల సహకారం తప్పనిసరిగా ఉండాలి. అధికారుల సూచనలను తూచాతప్పకుండా పాటించాలి. వదంతులను నమ్మకూడదు. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలి.

ఆ 244 జిల్లాలే ఎందుకు?

దేశభద్రతకు సంబంధించి వ్యూహాత్మక ప్రాముఖ్యం ఉన్న జిల్లాలు, దాడుల ప్రమాదం ఎక్కువగా ఉండే జిల్లాలను 'సివిల్ డిఫెన్స్ జిల్లా'లుగా వ్యవహరిస్తారు. అందులో రకరకాల కేటగిరీలు ఉంటాయి.

అంతర్జాతీయ సరిహద్దులకు దగ్గరగా ఉండే జిల్లాలు: పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల్లో ఇండో-పాక్ సరిహద్దులకు దగ్గరగా ఉండే జిల్లాలు.

కీలక వ్యవస్థలు ఉండే జిల్లాలు: సైనిక స్థావరాలు, విద్యుత్ గ్రిడ్లు, జలవిద్యుత్ కేంద్రాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, ఓడరేవులు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు ఉండే జిల్లాలు.

జనసాంద్రత ఎక్కువగా ఉండే పట్టణాలు: జనసాంద్రత ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాలను శత్రుదేశాలు లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంటుంది కాబట్టి వాటిని కూడా ఈ జాబితాలో చేరుస్తారు. జనసాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల ఆయా ప్రాంతాల్లో తరలింపు ప్రక్రియలు కొంత సంక్లిష్టంగా ఉంటాయి. కాబట్టి ఆమేరకు ముందుజాగ్రత్తచర్యలు తీసుకుంటారు.

తీరప్రాంత జిల్లాలు: శత్రుదేశాల నౌకాదళ దాడుల ముప్పు అధికంగా ఉండే తీర ప్రాంతాలను కూడా ఈ జాబితాలో చేర్చారు.

ఈ నాలుగు రకాల ప్రాంతాలనూ సివిల్ డిఫెన్స్ జిల్లాలుగా ప్రకటించిన ప్రభుత్వం యుద్ధసమయాల్లో ఆయా జిల్లాల్లో యుద్ధసన్నద్ధతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తాయి.



మా నీళ్లు ఇక మాకే...!

» సింధు జలాలపై ప్రధాని మోదీ వ్యాఖ్య



న్యూఢిల్లీ, మే 6: ఇప్పటి వరకు ఇతరులకు ఇచ్చిన మన నీళ్లు ఇకపై మనకేనని ప్రధాని మోదీ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఏబీపీ మీడియా గ్రూప్ మంగళవారం నిర్వహించిన కాంక్లేవ్‌లో మాట్లాడుతూ.. ఈమేరకు వ్యాఖ్యానించారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న సింధు నది జలాల ఒప్పందాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే పొరుగు దేశం పేరు ఎత్తలేదు. "ఇక భారత జలాలు భారత్ కోసమే ప్రవహిస్తాయి... నిల్వ ఉంటాయి.. దేశ ప్రయోజనాలకే వినియోగమవుతాయి..." అని ప్రధాని మోదీ కాంక్లేవ్‌లో పేర్కొన్నారు. తద్వారా సింధు నది జలాల విషయంలో భారత్ అనుసరించనున్న వైఖరిని స్పష్టం చేశారు.

మాపై భారత్ దాడి చేస్తే... ప్రపంచంలో ఎవ్వరూ మిగలరు!

» పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్య



ఇస్లామాబాద్, మే 6: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్ కనుక పాకిస్థాన్‌పై దాడి చేసే సాహసానికి ఒడిగట్టి.. పాక్ ఉనికికి ముప్పు ఏర్పడితే.. ప్రపంచంలోనే ఎవ్వరూ మిగలరని అన్నారు. అంతేకాకుండా, ఇండియా, పాక్ మధ్య పరిస్థితిని గాజాపై ఇజ్రాయెల్ దాడితో పోల్చారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ స్నేహితుడు కూడా అదే మనస్తత్వం ప్రదర్శిస్తున్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి విమర్శించారు. ఖవాజా ఓ టీవీ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

లష్కరే.. మీ భూభాగంలోది కాదా?

ఉగ్రదాడిపై మీ ప్రమేయం లేదా?.. మీ తప్పులు కప్పిపుచ్చుకోవద్దు!

» పాకిస్థాన్ తీరుపై నిప్పులు చెరిగిన ఐరాస భద్రతా మండలి సభ్యులు

» ఐక్యరాజ్యసమితిలో ఏకాకైన పాకిస్థాన్

» మిత్ర దేశం చైనా సహా అన్నీ మౌనం

న్యూయార్క్, మే 6: ఐక్యరాజ్యసమితి(ఐరాస)కి చెందిన శక్తిమంతమైన భద్రతా మండలి సమావేశంలో భారత్‌ను దోషిగా చూపేందుకు, భారత్‌పై నిప్పులు చెరిగేందుకు ప్రయత్నించిన పాకిస్థాన్‌కు తగిన శాస్తి జరిగింది. భారత్‌పై లేనిపోని ఆరోపణలు చేసి.. ఐరాస దృష్టిలో విలన్‌ను చేయాలని అత్యుత్సాహం ప్రదర్శించిన పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి అసీం ఇఫ్తిఖార్ అహ్మద్‌కు భద్రతా మండలి తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టింది. "మీరు చేస్తున్నదేంటి? అసలు పహల్గాం ఉగ్రదాడిలో లష్కరే తాయిబా ప్రమేయంపై మీరేం చెబుతారు?. ఉగ్ర సంస్థ మీ భూభాగంలోది కాదా? క్షిపణి దాడులు, అణ్వాయుధాల ప్రయోగం అంటూ మీరెందుకు రెచ్చగొడుతున్నారు?. ఇదేం విధానం?." అంటూ.. భద్రతా మండలి అసీంపై నిప్పులు చెరిగింది. దీంతో ఆయన సమాధానం చెప్పలేక, ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించి చతికిలపడ్డారు. ఈ క్రమంలో ఏ ఒక్కదేశానికి చెందిన ప్రతినిధి కూడా పాకిస్థాన్ తరఫున నోరు విప్పేందుకు సాహసించలేదు. అందరూ మౌనంగా ఉండిపోయారు. దీంతో కీలకమైన భద్రతా మండలిలో పాక్ ఏకాకి అయింది. అంతేకాదు.. పాకిస్థాన్ మిత్ర దేశం చైనా కూడా ఈ సమయంలో మౌనంగా ఉండిపోవడం గమనార్హం.



కాగా, ఇరు దేశాలు పరస్పర చర్చల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని మండలి సూచించింది.

పిలిచి మరీ తలంటించుకుని!

పాకిస్థాన్ ఏరికోరి సోమవారం ఐరాస భద్రతా మండలిలో 'తమ' విషయాన్ని చర్చించాలని పట్టుబట్టింది. దీంతో మండలి అధ్యక్షుడు సెకెరిస్ ప్రత్యేక భేటీ ఏర్పాటు చేసి.. పలు విషయాలు చర్చించాలని నిర్ణయించారు. అయితే.. ఈ సమావేశంలో పాక్ శాశ్వత ప్రతినిధి అసీం.. భారత్‌పై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసి భద్రతా మండలి దృష్టిని మళ్లించి, తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించారు. అయితే, భద్రతా మండలి పాక్‌నే నిలదీసింది. పదునైన ప్రశ్నలతో పాక్ ప్రతినిధి అసీంను ఉక్కిరిబిక్కిరి చేసింది. భారత్‌పై అసీం చేసిన వ్యాఖ్యలను 'తప్పుడు అజెండా' అంటూ అసీం వాదనను సభ్యులు నిర్ద్వంద్వంగా కొట్టిపారేశారు. క్షిపణి పరీక్షలు, అణు దాడుల హెచ్చరికలపై భద్రతా మండలి ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇదేం విధానం?. ఇవి హెచ్చరికలు కావా? బెదిరింపులు కావా?. వీటిని ఎలా సమర్థించుకుంటారు?." అని సభ్యులు నిలదీశారు. "పహల్గాం ఉగ్రదాడి ఘటన వెనుక లష్కరే తాయిబా ఉంది. ఇది మీ భూభాగం నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిలో మీ పాత్ర లేదా?. మీరు తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయొద్దు." అని అసీంను భద్రతా మండలి సభ్యులు నిలదీశారు. కాగా.. ఈ సమావేశంలో పాకిస్థాన్‌కు అత్యంత ఆప్తమిత్ర దేశంగా ఉన్న చైనా కూడా మౌనం వహించింది.

ఫలించిన మోదీ మంత్రాంగం!

ఐరాసలో పాక్‌ను ఏకాకి చేయడంలో ప్రధాని మోదీ మంత్రాంగం ఫలించింది. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం ఆయన ఐరాస శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలతో స్వయంగా మాట్లాడిన మోదీ.. ఉగ్రవాదులకు పాక్ అండగా ఉంటున్న వైనాన్ని, పహల్గాం ఉగ్రదాడిని సమగ్రంగా వివరించారు. మరోవైపు శాశ్వత సభ్యత్వం లేని దేశాలతో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడి.. ఐరాసలో పాక్‌ను ఒంటరిని చేయడంలో విజయం సాధించారు. దీంతో చైనా సహా ఏ ఒక్కదేశం కూడా పాక్‌కు అనుకూలంగా నోరెత్తకపోవడం గమనార్హం.

భారత్‌తో పోరాటమా.. మౌనమే!

» పాక్‌లో ఓ మతగురువు ప్రశ్నకు.. అక్కడి ప్రజల నుంచి మౌనమే సమాధానం

న్యూఢిల్లీ, మే 6: భారత్‌తో యుద్ధం విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వానికి సొంత ప్రజల నుంచే మద్దతు లభించని పరిస్థితి కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లోని లాల్ మసీదు మతగురువు మౌలానా అబ్దుల్ అజీజ్ ఘాజీ.. ప్రజలు, విద్యార్థులతో మాట్లాడుతూ "భారత్‌తో పాకిస్థాన్ యుద్ధం చేస్తే.. మీలో ఎందరు మద్దతు ఇస్తారు?" అని ప్రశ్నించారు. అక్కడున్నవారిలో ఒక్కరు కూడా చేయి ఎత్తలేదు, మౌనంగా ఉండిపోయారు. ఇదిచూసిన మతగురువు.. ఈ మౌనం చూస్తే అంతా అర్థమైపోతోందని పేర్కొన్నారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతాల్లో సొంత ప్రజలపైనే పాక్ సైన్యం బాంబులు వేస్తోందని మండిపడ్డారు.

పాక్ సరిహద్దుల్లో వార్ గేమ్!

న్యూఢిల్లీ, మే 6: పాక్‌తో ఉద్రిక్తతలు ముదురుతున్న నేపథ్యంలో సరిహద్దుల్లో భారీ స్థాయిలో వార్ గేమ్‌కు భారత వాయుసేన సిద్ధమైంది. బుధ, గురువారాల్లో రాజస్థాన్‌లో సరిహద్దులకు సమీపంలో డ్రిల్ నిర్వహించేందుకు సిద్ధమైంది. బుధవారం రాత్రి 9.30 గంటలకు ఈ విన్యాసాలు ప్రారంభమై శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ముగియనున్నాయి.

పాక్ ఆర్మీ వాహనంపై దాడి

ఇస్లామాబాద్, మే 6: బలూచిస్థాన్‌లో కచ్చి జిల్లాలో జరిగిన మంగళవారం ఉగ్రదాడిలో ఏడుగురు పాకిస్థానీ సైనికులు మరణించారు. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ)కి చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది.

సైరన్ మోగగానే.. అలర్ట్..!

» నేడు విశాఖపట్నం, బాపట్లలో మాక్ డ్రిల్ నిర్వహణ

విశాఖపట్నం, బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో బుధవారం 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాల మేరకు ఏపీలోని విశాఖపట్నం, బాపట్లలో బుధవారం మాక్ డ్రిల్ చేపట్టనున్నారు. ఒకవేళ పాకిస్థాన్ మనపై ప్రతిదాడి చేస్తే.. ఆ సమయంలో ప్రజలు ఎలా స్పందించాలో ఈ మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తారు.

విశాఖపట్నంలో ఎందుకు..?

విశాఖలో నౌకాదళ స్థావరం, పోర్టులు, విమానాశ్రయం, ఆయిల్ రిఫైనరీలు, స్టీల్ ప్లాంటు ఇంకా అనేకం ఉన్నాయి. ఒకవేళ శత్రువు ఈ నగరంపై ప్రతిదాడి చేస్తే ఎలా స్పందించాలి.. అని అవగాహన కల్పించేందుకు సివిల్ డిఫెన్స్ విభాగం మాక్ డ్రిల్ ఏర్పాట్లు చేస్తోంది. నగరంలోని పాత పోస్టాఫీస్ దగ్గరున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర మెడికల్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్, దొండపర్తిలోని రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయం, విశాఖపట్నం పోర్టు, ఏయూ అవుట్ గేట్ దగ్గరున్న జేవీడీ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ, వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ పాఠశాల పరిసరాలలో డ్రిల్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏం చేయాలి, ఎక్కడ దాక్కోవాలి..?, మిగిలిన వారికి ఎలాంటి సాయం చేయాలి..?, రాత్రి వేళ సైరన్లు మోగితే ఏంచేయాలి..? వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు.

సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సారథ్యంలో..

బాపట్లలోని సూర్యలంకలో ఉన్న ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారుల సారథ్యంలో బుధవారం మాక్ డ్రిల్ చేపట్టనున్నారు. దీనిలో మెరైన్‌తో పాటు పోలీస్ విభాగం కూడా భాగస్వామ్యం కానున్నాయి. కలెక్టర్ వెంకటమురళి మంగళవారం సాయంత్రమే మాక్‌డ్రిల్‌కు సంబంధించి ఎయిర్‌ఫోర్స్ అధికారులతో చర్చించి విధివిధానాలను ఖరారు చేశారు.


మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు

ప్రపంచ సుందరి పోటీలకు ఎవరైనా హాజరు కావచ్చు

హైదరాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలకు ఎవరైనా హాజరు కావొచ్చని తెలంగాణ పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. కేవలం ప్రముఖులకు మాత్రమే అన్నది అపోహ అని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. మరోవైపు 'నమస్కారం. అందరూ ఎలా ఉన్నారు?' అంటూ మిస్‌వరల్డ్ ఇండియా నందినీ గుప్తా తెలుగులో అందరినీ పలకరించారు. ఈ పోటీలకు సన్నద్ధమయ్యానని చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు 70 దేశాల అందగత్తెలు బుధవారం హైదరాబాద్ చేరుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, పోటీలకు వస్తున్న అతిథులు, విదేశీ పాత్రికేయులు, పోటీదారుల భద్రతపై కేంద్రం దృష్టి సారించింది.

పహల్గాం దాడిపై మోదీకి ముందే నిఘా సమాచారం

» దాంతోనే కశ్మీరు పర్యటన రద్దు: ఖర్గే ధ్వజం

రాంచీ, మే 6: పహల్గాంలో ఉగ్రదాడికి సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి గురించి ప్రధాని మోదీకి ముందే తెలుసన్నారు. మూడ్రోజుల ముందే నిఘా సమాచారం అందిందని.. దాంతో జమ్మూకశ్మీరు పర్యటనను ఆయన రద్దుచేసుకున్నారని తెలిపారు. మంగళవారం రాంచీలో జరిగిన ర్యాలీలో ఖర్గే ప్రసంగించారు. 'పహల్గాం దాడికి మూడ్రోజుల ముందు మోదీకి నిఘా నివేదిక అందిందని.. దాంతో పర్యటన రద్దు చేసుకున్నారని నాకు తెలియవచ్చింది" అని చెప్పారు. "ఈ సమయంలో జమ్ముకశ్మీర్‌లో పర్యటించడం మీ భద్రతకు మంచిది కాదు" అని నిఘా నివేదిక సూచించిందన్నారు. "అలాంటప్పుడు ప్రజలను రక్షించేలా పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు. పర్యాటకులను రక్షించడానికి మరిన్ని బలగాలను ఎందుకు పంపలేదు" అని ఖర్గే నిలదీశారు. పాక్‌పై కేంద్రం ఏ చర్య తీసుకున్నా కాంగ్రెస్ సమర్థిస్తుందని స్పష్టంచేశారు. గతనెల 19న కాత్రా నుంచి శ్రీనగర్‌కు తొలి రైలును ప్రారంభించేందుకు ప్రధాని కశ్మీరు వెళ్లాల్సి ఉంది. ప్రతికూల వాతావరణం

డార్క్ షిప్‌లను గుర్తించే హాక్‌ఐ 360

భారత్‌కు నిఘా టెక్నాలజీ విక్రయానికి అమెరికా ఆమోదం

న్యూఢిల్లీ, మే 6: పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. భారత నిఘా సామర్థ్యాన్ని పెంచేలా కీలక ముందడుగు పడింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర నిఘాను పెంచేందుకు వీలుగా హాక్‌ఐ 360 అనే ఉపగ్రహ ఆధారిత నిఘా సాంకేతికతను భారత్‌కు విక్రయించడానికి అమెరికా ఆమోదం తెలిపింది. 'సీ విజన్ సాఫ్ట్‌వేర్‌తోపాటు ప్రాధాన్యత కలిగిన సాఫ్ట్‌వేర్ మెరుగుదల, సాంకేతిక సహాయ బృందం ద్వారా శిక్షణ, రిమోట్ సాఫ్ట్‌వేర్, డాక్యుమెంట్లు, ఇతర లాజిస్టిక్స్, ప్రోగ్రామ్ సపోర్ట్ కావాలని భారత్ కోరింది. ఈ ప్యాకేజీ మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.11 వేల కోట్లు' అని అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ తెలిపింది. హాక్ ఐ 360 అనేది అమెరికాకు చెందిన జియోస్పేషియల్ అనలిటిక్స్ కంపెనీ. ఇది తన సాంకేతికతతో తక్కువ భూ కక్ష్యలోని ఉపగ్రహాల సాయంతో రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) ఉద్గారాల ఆధారంగా ఆ సిగ్నల్ ఎక్కడి నుంచి వస్తుందో గుర్తిస్తుంది. నౌకలు, విమానాలతోపాటు తీర వ్యవస్థల నుంచి వచ్చే సంకేతాలను ట్రాక్ చేస్తుంది. ట్రాకింగ్ నుంచి తప్పించుకునేందుకు ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్)ను ఆఫ్ చేసుకుని తిరిగే 'డార్క్ షిప్'లను సైతం హాక్‌ఐ 360 టెక్నాలజీ గుర్తిస్తుంది. ఈ సాంకేతికత భారత్‌కు అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్ర ప్రాంతంలో అక్రమంగా చేపలు పట్టే వారిని, స్మగ్లింగ్ చేసే వారిని, డార్క్ షిప్‌లను సులువుగా గుర్తించవచ్చు. అలాగే సముద్ర ప్రాంతంపై గట్టి నిఘా పెట్టవచ్చు. ప్రస్తుతం భారత నౌకాదళం వ్యూహాత్మక ప్రదేశాలను పర్యవేక్షించడానికి, ఏఐఎస్‌ను ఆఫ్ చేసుకుని తిరిగే డార్క్ షిప్‌లను గుర్తించడానికి పీ 8 ఐ నిఘా విమానాలు, సీ గార్డియన్ డ్రోన్లను వినియోగిస్తోంది. అయితే హాక్‌ఐ 360 టెక్నాలజీతో భారత్ తన ఎకనామిక్ జోన్ అంతటా నిఘా పెట్టడానికి అవకాశం ఉంటుంది.

వనరులిస్తాం.. ఉగ్రవాదంపై పోరాడండి

వాషింగ్టన్, మే 6: ఉగ్రవాదంపై పోరులో భారతదేశానికి శక్తిని, వనరులను అందిస్తామని అమెరికా కాంగ్రెస్ ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ ప్రకటించారు. సోమవారం క్యాపిటల్ హిల్‌లో అయన మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్ని విధాలా మద్దతును అమెరికా అందిస్తుందని చెప్పారు. 'భారత్‌తో సంబంధాల ప్రాముఖ్యతను ట్రంప్ యంత్రాంగం గుర్తించింది. అలాగే, ఉగ్రవాదం నుంచి పొంచి ఉన్న ముప్పును కూడా ట్రంప్ యంత్రాంగం గుర్తించింది. భారత్‌కు ఇప్పుడు మరింత శక్తిని, వనరులను అందించాల్సిన సమయం ఆసన్నమైంది' అన్నారు.

8 నుంచి కేఎల్‌యూలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

- కేఎల్ఈఈ ప్రవేశపరీక్ష ర్యాంకర్లతోపాటు ఇంటర్ మార్కులు, జేఈఈ పర్సెంటైల్ ఆధారంగా మెరిట్ అడ్మిషన్లు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 6(ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. 8వ తేదీ ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని జాతీయ స్థాయిలో నిర్వహించిన కేఎల్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో 30 వేల లోపు ర్యాంకులు వచ్చిన విద్యార్థులు, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, సాంస్కృతికం, ఎక్స్ సర్వీస్ మెన్ కోటాతో పాటు ఓపెన్ కేటగిరీలో ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు పొందిన విద్యార్థులు మొదటి రోజు కౌన్సెలింగ్‌లో పాల్గొంటారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9, 10, 11 తేదీల్లో కేఎల్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో 30 వేలకు పైగా వచ్చిన ర్యాంకర్లు, ఓపెన్ కేటగిరీ కింద ఇంటర్, జేఈఈలలో మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కౌన్సెలింగ్ ద్వారా సులువుగా అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నట్టు కౌన్సెలింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుమన్ పేర్కొన్నారు.

ఏపీఈసెట్‌కు 97శాతం హాజరు

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్-2025కు 97.27 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. తెలంగాణలో 1,326 మందికి గాను 1,272 మంది, ఏపీలో 33,861 మందికిగాను 32,956 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఏపీఈసెట్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. ప్రాథమిక కీ ఈ నెల 8న విడుదల చేస్తామని చెప్పారు.

నేడు ఏపీ ఐసెట్.. 94 కేంద్రాల్లో నిర్వహణ

విశాఖపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం బుధవారం ఐసెట్-2025 నిర్వహించనున్నట్టు సెట్ చైర్మన్, ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ వెల్లడించారు. పరీక్షకు 37,572 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో 93 కేంద్రాలతోపాటు తెలంగాణలోని హైదరాబాద్‌లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్టు చెప్పారు.

'దేవదాయ'లో పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్



దేవదాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఆనం, అధికారులు

సీఎం నిర్ణయంపై నిరుద్యోగుల హర్షం

దేవదాయ శాఖలో ఖాళీల భర్తీకి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల భర్తీకి త్వరితగతిన నోటిఫికేషన్ ఇవ్వాలని వారు కోరుతున్నారు.దేవదాయ శాఖలో కీలకమైన డిప్యూటీ కమిషనర్ పోస్టులు ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసి దాదాపు 29 ఏళ్లు అయింది. 1996లో చంద్రబాబు తొలుత ముఖ్యమంత్రి అయినప్పుడు రెండు డీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటి నుంచి మళ్లీ ఇప్పుడే డీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు.

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీల భర్తీకి సీఎం ఆమోదం తెలిపారు. ఐదు విభాగాల్లో 137 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరు డిప్యూటీ కమిషనర్, 5 అసిస్టెంట్ కమిషనర్ పోస్టులతో పాటు ఆరు గ్రేడ్-1 ఈవో, 104 గ్రేడ్-3 ఈవో పోస్టులు, 16 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియ త్వరగా పూర్తి చేసి ఆలయాలు సమర్థంగా నిర్వహించేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే 200 వరకు ఉన్న వైదిక సిబ్బంది ఖాళీలను కూడా అర్హులతో భర్తీ చేయాలని ఆదేశించారు. దేవదాయ శాఖలో పోస్టుల ఖాళీలపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. సింహాచలం ఘటన తర్వాత కూడా "దేవుడి శాఖకు ఇన్‌చార్జిలే దిక్కు" శీర్షికన ప్రత్యేక కథనం ఇచ్చింది. ఈ నేపథ్యంలో స్పందించిన సీఎం చంద్రబాబు శాఖలో అన్ని కేడర్లలోని పోస్టుల భర్తీ చేయాలని ఆదేశించారు.

అన్నప్రసాదం రుచిగా, నాణ్యతగా..

రాష్ట్రంలో అవకాశం ఉన్న ప్రతి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని సీఎం సమీక్షా సమావేశం సందర్భంగా అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో 23 ప్రధాన ఆలయాలు ఉండగా వీటిలో శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, బెజవాడ కనకదుర్గమ్మ, అన్నవరం, ద్వారకా తిరుమల, సింహాచలం ఆలయాల్లో మాత్రమే నిత్యాన్నదానం జరుగుతోంది. మిగిలిన 16 ఆలయాల్లో కూడా భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం అమలు చేయాలని సీఎం ఆదేశించారు. అన్నప్రసాదం రుచి, నాణ్యత, పరిశుభ్రత ఉండేలా, భక్తులకు పవిత్ర భావన కలిగేలా అందించాలన్నారు. ఇందుకోసం వలంటరీగా వచ్చే వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అన్నప్రసాద కార్యక్రమానికి ఆదాయం సరిపోని ఆలయాలకు 7 ప్రధాన ఆలయాల నుంచి నిధులు సమకూర్చేలా చూడాలన్నారు. 'తిరుమల వెంగమాంబ అన్నప్రసాదం తరహాలో ప్రమాణాలు పాటించాలి' అని సూచించారు. అలాగే ప్రసాదాల నాణ్యతపైనా దృష్టి పెట్టాలని, ఆయా ఆలయాల ప్రసాదాల విశిష్టత కొనసాగేలా చూడాలని, నాణ్యతా పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు.

టెంపుల్ టూరిజానికి ప్రణాళికలు

రాష్ట్రంలోని అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. మొదటి దశలో 23 ఆలయాలకు సంబంధించి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఈ మాస్టర్ ప్లాన్ ఆగమ శాస్త్రానికి అనుగుణంగా ఉండాలని, టెంపుల్ టూరిజానికి గ్రోత్ ఇంజన్ అయ్యేలా చూడాలని నిర్దేశించారు. దేవాలయ భూములు ఆక్రమణకు గురికాకుండా, ఆస్తులను పరిరక్షించేలా, వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు ఒక కమిటీ వేసి సమగ్ర విధానాన్ని తీసుకురావాలన్నారు. దీంతో వచ్చే ఆదాయాన్ని తిరిగి ఆలయాల అభివృద్ధికి వినియోగించాలన్నారు. ఈ క్రమంలో ఎక్కడా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని, దేవదాయ భూములను హోటళ్లకు లీజుకు ఇచ్చినప్పుడు అక్కడ శాకాహారం మాత్రమే అందించేలా అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశారు. 'బాలాజీ ఆలయ నిర్మాణ నిధి ఏర్పాటు చేసి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక కొత్త ఆలయం నిర్మాణం చేపట్టాలి. ఆలయాలను నిర్మించి, నిర్వహణను విస్మరించొద్దు. ఆలయ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా నిత్యం దూపదీప నైవేద్యాలు అందేలా చూడాలి. దేవాలయాలపై దాడులు చేస్తే కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి' అని నిర్దేశించారు. 6సీ కేటగిరి కింద నోటిఫైడ్ అయిన 24,538 ఆలయాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

తిరుపతి స్థాయిలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధి

రాష్ట్రంలో ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠం రెండూ కొలువైన ఒకే ఒక్క క్షేత్రం శ్రీశైలమని, తిరుపతి స్థాయిలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీశైలంలో దేవదాయ శాఖ భూములు పరిమితంగా ఉన్నందున ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు భూముల కేటాయింపులో ఆచితూచి వ్యవహరించాలని స్పష్టం చేశారు. శ్రీశైలంలో వసతి గృహాలను ప్రభుత్వమే నిర్మించేలా చూడాలని చెప్పారు. అన్ని ఆలయాల్లో పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించారు. 6ఏ కేటగిరి ఆలయాల్లో ఇప్పటికే 19 వేల మొక్కలు నాటామని, అటవీ శాఖ సమన్వయంతో మిగిలిన ఆలయాల్లో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఆలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చేలా సెంట్రలైజ్డ్ శానిటేషన్ టెండర్లు పిలిచామన్నారు. 175 ఆలయాల్లో ఆన్‌లైన్ దర్శనం, సేవ, వసతి, ఈ -హుండీ వంటివి తీసుకువచ్చామన్నారు. రూ.7 కోట్ల ఆదాయం కన్నా ఎక్కువ వచ్చే 22 ఆలయాల్లో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రవేశపెట్టామని వివరించారు. కృష్ణా, గోదావరి హారతులు ప్రతినిత్యం కొనసాగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొత్తం నోటిఫైడ్ ఆలయాలకు ఏడాదికి రూ.1,300 కోట్లకు పైగా ఆదాయం వస్తోందని, అందులో రూ.850 కోట్లు టాప్ 7 ఆలయాల నుంచి సమకూరుతోందన్నారు. రూ.5 లక్షల కన్నా ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాల నుంచి 9 శాతం మొత్తాన్ని కామన్ గుడ్ ఫండ్ కింద జమ చేస్తున్నామన్నారు. 2024-25లో సీజీఎఫ్‌కు రూ.149 కోట్లు రాగా, రాష్ట్రంలో వివిధ ఆలయాల్లో రూ.111 కోట్లతో 48 ముఖ్యమైన పనులు జరుగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

జగన్ హయాంలో అవినీతిపై చర్యలకు శ్రీకారం

- నేడు టీటీడీ అత్యవసర సమావేశంలో చర్చ

తిరుమల, మే 6(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన అవినీతిపై చర్యలకు టీటీడీ శ్రీకారం చుట్టబోతున్నట్టు తెలుస్తోంది. ఈ అంశంపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన చర్యల గురించి నేడు తిరుమలలో జరగనున్న టీటీడీ అత్యవసర సమావేశంలో చర్చ జరగనున్నట్టు సమాచారం. అలాగే ఎన్నికలకు ముందు రూ.1600 కోట్ల టీటీడీ నిధులను హడావిడిగా నిర్మాణాలకు కేటాయించిన తీరు మీద కూడా విచారణ పూర్తయినట్టు తెలుస్తోంది. నివేదికను విజిలెన్స్ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే సమర్పించినట్టు సమాచారం. బుధవారం జరుగనున్న బోర్డు సమావేశంలో అలిపిరి కొండలను అనుకుని ఉన్న ఏపీ టూరిజం స్థలం మార్పిడిపైనా చర్చ జరుగనుంది. తిరుమల పవిత్రతకు భంగం కలగకుండా కొండలను అనుకుని ఉన్న స్థలంలో ప్రైవేట్ నిర్మాణాలు జరగకూడదని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో ఒబెరాయ్ హోటల్స్‌కు కేటాయించిన ఏపీ టూరిజం స్థలాన్ని టీటీడీ స్వాధీనం చేసుకుని ప్రత్యామ్నాయంగా టూరిజంకు టీటీడీకి చెందిన స్థలాన్ని కేటాయించే అంశంపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఉక్కు యాజమాన్యానికి షర్మిల డెడ్‌లైన్

- 20 లోగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



రిలే నిరాహార దీక్షల శిబిరంలో వైఎస్ షర్మిల

కూర్మన్నపాలెం(విశాఖపట్నం), మే 6(ఆంధ్రజ్యోతి): తొలగించిన కాంట్రాక్టు కార్మికులను ఉక్కు కర్మాగారం యాజమాన్యం ఈ నెల 20వ తేదీలోపు విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో 21 నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హెచ్చరించారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. కార్మికులకు సంఘీభావంగా ఉదయం 11.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ దీక్షలో పాల్గొన్నారు. ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ ఆమెకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానము
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం: తిరుపతి

ADV No. 09/D3/CE/TTD/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన Dt.06.05.2025

టిటిడి ఇంజనీరింగ్ శాఖ యొక్క పదిహేడు (17) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. SE-I:- NIT No:10 to13/SE-I/2025-26 (4 పనులు), SE-II:- NIT No:72 to 73/SE-II/2025-26 (2 పనులు), EE-V:- NIT No:10/EE-V/2025-26 (1 పని), EE-IX:- NIT No:1 to 2/EE-IX/2025-26 (2 పనులు), EE-XII:- NIT No:5 to 6/EE-XII/2025-26 (2 పనులు), EE-XIV:- NIT No: 3/EE-XIV/2025-26 (1 పని), EE-XV:- NIT No:2/EE-XV/2025-26 (1 పని), DE(Elec)-I:- NIT No:17 to 20 /DE(Elec)-I/2025-26 (4 పనులు) తదుపరి పని వివరాల కొరకు www.tirumala.org. మరియు http:// tender.apeprocurement.gov.in ను లాగిన్ కాగలరు.

కార్యనిర్వహణాధికారి

TTD-40021/10/2025-PRO SEC (Adv. No.52), Dt: 06.05.2025

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LIMITED
Corporate office: H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati-517503

Tender Notice (e-procurement)

Bids through e-procurement are invited from the eligible bidders for (1) AMC for the physical infrastructure of the Data Centre located at Corporate Office, APSPDCL, Tirupati for the period of one year. For further details: www.apeprocurement.gov.in **CHIEF GENERAL MANAGER/PROJECTS & IT**

(2) Construction of (a) Office Building at 33/11KVSS, Tuggali (b) Compound wall at 33/11KV outdoor SS, Maddikera in Kurnool Circle (c) Toilet Block in the premises of Power House Compound, Nandyal, Nandyal Circle. For further details: www.apeprocurement.gov.in **CHIEF GENERAL MANAGER/P&MM & CIVIL**

(3) (a) Providing of 1 no. Xerox machine along with operator & maintenance (b) Maintenance & repairs to Desktops, Laptops, Printers & Scanners at Circle office, Anantapur (c) Carryout of repairs to OLTC's power transformers at various 33/11KV SSs (d) Repairs to failed CTs & PTs in MRT Division, Anantapur Circle. For further details: www.apeprocurement.gov.in **SUPERINTENDING ENGINEER/Opn/ANANTAPUR**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.09 to 33/TO/2025-26 తేది: 02.05.2025

కృష్ణా జిల్లాలో NABARD-RIDF-XXX గ్రాంట్ క్రింద రూ.3624.00 లక్షల అంచనా వ్యయంతో 25 రోడ్ల పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ అప్‌లోడ్ & డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.05.2025 నుండి. తదుపరి వివరాలకు దర్శించండి: www.tender.apeprocurement.gov.in, ఫోన్: 6305693265

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పంచాయతీరాజ్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా

DIPR RO No.16288/CL/ADVT/1/1/2021-22, Dt: 06.05.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ

నెం.ఎ.టి.ఒ./02/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది:02.05.2025

పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు వారి పరిధిలోని వివిధ నియోజకవర్గంలలో నాబార్డ్-ఆర్.ఐ.డి.ఎఫ్-XXX (ప్లెయిన్, ఎస్.సి.పి.మరియు ఎస్.టి.సి) నిధులతో మంజూరు కాబడిన రూ.5851.84 లక్షలతో 42 పనులకు టెండర్లు తేది:09.05.2025 నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు. సం/- పర్యవేక్షక ఇంజనీర్, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు

DIPR RO No.16302/CL/ADVT/1/1/2021-22, Dt: 06.05.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ

నెం.టి.ఒ./1 నుండి 22/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది:03.05.2025

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో (Erstwhile)21 రోడ్డు పనులు మరియు 1 వంతెన నిర్మాణ పనులకు గాను అంచనా విలువ రూ.3219.00 లక్షలతో పనులు చేపట్టుట కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-ప్లాట్ ఫారంలో డాక్యుమెంట్ లభ్యత తేది:09.05.2025 నుండి 23.05.2025 మ.3గం.ల వరకు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 23.05.2025న సా.4గం.ల వరకు. సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, నెల్లూరు

DIPR RO No.16303/CL/ADVT/1/1/2021-22, Dt: 06.05.2025

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలకు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

టెండరు ప్రకటన కోరుతూ ఇ-టెండరు నం.Dy.CE-GS-BZA-01&02 తేది:05.05.2025 (ireps.gov.in ద్వారా) PUB/0507

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతి శక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు దిగువ తెలిపిన పనుల కొరకు బహిరంగ టెండరు/ సింగిల్ ప్యాకెట్ టెండరింగ్‌లో ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.:1. టెండరు నం. మరియు తేది: Dy.CE-GS-BZA-01-2025-26, తేది: 02.05.2025. పని వివరణ: SW-1. విజయవాడ డివిజన్: విజయవాడ - గుడివాడ (BZA-GDV) సెక్షన్: రామవరప్పాడు - నిడమనూరు స్టేషన్ల మధ్య రైల్వే కి.మీ 12/18-20 వద్ద LC No.14 కు బదులుగా రెండు లేన్ రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ROB) ప్రతిపాదిత నిర్మాణం. బ్రిడ్జి ప్రొపర్: 1x18.0m PSC గిర్డర్ + 1x72.0m Bow స్ట్రింగ్ గిర్డర్ + 1x48.0m Bow స్ట్రింగ్ గిర్డర్ + 1x18.0m PSC గిర్డర్. అప్రోచెస్ స్పాన్స్: నిడమనూరు గ్రామం మీదుగా 7x24.6m RCC గిర్డర్ మరియు NH-16 పై రెండు వైపులా రెయిన్‌ఫోర్స్డ్ ఎర్తెన్ వాల్స్‌తో 8x24.6m RCC గిర్డర్. SW-2. విజయవాడ డివిజన్: విజయవాడ - గుడివాడ (BZA-GDV) సెక్షన్: రైల్వే కి.మీ 18/16-18 వద్ద LC No.20 కు బదులుగా స్పాన్ 1x18.0m PSC గిర్డర్ + 1x72.0m Bow స్ట్రింగ్ గిర్డర్ + 1x18.0m PSC గిర్డర్ రెండు లేన్ రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ROB) ప్రతిపాదిత నిర్మాణం. UPL - యార్డ్ స్టేషన్ల మధ్య కేసరపల్లి వైపు అప్రోచెస్ 9x24.6m RCC గిర్డర్ మరియు ఉప్పులూరు & కొనకపాడు వైపు పైల్ ఫౌండేషన్స్‌తో 9x24.6m RCC గిర్డర్. టెండరు విలువ (రూ.): 108,19,86,752.63. బయానా: (రూ.): 55,59,900/-. పూర్తిచేయు కాలం: 18 నెలలు. టెండరు ఫారం ధర (రూ.): లేదు. ముగింపు తేది & సమయం: 26.05.2025న 15:00 గం.లకు.

క్ర.సం.:2. టెండరు నం. మరియు తేది: Dy.CE-GS-BZA-02-2025-26, తేది: 03.05.2025. పని వివరణ: SW-1. విజయవాడ డివిజన్: గుడివాడ - మచిలీపట్నం (GDV-MTM) సెక్షన్: రైల్వే కి.మీ 32/15-17 వద్ద LC No.38 కు బదులుగా స్పాన్ 1x18.0m PSC గిర్డర్ + 1x72.0m Bow స్ట్రింగ్ గిర్డర్ + 1x18.0m PSC గిర్డర్ కు రెండు లేన్ రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ROB) ప్రతిపాదిత నిర్మాణం, పెడన - మచిలీపట్నం (PAV-MTM) స్టేషన్ల మధ్య తాళ్లపాలెం బీచ్ వైపు అప్రోచెస్ 9x24.6m RCC గిర్డర్ మరియు మచిలీపట్నం వైపు పైల్ ఫౌండేషన్స్‌తో 9x24.6m RCC గిర్డర్. SW-2. విజయవాడ డివిజన్: గుడివాడ - మచిలీపట్నం (GDV-MTM) సెక్షన్: రైల్వే కి.మీ 10/32-34 వద్ద LC No.12 కు బదులుగా స్పాన్ 1x18.0m PSC గిర్డర్ + 1x54.0m Bow స్ట్రింగ్ గిర్డర్ + 1x18.0m PSC గిర్డర్ కు రెండు లేన్ రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ROB) ప్రతిపాదిత నిర్మాణం. నూజెళ్ల - గుడ్లవల్లేరు స్టేషన్ల మధ్య గుడ్లవల్లేరు వైపు అప్రోచెస్ 7x24.6m RCC గిర్డర్ మరియు అద్దాడ రోడ్డు వైపు పైల్ ఫౌండేషన్స్‌తో 7x24.6m RCC గిర్డర్ మరియు 1 నం. LHS, 1x4.5mx3.0m సైజు RCC బాక్స్ ఏర్పాటు. టెండరు విలువ (రూ.): 103,23,75,336.85 బయానా: (రూ.): 53,11,900/-. పూర్తిచేయు కాలం: 18 నెలలు. టెండరు ఫారం ధర (రూ.): లేదు. ముగింపు తేది & సమయం: 26.05.2025న 15:00 గం.లకు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ https://ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2. బయానా మరియు టెండరు డాక్యుమెంట్ ధరను ఆన్‌లైన్‌లో IREPS లో అందుబాటులో ఉన్న నెట్‌బ్యాంకింగ్/ పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా మాత్రమే చెల్లించవలెను (లేదా) బిడ్ల సెక్యూరిటీగా FA&CAO/Con/SC పేరున బ్యాంకు గ్యారెంటీను దాఖలు చేయవచ్చును.
3. టెండరుదారులు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో టెండరుదాఖలు/ బిడ్డింగ్ దాఖలు ముగింపు కాలమైన పదిహేను రోజుల కాలవ్యవధిలో దాఖలు చేయవలెను.
4. టెండరుదారులు ఏవేని సవరణల కోసం (ఆన్‌లైన్‌లో జారీచేసినవి మాత్రమే) టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలం ప్రారంభ తేదీ వరకు గమనించవలెను.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతిశక్తి, విజయవాడ

ఇ-టెండరు ప్రకటన నం.: 42-Dy.CE/GS/GNT, తేది:02.05.2025 PUB/0508

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారు 28.05.2025న 15.30 గం.ల వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం: 01, టెండరు ఐడి: 81. సెక్షన్: Dy.CE/GS/GNT. పని వివరణ: SW1: GNT-KCC:గుంటూరు- నంబూరు స్టేషన్ల మధ్య కి.మీ.3/25-27 వద్ద LC నం.03 బదులుగా 4-లేన్ ROB నిర్మాణం. SW2: GNT-NDKD: నల్లపాడు - బండారుపల్లి స్టేషన్ల మధ్య కి.మీ.9/13-14 వద్ద LC నం.06 బదులుగా 2- లేన్ ROB నిర్మాణం. సుమారు విలువ: రూ.106,65,43,218.54. బయానా: రూ. 54,82,700/-

1.ఆన్‌లైన్ ఇ-బిడ్ల దాఖలుకు చివరి తేది 28.05.2025న 15.30 గం.ల వరకు. మరింత సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2.ఏదేని సమాచారం / సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతిశక్తి, గుంటూరు

టెండరు నం: GTL-EM-06-2025-26, తేది: 05.05.2025 PUB/0509

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్‌లను కోరుచున్నారు.

టెండరు నం: GTL-EM-06-2025-26.
పని పేరు: గుంతకల్ డివిజన్- కృష్ణ : కృష్ణ స్టేషన్ వద్ద క్విక్ వాటరింగ్ ఏర్పాట్లు- విద్యుత్ ఏర్పాట్లు.
సుమారు విలువ: రూ.2,17,32,497.89/-,
ముగింపు తేది & సమయం: 26.05.2025న 15.00 గం.లకు

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. టెండరుకు ఏదైనా సవరణ ఉంటే అది ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరు డాక్యుమెంట్‌ను టెండరుదారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
గమనిక: ఇ-టెండరులో పాల్గొనుటకు/బిడ్ వేయుటకు టెండరుదారు చెల్లుబాటయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి యుండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్

టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/401 తేది:16.04.2025 PUB/0516

టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/401 తేది:16.04.2025 కు సవరణ నం.03, తేది:01.05.2025

క్ర.నం.1, ప్రస్తుతం: దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ యొక్క ఎర్రుపాలెం- ఖమ్మం సెక్షన్‌లో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు కోసం సమగ్ర సిగ్నలింగ్ మరియు టెలికమ్యూనికేషన్ పనులు. సవరించినది: సవరణ నం.3 తేది: 01.05.2025, తదుపరి సవరించిన వివరాల కోసం వెబ్‌సైట్ www.ireps.gov.in ద్వారా చదవవచ్చు/చూడవచ్చు.

పై పనుల టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు, పని పూర్తి వివరణ, టెండరు నిబంధనలు, అర్హతా ప్రమాణాలు మరియు వివరాలు కలుపుకుని తదుపరి అన్ని వివరాల కొరకు భారత ప్రభుత్వ టెండరు పోర్టల్ వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించగలరు.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) సికింద్రాబాద్

A0634

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

రూ.5 వేల కోట్లు.. 2 వేల ఉద్యోగాలు

- శ్రీసిటీలో ఏర్పాటు కానున్న 'ఎల్‌జీ' యూనిట్
- రేపు మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- 839 కోట్లతో మరో 5 అనుబంధ యూనిట్లు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ప్రపంచ ప్రసిద్ధ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఎల్‌జీ రూ.5,001 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఒక తయారీ యూనిట్‌ను, మరో రూ.839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. వీటికి రాష్ట్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ గురువారం భూమిపూజ చేయనున్నారు. ఎల్‌జీ సంస్థ ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్‌లు సహా ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాల తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. రానున్న మూడేళ్లలో వివిధ దశల్లో రూ.5,001 కోట్లతో తమ యూనిట్‌ను స్థాపించనుంది. ఈ యూనిట్ ద్వారా 2 వేల ఉద్యోగాలు ఇస్తామని ఎల్‌జీ ఇప్పటికే పేర్కొంది. గత ఏడాది సెప్టెంబరులో జపాన్ నుంచి వచ్చిన ఎల్జీ కంపెనీ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్నేహపూర్వక పెట్టుబడి విధానాలపై ఆకర్షితులమయ్యామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. రాయలసీమను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చేందుకు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా అమలు చేస్తున్న విధానాల గురించి మంత్రి లోకేశ్ వారికి వివరించారు. దీంతో ఎల్‌జీ సంస్థ మౌలిక సదుపాయాలతో కూడిన సెజ్‌గా ప్రఖ్యాతిగాంచిన శ్రీసిటీలో ఎయిర్ కండిషనర్ల తయారీ యూనిట్‌ను స్థాపిస్తామని వెల్లడించింది.

రాష్ట్రానికి తరలివస్తున్న పరిశ్రమలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లోనే దాదాపు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులతో 5,00,000 ఉద్యోగాల కల్పన జరిగేలా పలు కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాష్ట్రానికి ఇప్పటికే టీసీఎస్, ఎన్‌టీపీసీ, టాటా పవర్, రిలయన్స్ సీబీజీ ప్లాంట్లు వచ్చాయి. రిలయన్స్ గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.65,000 కోట్ల విలువైన 500 యూనిట్లు ఏర్పాటు చేయబోతోంది.

సత్యవేడులో లోకేశ్ రెండ్రోజుల పర్యటన

సత్యవేడు, మే 6(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ బుధ, గురువారాల్లో తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించి, అనంతరం రోడ్డుమార్గాన బయలుదేరి 11 గంటలకు శ్రీసిటీకి చేరుకుని, అక్కడ ఎల్‌జీ పరిశ్రమ భూమి పూజలో పాల్గొంటారు.

పాస్‌పోర్ట్ రెన్యువల్ చేసేలా ఆదేశాలు ఇవ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత విడదల రజని

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): తన పాస్‌పోర్టు రెన్యువల్ చేసేలా విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిని ఆదేశించాలని కోరుతూ వైసీపీ నేత విడదల రజని దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలు సమర్పించాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.

మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు కన్నుమూత

- సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సంతాపం



రాయచోటి, మే 6(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంటు మాజీ సభ్యుడు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు (79) శ్వాసకోశ సమస్యతో మంగళవారం బెంగళూరులో కన్నుమూశారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉన్న ఆయన రాయచోటి నియోజకవర్గంపై చెరగని ముద్ర వేశారు. గురువారం ఉదయం 9 గంటలకు రాయచోటి పట్టణంలోని పాలకొండ్రాయుడు సినిమా థియేటర్ల సమీపంలోనే ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా.. పాలకొండ్రాయుడు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. పాలకొండ్రాయుడు కుమారులను చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు.

ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించండి

- అసైన్డ్ భూమిపై సైనికోద్యోగికి సంపూర్ణ హక్కులు లభిస్తాయి
- పదేళ్ల తర్వాత అమ్ముకునేందుకు వారు అర్హులే
- జీవోలు, సీసీఎల్ఏ సర్క్యులర్ ఇదే చెబుతున్నాయి
- తిరుపతి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ఎక్స్ సర్వీస్ మెన్ కోటా కింద కేటాయించిన భూమిని నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించాలని మాజీ సైనికోద్యోగి చేసుకున్న దరఖాస్తును జిల్లా కలెక్టర్ తిరస్కరించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం 1993లో జారీ చేసిన జీవో 1117, భూపరిపాలన కమిషనర్ (సీసీఎల్ఏ) 2022 మే4న జారీ చేసిన సర్క్యులర్‌ను పరిశీలిస్తే అసైన్ చేసి పదేళ్లు దాటిన భూమిని విక్రయించుకొనే అధికారం మాజీ సైనిక ఉద్యోగులకు ఉందని స్పష్టం చేసింది. పదేళ్ల తర్వాత ఆ భూములు స్వభావాన్ని కోల్పోతాయని, ఆ భూమిపై సైనికోద్యోగికి సంపూర్ణ హక్కులు లభిస్తాయని పేర్కొంది. సైన్యం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఉద్యోగి జీవితానికి భద్రత కల్పించడంతోపాటు దేశానికి సేవలు అందించినందుకు హక్కుగా సైనికోద్యోగులకు భూకేటాయింపు చేస్తారని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో మాజీ సైనికోద్యోగులకు కేటాయించే భూమిని, భూమిలేని నిరుపేదలకు ఇచ్చే అసైన్డ్‌పట్టాతో సమానంగా చూడడానికి వీల్లేదని పేర్కొంది. ప్రస్తుత కేసులో పిటిషనర్‌కు 1994లో మాజీ సైనికోద్యోగి కోటా కింద అసైన్డ్ పట్టా కేటాయించారని గుర్తు చేసింది. 2004తో పదేళ్లకాలం ముగిసిందని తెలిపింది. తహసీల్దార్ నివేదిక, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను పరిగణలోకి తీసుకోకుండానే పిటిషనర్ దరఖాస్తును తిరస్కరిస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారని ఆక్షేపించింది. 2022 ఆగస్టు 29న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం పూలతోట గ్రామ పరిధిలోని సర్వే నం.310/3పి2లోని 3.50 ఎకరాల భూమిని తక్షణం రిజిస్ట్రేషన్ నిషేధిత ఆస్తుల జాబితా 22(ఏ) నుంచి తొలగించాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ ఇటీవల తీర్పు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆగని మానవహననం

గాజాపట్టీ మొత్తాన్ని ఆక్రమించుకొని, ఐక్యరాజ్యసమితి, తదితర స్వచ్ఛంద సంస్థల అధీనంలో ఉన్న ఆహారసరఫరాలను తన గుప్పిట్లోకి తెచ్చుకోవాలని ఇజ్రాయెల్ నిర్ణయించుకుంది. అదనంగా ముప్పైవేలమంది సైనికబలగాలు, మారణాయుధాలతో సాగబోయే ఈ కొత్త ఊచకోత ఇంకెంతమందిని బలితీసుకుంటుందో తెలియదు కానీ, ఆకలిని ఆయుధంగా వాడి నిరవధిక యుద్ధం చేయబోతున్నామన్నది నెతన్యాహూ ప్రసంగం సారాంశం. ఇప్పటికే రెండునెలలుగా నిలిచిపోయిన ఆహారసరఫరాలతో ఆఫ్రికాదేశాల తరహా ఆకలి సమస్యను ఎదుర్కొంటున్న ఈ దురదృష్టకర గడ్డపై, సమీపకాలంలోనే మరిన్ని భయానకమైన దృశ్యాలను చూడబోతున్నాం.


హమాస్‌ను పూర్తిగా తుదముట్టించడం, దానివద్ద బందీలుగా మిగిలిపోయినవారిని విడిపించుకోవడం వంటి అవే పాతలక్ష్యాలతో ఇజ్రాయెల్ ఈ కొత్తప్రణాళిక అమలు చేయబోతోంది. హమాస్‌మీద ఇంత యుద్ధం చేసినా, అది ఒప్పందంలో భాగంగా తనకు తానుగా బందీలను అప్పగించడం వినా, ఇజ్రాయెల్ సైనికులు ఎవరినీ విడిపించుకున్నదేమీ లేదు. హమాస్ దుంపనాశనం, బందీలను రక్షించుకోవడం అనే లక్ష్యాలు ఇంతవరకూ నెరవేరనేలేదు కానీ, 90శాతం మంది గాజావాసులను నిరాశ్రయులను చేసి, యాభైవేల మందిని ఊచకోతకోయడం మాత్రం జరిగిపోయింది. స్వల్ప విరామం తరువాత ఇప్పుడు మళ్ళీ కొత్త అంకానికి తెరదీసి, గాజాను పూర్తిగా కబ్జా చేసి నిరవధికంగా, నిరంతరాయంగా దశాబ్దాల తరబడి తన అధీనంలో ఉంచుకోవడానికి ఇజ్రాయెల్ ఎత్తులు వేస్తోంది. ట్రంప్ మహాశయుడు వచ్చే వారం పశ్చిమాసియాలో పర్యటించి, బుజ్జగింపులు, హెచ్చరికలతో వాతావరణాన్ని సానుకూలం చేసిపోగానే, పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ ఈ భీకరస్థాయి సైనికచర్య ఆరంభిస్తుంది. గాజామీద పట్టు సాధించి, అత్యధికులను తరిమికొట్టి, ఆయుధాలతో, ఆకలిచావులతో మిగిలినవారిని హతం చేసి, అంతిమంగా ఆ పట్టీని పళ్ళెంలో పెట్టి ట్రంప్‌కు అప్పగించే కార్యక్రమం దిశగా అడుగులు పడుతున్నాయి. గాజాను అత్యద్భుతమైన టూరిస్టు రిసార్టుగా మార్చాలన్న ట్రంప్ కల నెరవేర్చి, ఆయన కళ్ళలో ఆనందాన్ని చూడాలనుకుంటున్నారు ఆప్తమిత్రుడైన నెతన్యాహూ. జనాన్ని దక్షిణ గాజాకు తరలించడం అన్నది మాయమాటే తప్ప, ఒకసారి మానవహననం మొదలైతే పాలస్తీనియన్లు పారిపోక తప్పదు, హద్దులు గీసుకొని కూర్చున్న పొరుగుదేశాల మనసులు కరగకా తప్పదు.

రెండునెలలుగా అంతర్జాతీయ సాయాన్ని పట్టీలోకి ప్రవేశించకుండా అడ్డుతున్న ఇజ్రాయెల్ ఇప్పటికే దయనీయమైన పరిస్థితులకు కారణమైంది. ఆహారసరఫరాలు నిలిచిపోయిన కారణంగా ఒక వ్యక్తికి మూడురోజులకు ఒకసారి మాత్రమే తినడానికి ఏదైనా దొరుకుతోందని వార్తలు వస్తున్నాయి. మూడులక్షలమంది పిల్లలు చావు అంచున ఉన్నారు. ఆహారం, మందులు, ఇంధనం లేకుండా చేయడం ద్వారా పాలస్తీనియన్లను మాడ్చేస్తున్న ఇజ్రాయెల్ ఇకపై ఆకలిచావులను కూడా ఆయుధంగా వాడబోతోంది. జనవరిలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ, ఆహారసరఫరాలు ఇంకా జోరందుకోకముందే ఆ ముచ్చటా ముగిసిపోయింది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపు గురించి హమాస్–ఇజ్రాయెల్ మరో ఇరవై నాలుగు గంటల్లో ఒక నిర్ణయానికి రావాల్సి ఉండగా, ఇజ్రాయెల్ మార్చి 18 తెల్లవారుజామున గాజామీద విరుచుకుపడి ఐదువందలమందిని ఊచకోతకోసింది. ఈ ఘటనలో వందలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు. ఎఫ్–16, ఎఫ్–35 వంటి యుద్ధవిమానాలతో పాటు, హెలికాప్టర్లు, డ్రోన్లు కూడా ఆకాశంనుంచి అమాయకజనంమీద నిప్పులు కురిపించాయి. పరుగులు తీస్తున్నవారిని సైతం ఇజ్రాయెల్ సైనికులు కాల్చిపారేశారు. గాజా యుద్ధంలో ఒకేరోజున అత్యధికసంఖ్యలో జనహననం జరిగిన సందర్భం అది. కాల్పుల విరమణ అమలైన ఆ స్వల్పకాలంలో గాజాకు తిరిగివచ్చిన పాలస్తీనియన్ల సంఖ్య ఓ ఐదు లక్షలవరకూ ఉంది. వారిని భయోత్పాతంలో ముంచెత్తి, వెనక్కు పంపివేసి, గాజాను ఖాళీచేయించే ప్రయత్నాలు అప్పటినుంచే మొదలైనాయి. స్వస్థలాన్ని వీడిపోవడానికి ససేమిరా అంటున్న మిగతా పాలస్తీనియన్లమీద ఒత్తిడిపెంచేందుకు ఇప్పుడు ఇజ్రాయెల్ మరో దమనకాండకు ఉపక్రమిస్తోంది. ఈ కొత్త యుద్ధం హమాస్ చేతుల్లో ఉన్న బందీలను విడిపించేందుకు వీసమెత్తు ఉపకరించదని నెతన్యాహూకు తెలుసు. కానీ, ఆ పేరిట గాజాలో ఊహకు అందనంత విధ్వంసానికి పాల్పడి, అంతిమంగా రిసార్టు కల నెరవేర్చుకోవడం అమెరికా–ఇజ్రాయెల్ పాలకులకు ముఖ్యం.

అసమాన పరాక్రమశాలి 'అల్లూరి'

భరతమాత దాస్యశృంఖలాలను ఛేదించడానికి జాతి యావత్తూ అహింసే పరమధర్మమని ప్రగాఢంగా విశ్వసించిన తరుణంలో, దానికి భిన్నంగా సంపన్నులైన బ్రిటిష్ పాలకులపై విలక్షణమైన రీతిలో సాయుధ పోరాటం జరిపిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు. విశాఖ, గోదావరి ఏజెన్సీ ఏరియాల్లో నాగరికతకు దూరంగా బతుకుతున్న ఆదివాసీలను సంఘటితపరచి, వారిలో దేశభక్తిని రగిల్చి సాయుధులుగా తీర్చిదిద్ది, బ్రిటిష్ ప్రభుత్వంపై సమర శంఖాన్ని పూరించిన మన్యం వీరుడు ఆయన.

జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ సారథ్యంలో సాగిన అహింసా మార్గ స్వాతంత్ర్య పోరాటం ఒక ఎత్తు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి యోధులు సాగించిన పోరాటాలు మరో ఎత్తు. జాతీయ కాంగ్రెస్ పార్టీకి సమాంతరంగా జరిపిన ఈ మహనీయుల పోరాటాలు బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో కీలక భూమిక పోషించాయి. సీతారామరాజు నేతృత్వంలో సాగిన మన్య



విప్లవం ప్రపంచంలోకెల్లా శక్తివంతమైన మహాసామ్రాజ్యాన్ని గడగడలాడించింది. రెండున్నరేళ్ల పాటు బ్రిటిష్ వారిపై అవిశ్రాంత పోరాటం చేసి వారికి కంటిమీద కునుకు లేకుండా చేసిన అసాధారణ వ్యక్తి అల్లూరి.

1897, జూలై 4న విశాఖ జిల్లా పాండ్రంకిలో జన్మించిన రామరాజు, చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. ఫోర్త్‌ఫారం మధ్యలోనే చదువు ఆపేశాడు. పదిహేడేళ్ల వయసులో మిత్రుడు పేరిచర్ల సూర్యనారాయణరాజుతో కలిసి జయపురం, బస్తర్ వంటి మన్యం ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాడు. ఈ యాత్రలోనే ఆయనలో విప్లవబీజాలు మొలకెత్తాయి. అమాయక గిరిజనులు పరాయి పాలనలో పడుతున్న పాట్లను చూసి చలించిపోయి, అసమాన లక్ష్యాన్ని తలకెత్తుకున్నాడు. కనీస సదుపాయాలు లేని మన్యం ప్రాంతాన్ని కార్యక్షేత్రంగా ఎంచుకున్నాడు. గుర్రపు స్వారీ నుంచి ఆయుధ ప్రయోగం వరకు పలు విద్యల్లో ఆరితేరాడు. తల్లికి చెప్పకుండా ఇల్లు వదిలి దేశాటన చేశాడు.

పోలీసులు, అటవీ అధికారుల దౌర్జన్యాలతో తల్లడిల్లుతున్న మన్యం ప్రజలను సమాయత్తపరచడం ఆరంభించాడు. ఒక పక్క బ్రిటిష్ వారితో పోరాటం చేస్తూనే మరోపక్క మన్య ప్రజల్లో మద్యపానం వంటి దురలవాట్లను రూపుమాపాడు. ప్రభుత్వ న్యాయస్థానాల గడప తొక్కవద్దని, పంచాయతీ కోర్టు కేంద్రాలను ఐదారు గ్రామాల్లో నెలకొల్పి రోజుకో కేంద్రానికి వెళ్లి అక్కడ వ్యాజ్యాలను విచారించి స్థానికుల సమక్షంలో తీర్పు చెప్పేవాడు.

బ్రిటిష్ సైన్యాన్ని సమర్థంగా ఎదిరించి పోరాడాలంటే అల్లూరి సైన్యానికి తుపాకులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందుకే 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై 300మంది అనుచరులతో దాడి చేశాడు. ఆయుధ సంపత్తిని స్వాధీనం చేసుకుని వాటి వివరాలను పోలీస్‌స్టేషన్ డైరీలో నమోదు చేసి సంతకం చేశాడు. తాను చేయదలచుకున్న దాడి గురించి ముందుగానే మిరపకాయ టపా ద్వారా శత్రువుకు సమాచారం పంపి, అదే సమయానికి దాడి చేసేవాడు. ఆగస్టు 23, 1922న కృష్ణదేవీపేట, 24న రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌లపై దాడి చేసి ఆయుధ సంపత్తిని కొల్లగొట్టడం బ్రిటిష్ పాలకులను ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు ఈ సమాచారం దేశమంతా వ్యాప్తి చెంది దేశభక్తుల రక్తం ఉప్పొంగేలా చేసింది.

గంటందొర, మల్లుదొర వంటి యోధులతో దళాలను ఏర్పాటు చేసుకున్నాడు. ఆయుధ సంపత్తిని కొల్లగొట్టడం, సమాచార వ్యవస్థలను ధ్వంసం చేయడం వంటి యుద్ధ వ్యూహాలను ఆలస్యంగా గ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వం, అప్పటి గుంటూరు కలెక్టర్ రూథర్‌ఫర్డ్‌ను రంగంలోకి దింపింది. ఆయన నేతృత్వంలోని 700 మంది సాయుధ పోలీసులు మన్యం ప్రాంతాన్ని జల్లెడ పట్టసాగారు. ఇరువర్గాలకు జరిగిన పోరులో అల్లూరి విప్లవ సైన్యం విజయం సాధించింది. ఆ తర్వాత దామనపల్లి ఘాట్ వద్ద జరిగిన పోరులో ఇద్దరు బ్రిటిష్ సైనికులు మృతి చెందడం ఆంగ్లేయులను కలవరానికి గురి చేసింది. ఈ క్రమంలో విప్లవాన్ని నిలువరించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం కుయుక్తులకు తెరలేపింది. విప్లవకారులకు సహాయపడే వారిని కఠినంగా శిక్షించింది. అమాయక ప్రజలను తీసుకెళ్లి హింసించి, కఠిన శిక్షలను విధించింది. తన కారణంగా అమాయక ప్రజలు నరకయాతన పడడాన్ని ఇష్టపడని రాజు బ్రిటిష్ ప్రభుత్వానికి లొంగిపోవాలనుకున్నాడు. 1924, మే 7వ తేదీన మంప గ్రామంలో సీతారామరాజును బ్రిటిష్ బలగాలు నిర్బంధించాయి. మేజర్ గుడాల్ జరిపిన కాల్పులకు ఆయన నేలకొరిగాడు.

కొంతమంది చేసిన త్యాగం, చూపిన తేజం, అందించిన స్ఫూర్తి శతాబ్దాల పాటు జ్ఞాపకాలలో నిలిచిపోతుంది. అలాంటి చరిత్రలో చెరగని పేరు అల్లూరి సీతారామరాజు. 27 ఏళ్ల జీవితం, కానీ శతాబ్దాలను తాకే ప్రభావం. ఆయన్ను స్మరించే ప్రతి మనసులో ఆయన ఆశయం ఇంకా గర్జిస్తూనే ఉంటుంది.

• పెన్మత్స శ్రీహరిరాజు
సీనియర్ జర్నలిస్టు
(నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి)

పాకిస్థాన్‌కు గుణపాఠం ఎలా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ సారి భారతదేశం నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తోందని, పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పి తీరుతుందనే విషయమై స్పష్టమైన సంకేతాలు లభిస్తున్నాయి. దేశ విభజన కాలం నుంచీ పాకిస్థాన్ భారతదేశం పట్ల ఎన్నో దురాగతాలకు పాల్పడింది. మరెన్నోసార్లు భారత్ చేతుల్లో దెబ్బతిన్నది. అయినా ఆ దేశం వైఖరి మారడం లేదు. మత రాజ్యంగా మారడమే పాకిస్థాన్‌కు ప్రాణాంతకంగా మారుతోందా? ఆ దేశ పాలకులు తొలినాటి నుంచీ అనుసరిస్తున్న విధానాలు ఏ గుణపాఠాలు నేర్పుతున్నాయి?

'నీవు కనుక నా స్నేహితుడువి కాకపోతే ఈ పాటికి నేను నిన్ను చంపేసి ఉండేవాడిని..' అని ఒక సాయంత్రం ప్రముఖ ఉర్దూ రచయిత సాదత్ హసన్ మంటోతో ఒక హిందూ మిత్రుడు యధాలాపంగా అన్నాడట. దేశ విభజన సమయంలో భారతదేశంలోనే ఉండిపోవాలని నిర్ణయించిన మంటో ఆ మరుసటి రోజే పాకిస్థాన్ వెళ్లిపోయారు. అక్కడ కూడా పెచ్చరిల్లుతున్న ఉన్మాద పరిస్థితులను, అసహనాన్ని చూసి ఆయన తట్టుకోలేకపోయారు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన సాదత్ హసన్ మంటో ఈ విభజనను ఒక బీభత్స విషాదంగా, రాజకీయ సామాజిక ఉన్మాదంగా అభివర్ణించారు. ఈ అర్థరహిత మతోన్మాదాన్ని ఆయన ప్రతీకగా తీసుకుని 'తోబాటేక్ సింగ్' అనే కథను రచించారు. దేశ విభజన వల్ల జరిగిన దుష్పరిణామాలను వివరిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ మేధావి రాంమాధవ్ కూడా తన పుస్తకం 'The Hindutva Paradigm'లో సాదత్ హసన్ మంటో రచనలను ఉటంకించారు. పాకిస్థాన్ ఒక స్వీయ విచ్ఛిన్నకర శక్తిగా మారే పరిణామం గురించి మంటో ఆనాడే ఊహించారు. 'మీరు పాకిస్థాన్‌కు సైనిక సహాయం చేస్తున్నారంటే మా ముల్లాలను సాయుధం చేస్తున్నారన్నమాట' అని ఆయన 1950లలో 'లెటర్స్ టు అంకుల్ శామ్' పేరిట వరుసగా రాసిన వ్యాసాల్లో వ్యాఖ్యానించారు. సంగీతం, కళలు, సాహిత్యం కవిత్వంపై నిషేధం విధించే రోజులు వస్తాయని ఆయన 'అల్లా దయతో' అన్న శీర్షికతో రాసిన వ్యాసంలో ఆనాడే ఊహించారు. 'మా నాన్న ఊహించినట్లే పాకిస్థాన్‌లో అసహనం తీవ్రంగా పెచ్చరిల్లిపోయింది.. ఎందరో ప్రచురణ కర్తలు, జర్నలిస్టులను మతోన్మాదులు హత్య చేశారు..' అని మంటో కుమార్తె నస్రత్ వాపోయారు.

'ఇస్లామిస్టులు వేరు, ముస్లింలు వేరు..' అని ప్రముఖ రచయిత Tarek Fatah ఇలాతారిక్ ఫతే తన 'Chasing a Mirage : The tragic Illusion of an Islamic state' పుస్తకంలో రాశారు. ఇస్లామిస్టులు మతరాజ్యాన్ని కోరుకుంటే, ముస్లింలు ఆధ్యాత్మికతను కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా వలస పాలనలో కునారిల్లుతున్న పరిస్థితుల్లో ప్రభవించిన పాకిస్థాన్ ముస్లిం ఉదారవాదులకు, వారిలో ఉన్న సూఫీ తత్వానికి, ప్రజాస్వామ్యానికి, బహుళ మతస్తులకు వేదికగా మారుతుందని అనేక మంది కలలు కన్నారు. అయితే విషాదకరంగా ఆ దేశం ఒక మత రాజ్యంగా మారిపోయింది. భారత్ నడిచిన దారిలో సాగలేదు. భవిష్యత్తులో హిందువులు హిందువులుగా, ముస్లింలు ముస్లింలుగా ఉండరని, మతం వారి వ్యక్తిగత విశ్వాసంగానే ఉన్నప్పటికీ వారు ఈ దేశ పౌరులుగా ఉండిపోతారని ప్రకటించిన పాకిస్థాన్ వ్యవస్థాపకుడు జిన్నా ఆ తర్వాత తన మాటలకు కట్టుబడకుండా తన దేశాన్ని మత రాజ్యంగా మార్చారు. దళితుల రాజకీయ హక్కులకోసం పోరాడుతూ జిన్నాకు సన్నిహితుడైన జోగేంద్రనాథ్ మండల్ దేశ విభజన తర్వాత పాకిస్థాన్ తొలి న్యాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1948లో భారత పాక్ యుద్ధం, మత కల్లోలాల తర్వాత ఆయనకు కీలకమైన ఫైళ్లు ఇవ్వడం నిరాకరించారు. ఇస్లాంను పాకిస్థాన్ అధికార మతంగా ఆ దేశ తొలి ప్రధాని లియాఖత్ అలీఖాన్ ప్రకటించిన తర్వాత మండల్‌పై దూషణలు, దాడులు పెరిగిపోయాయి. 1950 అక్టోబర్‌లో జోగేంద్రనాథ్ మండల్ కలకత్తాకు పారిపోయి రావాల్సి వచ్చింది. పాకిస్థాన్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఆయన తన రాజీనామా లేఖలో ప్రస్తావించారు.

1965లో దేశాధ్యక్ష పదవిని నిలబెట్టుకునేందుకు ఎన్నికలను రిగ్ చేసి గెలిచిన అయూబ్ ఖాన్ తనపై ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు 'ఆపరేషన్ జిబ్రాల్టర్' పేరిట వేలాది పాక్ సైనికులను సివిల్ దుస్తులతో కశ్మీర్‌లోకి పంపారు. ఆపరేషన్ జిబ్రాల్టర్ మాత్రమే కాదు, భారత సరఫరాలను అడ్డుకునేందుకు జమ్మూ–కశ్మీర్‌లో అఖ్నూర్ వంతెనను స్వాధీనం చేసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఆపరేషన్ గ్రాండ్ స్లామ్ కూడా విఫలమైంది. అయినప్పటికీ ఆయనను విమర్శించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రించారు. పాకిస్థాన్ సంరక్షకుడుగా సుప్రసిద్ధుడైన అయూబ్ ఖాన్ మరో దశాబ్దం పాటు అధికారంలో కొనసాగగలరని చాలా మంది భావించారు. నాలుగేళ్లలోనే ప్రజాగ్రహం ఆయనకు వ్యతిరేకంగా పెల్లుబుకింది. లక్షమందిని నిర్బంధించినా, వందల మందిని హతమార్చినా ఆయన గద్దె దిగాల్సి వచ్చింది. 50లక్షల మంది కశ్మీరీలకోసం పది కోట్ల మంది పాకిస్థానీయుల ప్రాణాలను పణంగా పెట్టలేమని ఆయన చెంపలేసుకున్నారు.

కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్థాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపుకుంటూనే ఉన్నారు. పాకిస్థాన్‌లో పనిచేసిన అనేకమంది విదేశీ జర్నలిస్టులు ఈ వాస్తవాన్ని తమ వ్యాసాల్లో, పుస్తకాల్లో చిత్రించారు. కశ్మీర్ అనేది పాక్ వ్యూహాత్మక సంస్కృతిపై ఆధిపత్యం చలాయిస్తోందని 'ద టైమ్స్' విలేఖరి అనాటో లెవియన్ తన పుస్తకం 'పాకిస్థాన్– ఏ హార్డ్ కంట్రీ'లో వ్యాఖ్యానించారు. ఇదే పాకిస్థాన్‌కు తీరని నష్టం చేసిందని, దీనివల్ల ఆ దేశం పూర్తిగా విచ్ఛిన్నమయ్యే అవకాశాలు లేకపోలేదని ఆయన పదేళ్ల క్రితమే రాశారు. భారతదేశం తమకు శత్రువని, అది పైకి కనపడినంత బలమైన దేశం కాదని, ఆ దేశంలో లుకలుకల్ని తాము ఉపయోగించుకుంటామని పాక్ సైనికాధికారులు తనకు చెప్పినట్లు ఆయన రాశారు. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయని, ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని



1948లో ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత వేలాది ప్రజల ప్రాణాలు పోయినప్పటికీ వేల కోట్ల నిధులు వృథా అయినప్పటికీ నియంత్రణ రేఖ ఒక అంగుళమైనా మారలేదు. పాక్ బడ్జెట్‌లో 30 శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానడం లేదు.

పోషిస్తున్నాయని కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. 2011లో ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ నేతృత్వంలో శాంతి బృందంలో భాగంగా పాకిస్థాన్‌ను సందర్శించినప్పుడు లాహోర్‌లో ధ్వంసమైన ఒక దేవాలయాన్ని, ముస్లింలు ఆక్రమించిన చరిత్రాత్మక గురుద్వారాను స్వయంగా చూశాను. బహుళమత సంస్కృతిని ధ్వంసం చేసిన పాకిస్థాన్ ఏం సాధించింది?

1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావంతో తన జనాభాలో 54 శాతం కోల్పోయి అవమానాల పాలైనా, 1999లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారలేదు. జియా ఉల్ హఖ్ ఏలుబడిలో పాకిస్థాన్‌కు, ఆ దేశంలోని మదర్సాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించేందుకు సహాయపడిన అమెరికా సెప్టెంబర్ 11 దాడుల తర్వాత తన వైఖరిని మార్చుకుంది. ముషారఫ్‌పై ఒత్తిడి చేసి ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతును తగ్గించేందుకు తోడ్పడింది. అబోటాబాద్‌లో అమెరికన్ దళాలు ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత పాక్ సైన్యం నైతిక స్థైర్యం కోల్పోయింది. కాబూల్‌లో అమెరికన్ రాయబార కార్యాలయంపై దాడి చేసిన హక్కానీ నెట్‌వర్క్ వెనుక పాక్ సైనికాధికారుల హస్తం ఉన్నదని న్యూయార్క్ టైమ్స్ జర్నలిస్టు కర్లోట్టా గాల్ తన పుస్తకం 'ద రాంగ్ ఎనిమీ'లో రాశారు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుంటుందని, అంతర్జాతీయంగా విశ్వసనీయతను కోల్పోతోందని ఆమె రాశారు. క్రమంగా ఉగ్రవాదంపై పోరులో పాకిస్థాన్ తన మిత్రపక్షం కాలేదని అమెరికా గ్రహించింది. 2001 నుంచి 2003 మధ్య న్యూఢిల్లీలో అమెరికా రాయబారిగా ఉన్న రాబర్ట్ డి బ్లాక్‌వెల్ భారత్‌కు పూర్తి మద్దతునీయాలని సూచించిన తర్వాత అమెరికా విదేశాంగ విధానంలో మార్పు ప్రారంభమైంది.


1948లో ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత వేలాది ప్రజల ప్రాణాలు పోయినప్పటికీ వేల కోట్ల నిధులు వృథా అయినప్పటికీ నియంత్రణ రేఖ ఒక అంగుళమైనా మారలేదు. పాక్ బడ్జెట్‌లో 30శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు 41 శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానడం లేదు.

'వసుధైక కుటుంబకం' అన్న భావనను ఆదర్శంగా తీసుకునే భారతదేశం మాత్రం ఎప్పుడూ పాకిస్థాన్ దిశన పయనించకపోవడమే ఈ పురాతన దేశ ప్రజల విజయ రహస్యం. భారత ఉపరాష్ట్రపతిగా ఎంపికైన తర్వాత బీజేపీ మాజీ అధ్యక్షుడు వెంకయ్యనాయుడు తన జిల్లాలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మామగారి పేరే మస్తానయ్య నాయుడు. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డికి ఆ పేరు నల్గొండలోని జాన్‌పహాడ్ దర్గా వల్ల వచ్చింది. అనంతపురంలో గుగుడు (గుహుడు) అనే గ్రామంలో ముస్లింలు రాముడు ఒక ముస్లిం పీర్‌గా తమ గ్రామానికి వచ్చారన్న నమ్మకంతో ఆయనను కుల్లాయప్ప పేరుతో మొహర్రం సందర్భంగా పూజిస్తారని, వారు ఆ పక్కనే హనుమంతుడి ఆలయాన్ని కూడా స్థాపించారని ప్రముఖ కవి అఫ్సర్ 'ద ఫెస్టివల్ ఆఫ్ పీర్స్' అన్న పుస్తకంలో రాశారు. భారత్ పాక్ మార్గంలోనో, అయూబ్ ఖాన్ పంథాలోనో పయనించడం జరగదనేది, మంటో పడిన వేదన మన రచయితలకు ఎదురు కాబోదనేది నిజమవ్వాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

గాంధీ కాలం నాటిది ఈ 'పీ4'!

పేదల ఇంట కొత్త వెలుగు 'పీ4' శీర్షికతో తెలుగుదేశం శాసనసభ్యులు సి. రామచంద్రయ్య ఆంధ్రజ్యోతిలో వ్యాసం రాశారు (ఏప్రిల్ 9). కానీ ఈ పథకంతో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించటం సాధ్యమేనా అన్నది చర్చనీయాంశం. 1991 తర్వాత దేశంలో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా జాతీయ సంపద గణనీయంగా పెరిగిందని, జాతీయ ఆర్థిక అభివృద్ధి 8–9 శాతం పెరిగిందని, కానీ దీనికి తగ్గట్లుగా పేదరికం తగ్గటం లేదని రామచంద్రయ్య వాపోయారు. అలానే 200 దేశాల ఆకలి సూచీ జాబితాలో భారతదేశం 150వ స్థానంలో ఉందని, మరి లోపం ఎక్కడని ఒక ప్రశ్న కూడా వేశారు. అసలు సమస్యల లోతుల్లోకి వెళితేనే ఈ ప్రశ్నకు సమాధానం దొరికేది!



1991 తర్వాత దేశంలో ప్రవేశపెట్టబడిన సరళీకృత ఆర్థిక విధానాలు ఇప్పటివరకు ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గానికే ఉపయోగపడ్డాయి. అన్ని రంగాలను శాసించే అదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులు పెరగడానికి అవి దోహదపడ్డాయి. కనుకనే జాతీయ ఆర్థిక అభివృద్ధి పెరిగినా పేదరికం తగ్గలేదు. ఈ అసలు వాస్తవాలను గమనించకుండా– చంద్రబాబు 'పీ4' పథకంతో పేదరిక నిర్మూలన జరుగుతుందని చెప్పటం పాక్షిక దృష్టే అవుతుంది.

వాస్తవానికి ఈ 'పీ4' విధానం కొత్తగా వచ్చిందేమీ కాదు! ఏనాడో గాంధీ ప్రబోధించిన ధర్మకర్తృత్వ సిద్ధాంతంలో ఇది భాగమే. ఆనాడే గాంధీ ఇలాంటి విధానాలను ప్రబోధించినప్పటికీ ఈనాటికీ దేశంలో పేదరికం తగ్గకపోవడానికి కారణం అవన్నీ కేవలం ప్రబోధాలుగా మిగిలిపోవటమే. 2013లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలోనే నూతన ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) పథకాన్ని చట్టం రూపంలో తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని చేయటంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండవచ్చు గాక! కానీ దీని ద్వారా సామాజికంగా ఏ మాత్రం అభివృద్ధి సాధించలేకపోయాం. టాటా కంపెనీలు మొదలుకొని మైక్రోసాఫ్ట్ అధినేతల వరకు అనేక ట్రస్టుల పేరులతో కొన్ని వేల కోట్ల రూపాయల్ని సామాజిక అభివృద్ధి పేరుతో వివిధ రూపాలలో ఖర్చు చేస్తున్నారు. అయినా దేశ సామాజిక చిత్రంలో మార్పులేమీ జరగలేదు. పైగా సామాజిక చిత్రపటం మరింత మసకబారింది. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. ఈ వాస్తవాల నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన 'పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ –పీ4' పథకాన్ని గమనిస్తే పేదరికాన్ని నిర్మూలించాలన్న ఈ పథకం లక్ష్యం పగటికలే అనుకోవాలి!

అసలు 'పీ4' పథకంలో ప్రకటించిన 'మార్గదర్శకులు' ఎవరు? వీరంతా నూతన ఆర్థిక విధానాలలో భాగమైన ప్రైవేటీకరణకు పుట్టిన బిడ్డలే. ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా లాభం పొందిన పెట్టుబడిదారులకు చంద్రబాబు 'మార్గదర్శకులు' అని పేరు పెట్టారు. వివిధ రాయితీల రూపంలో ప్రజల ఆస్తులను చౌకగా దక్కించుకున్న పెట్టుబడిదారుల చేత సహాయం చేయించి పేదరికాన్ని నిర్మూలించాలనుకోవడం ఎవరి ప్రయోజనాల కోసం! సామాజిక వ్యవస్థలో పెరుగుతున్న ఆర్థిక అసమానతల ఫలితంగా ఉద్యమాలవైపు ఆకర్షితులవుతున్న ప్రజల్ని ఊహాజనిత భ్రమల్లో ముంచి పక్కదారి పట్టించడానికే ప్రపంచ బ్యాంకు నిర్దేశిత పథకాల్లో ఒకటైన ఈ 'పీ4' పథకాన్ని ప్రజలపై ప్రయోగిస్తున్నారు.

ఉత్పత్తి సాధనాలపై ప్రజల యాజమాన్యంలో భాగంగా దున్నేవానికే భూమి, అటవీ ప్రాంతాల్లో అపారంగా ఉన్న ఖనిజ వనరులపై ఆదివాసులకు హక్కులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, ప్రైవేటీకరణ విధానాలను విడనాడి ప్రభుత్వ రంగంలో అన్ని రంగాల పరిశ్రమల సృష్టి వంటి విధానపరమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాల బాట పడుతున్న ప్రజల్ని దారి మళ్ళించి, వారు తమ పట్ల విధేయతా భావంతో ఉండి తమను ధర్మ ప్రభువులుగా పొగిడేలా చేసుకునేందుకే ఇలాంటి పథకాలు ఉపయోగపడతాయి. కాబట్టి ప్రజలను భ్రమల్లో పడనీయకుండా, ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి!

○ ముప్పాళ్ళ భార్గవ శ్రీ
సీపీఐ ఎంఎల్ నాయకులు

పుస్తక పఠనంతోనే విద్యావికాసం

తెలుగు ప్రజలారా దయచేసి ఈ విషయాలను శ్రద్ధగా వినండి, ఆలోచించండి, చర్చించండి, ఉద్యమించండి. మనుషులందరినీ మాయ మబ్బులు కమ్మేశాయి. సెల్ ఫోన్ చీకటి కమ్మేసింది. చదువుల దుఃఖం మింగేసింది. వాట్సాప్ మబ్బులు కమ్ముకున్నాయి. సోషల్ మీడియా అందరినీ ఊబిలోకి నెట్టేస్తోంది. దీనివల్ల మంచి మాట మాట్లాడుకునే పరిస్థితి లేదు. మంచి కథ చదువుకో బుద్ధి కాదు. మంచి పుస్తకం దరిచేరదు. జీవితం ఆనందమయమైన కళలు, సాహిత్యం నుంచి దూరమైపోయింది.


మాతృభాషను పరిరక్షించుకోవడంలో రెండు తెలుగు రాష్ట్రాలు అధమ స్థాయికి దిగజారిపోయాయి. తమిళనాడు వంటి రాష్ట్రాలు మాతృభాషను పరిరక్షించుకుంటూ పాఠశాలల్లో తప్పనిసరిగా తమ భాషను నేర్చుకుంటూ, హిందీని వదిలించుకొని ద్విభాషా సూత్రాన్ని అమలు చేస్తున్నాయి. మాతృభాషలో ప్రాథమిక విద్యను తప్పనిసరిగా బోధించాల్సిన అవసరం ఉందని భాషాశాస్త్రవేత్తలు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు. కానీ తెలుగు రాష్ట్రాలు మాతృభాషలో బోధనను పక్కన పెట్టేసి, ఆంగ్ల భాషా మాధ్యమాన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టడం వల్ల సగం మంది పిల్లలు ఇంగ్లీషు చదవలేకపోతున్నారు. కాస్తో కూస్తో చదివే పిల్లలు అర్థం చేసుకోలేకపోతున్నారు. దీనితో విద్యార్థులు బడికి రావడం మానేస్తున్నారు. ఫలితంగా చదువుల వల్ల పిల్లలు ఆనందాన్ని కోల్పోతున్నారు. ఆలోచనను, విచక్షణాజ్ఞానాన్ని కోల్పోతున్నారు. యాంత్రికంగా బట్టీ చదువుల మాయలో కొట్టుమిట్టాడుతున్నారు.

క్రమశిక్షణ లేని విద్య నిరర్థకం. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణ అలవాటు చెయ్యాలి. అది విద్యార్థిని చదువుల వైపు ప్రేరేపిస్తుంది. నైతిక విలువలపై నిరంతరం అభ్యాసం జరుగుతూ ఉండాలి. క్రమశిక్షణకు విలువల విద్య తోడైతే పిల్లలు మరింతగా రాణిస్తారు. పాఠశాలల్లోనే క్రమశిక్షణ, నైతిక విలువలకు సంబంధించిన బోధన జరగాలి.

తెలివైన పిల్లలకు చదువుకోవడానికి సమయం ఉండడం లేదు. విద్యావ్యవస్థలో ప్రధాన లోపాలలో గైడ్స్ వినియోగం ముఖ్యమైనది. ప్రతి తరగతిలోనూ గైడ్లను వాడుతున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం పాఠశాలల్లో గైడ్లను ఉపయోగించకూడదు. ప్రైవేట్ స్కూళ్లలో మెటీరియల్ ఇచ్చి చదివిస్తారు. కాబట్టి గైడ్ల నుంచి రాసే చాకిరీ తప్పి పిల్లలకు చదువుకోవడానికి ఎక్కువ సమయం ఉంటుంది. అక్కడ ఎక్కువమంది పిల్లలు ఉత్తీర్ణులవుతున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో గైడ్లలో ఉన్న విషయాన్ని యథాతథంగా ఎత్తి నోట్సులో రాయించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. సరిగా చదవడం రాని పిల్లలకు గైడ్లు చూసి రాయడం ఎంతో ఇబ్బంది. దీంతో నోట్సులు రాయలేక, భయంతో చాలా మంది పిల్లలు బడి మానేస్తున్నారు.

పదవ తరగతి పరీక్షలు పెద్ద ప్రహసనం. పిల్లల్ని పదవ తరగతి పాస్ చేయించడానికి సమాజంలో ప్రతి ఒక్కరు శతవిధాలా ప్రయత్నం చేస్తారు. పదవ తరగతి, ఇంటర్ రెండు సంవత్సరాలు ఎలాగోలా గట్టెక్కి, ఎంసెట్లో ఎంత ర్యాంక్ వచ్చినా, ఏదో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ప్రభుత్వమే ఫీజులు కట్టి కొందరిని ఉచితంగా

గ్రంథాలయంలోని పుస్తకాలు చదివితే పిల్లల్లో క్రమశిక్షణ విలువలు, విద్యావికాసం పెంపొందుతాయి. ఉపాధ్యాయులు చెయ్యలేని పనిని గ్రంథాలయం చెయ్యగలుగుతుంది. పుస్తకం ఇచ్చే చైతన్యం వెలకట్టలేనిది.



చదివిస్తుంది. అలా ఇంజనీరింగ్ అయిపోయిన తరువాత బయట పడిన విద్యార్థికి ఏ పనీ చెయ్యడం చేతకాదు, దాంతో ఏ ఉద్యోగమూ రాదు. పిల్లలు రెంటికీ చెడ్డ రేవడిగా తయారవుతున్నారు. వీళ్ల సమాజంపై కసి పెంచుకుని విద్రోహులుగా మారుతున్నారు. తమకు తామే అన్యాయం చేసుకుంటున్నారు.

పాఠశాల–కళాశాల గ్రంథాలయాల్లో పిల్లలకు చదవడంపై ఇష్టం పెరగాలన్నా, చదివింది అవగాహన చేసుకోవాలన్నా, సాహిత్యం పరిచయం కావాలన్నా, స్వీయ అభ్యసనం పెరగాలన్నా, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి కావాలన్నా గ్రంథాలయాల అభివృద్ధి తప్పనిసరి. పుస్తకాల పఠనం తప్పనిసరి చెయ్యాలి. దీంతో పిల్లలు చదువుపై ఇష్టం పెంచుకుంటారు. చదవడం వచ్చిన పిల్లలు అవగాహన పెంచుకుంటారు. స్వీయ రచనా సామర్థ్యం పెరుగుతుంది. ఆలోచనా శక్తి పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడతారు. పుస్తక పఠనానికి పాఠశాల, కళాశాలలే ముఖ్య కేంద్రాలు. పాఠశాల గేటు దాటితే పిల్లల చేతుల్లోకి సెల్‌ఫోన్లు వస్తున్నాయి. దాంతో వారికి ఎవరి మాటా వినబడదు.

పాఠశాలలో గ్రంథాలయాల నిర్వహణకు ప్రత్యేకంగా ఒక టీచర్ లేదా వాలంటీర్ ఉంటే ఆ గ్రంథాలయం సక్రమంగా నిర్వహించబడుతుంది. గ్రంథాలయంలోని పుస్తకాలు చదివితే పిల్లల్లో క్రమశిక్షణ విలువలు, విద్యావికాసం పెంపొందుతాయి. ఉపాధ్యాయులు చెయ్యలేని పనిని గ్రంథాలయం చెయ్యగలుగుతుంది. పుస్తకం ఇచ్చే చైతన్యం వెలకట్టలేనిది. చదవడం రాని పిల్లల్ని సైతం కథల పుస్తకాలు ప్రేరణ కలిగించి, చదువు నేర్చుకునేలా చేస్తాయి, ప్రాపంచిక జ్ఞానాన్ని పెంపొందిస్తాయి.

పాఠశాలల్లో చదువు నేర్పడంలో ఇబ్బందులుంటే విద్యార్థులు ఉన్నతాధికారులకు తెలియజేయాలి. అన్ని స్థాయిల్లో అధికారులు పాఠశాలలను సందర్శించాలి. విద్యార్థుల చదువుల తీరును గమనించాలి. వాస్తవ స్థితిని తెలుసుకోవాలి. పాఠశాలల్లో విధానాలు ఎంత అధ్వానంగా ఉన్నాయి, విద్యావ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉంది. దీనిని ఏ విధంగా సరిచేసుకోవాలి అనే విషయాలపై మేధావులు, నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులతో చర్చ జరగాలి. మార్పు కోసం అందరూ ప్రయత్నించాలి. నెమ్మదిగా శిథిలమైపోయిన వ్యవస్థను పునర్నిర్మించుకోవాలి. రెండు రాష్ట్రాలలో అనేక జిల్లాల్లో అద్భుతమైన పనితీరు ప్రదర్శించే పాఠశాలలు ఉన్నాయి. నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇలాంటి పాఠశాలల్ని, ఉపాధ్యాయుల్ని గుర్తించి వాళ్ళను ప్రోత్సహించాలి. వారు అమలు చేస్తున్న విధానాలను గుర్తించి, అన్ని పాఠశాలలకు ఆ విధానాలను విస్తరించాలి. ప్రతి విషయానికి ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ప్రజలు కూడా సమస్యలను పట్టించుకోవాలి. మేధావులు, విద్యావంతులు, సాహిత్యవేత్తలు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, సినిమా పరిశ్రమ, ఎన్ఆర్ఐలు సమాజంలో జరిగే అనర్థాలను పట్టించుకోవాలి.

ఈ సమస్యల పరిష్కారానికి మరో గ్రంథాలయ ఉద్యమం రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ వంతుగా తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేసుకోవాలి. తమ గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడానికి సన్నద్ధం కావాలి.

■ మంచికంటి
కథా రచయిత



విజయవాడ- మచిలీపట్నం రహదారి

బందరు పోర్టు వయా ఓఆర్ఆర్

బందరు పోర్టును తెలంగాణ రాష్ట్రంతో అనుసంధానించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కల సాకారం కాబోతున్న వేళ ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు.. విజయవాడ నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా మచిలీపట్నం పోర్టుకు రహదారిని అనుసంధానించేందుకు ప్రణాళిక రచించారు. పోర్టు పనులు పూర్తయ్యి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే సమయానికి ఈ రోడ్ల పనులు కూడా కొలిక్కి రావటానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి కనెక్టివిటీ
అనుసంధానానికి ప్రభుత్వం అడుగులు

హైదరాబాద్ - విజయవాడ 6 వరసలకు అనుమతినిచ్చిన కేంద్రం

రూ.7,106 కోట్ల వ్యయంతో 161.58 కిలోమీటర్ల విస్తరణ

- 6 వరసలుగా విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65
- తుది దశకు డీపీఆర్ రూపకల్పన.. 65 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతికి బందరు పోర్టును గేట్ వేగా తీర్చిదిద్దాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. దీనిలో భాగంగా అమరావతికి బందరు పోర్టు అనుసంధానంపై దృష్టి సారించింది. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా హైదరాబాద్ నుంచి బందరు పోర్టుకు కనెక్టివిటీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. రెండు రాష్ట్రాల ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65ను నాలుగు వరసల నుంచి ఆరు వరసల విస్తరణకు తాజాగా అనుమతులు ఇచ్చింది. డీపీఆర్ కూడా తుది దశకు చేరుకుంది. రూ.7,106 కోట్ల వ్యయంతో 161.58 కిలోమీటర్ల మేర ఆరు వరసలుగా విస్తరించనున్నారు. ఇది హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు నుంచి గొల్లపూడి వరకు ఉంటుంది. దీంతో పాటు విజయవాడ-మచిలీపట్నం వైపు ఎన్‌హెచ్ - 65ను కూడా ఆరు వరసలుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం మిగతా 6లో..



ఆరు వరసలుగా అభివృద్ధి కానున్న విజయవాడ- హైదరాబాద్ రహదారి

నకిలీల్లో కలవరం!

వాణిజ్య పన్నుల శాఖలో దొంగ పత్రాలతో ఉద్యోగాలు

- ఒక మహిళా అటెండర్‌ను గుర్తించిన అధికారులు
- ఉద్యోగం నుంచి తొలగింపు.. మరికొంతమంది ఉన్నట్టు ఆరోపణలు



కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్

వాణిజ్య పన్నుల శాఖలో నకిలీ ధ్రువీకరణపత్రాల వ్యవహారం కలకలం రేపుతోంది. వివిధ విద్యార్హతలతో ఉద్యోగాలు చేస్తున్న వారు నకిలీ ధ్రువీకరణపత్రాలు సమర్పించి కొలువులు పొందారని కొన్నాళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అటెండర్, వాచ్‌మన్ ఉద్యోగాల్లో ఈ వ్యవహారం నడిచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నకిలీ ధ్రువీకరణపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారు ఆ శాఖలోని ఉద్యోగ సంఘాల నాయకుల ద్వారా రాయబారాలు నడుపుకుని ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. వీరిలో కొంతమంది ఇప్పటికే రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందినట్టు తెలుస్తోంది. తాజాగా ఒక మహిళా అటెండర్ ఉద్యోగంలో చేరినప్పుడు ఎలాంటి విద్యార్హత లేకపోయినా ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నట్టు ధ్రువీకరణపత్రాన్ని అధికారులకు సమర్పించింది. ఈ ధ్రువీకరణపత్రం నకిలీదని తెలియడంతో ఆమెపై అధికారులు వేటు వేశారు. దీనితో నకిలీ ధ్రువీకరణపత్రాలతో కొలువుల్లో కొనసాగుతున్న వారిలో కలవరం మొదలైంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ కేదారేశ్వరిపేటకు చెందిన జ్యోతి అనే మహిళ కారుణ్య నియామకం ద్వారా వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా చేరింది. జ్యోతికి ఇద్దరు అన్నయ్యలు ఉండేవారు. ఆమె తల్లి ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగి. ఆమె చనిపోయిన తర్వాత ఆ ఉద్యోగాన్ని పెద్దన్నయ్యకు ఇచ్చారు. తర్వాత కొన్నాళ్లకు అతడు మరణించడంతో రెండో అన్నయ్యకు ఆ ఉద్యోగం వచ్చింది. కారుణ్య మిగతా 6లో..

దుర్గగుడి ఈవోగా శీనా నాయక్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



వి.కె.శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంకార్యనిర్వహణాధికారిగా ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీగా పనిచేస్తున్న వి.కె.శీనా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం దుర్గగుడి ఈవోగా దేవదాయ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అటు కమిషనర్ బాధ్యతలు, ఇటు దుర్గగుడి ఈవో బాధ్యతలు చూడటం ఇబ్బందిగా మారటంతో దుర్గగుడికి రెగ్యులర్ ఈవోను నియమించాలన్న ప్రతిపాదన చేసి ఆయనే ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. కాగా, శీనా నాయక్ 2017లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, కావలి ఆర్డీవోగా పనిచేశారు.

7 సంస్థలకు భూముల కేటాయింపు

6లో

అపవిత్రం

పవిత్ర సంగమాన్ని అభివృద్ధి చేయాలి 8లో

భారీ వర్షం!

విజయవాడలో రోడ్లు జలమయం

- ఈలప్రోలులో తాటి చెట్టుపై పడిన పిడుగు
- గోపాలపురం వద్ద జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం
- రెడ్డిగూడెంలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



బెంజ్ సర్కిల్ వద్ద భారీగా నిలిచిన నీరు



విజయవాడ/ఇబ్రహీంపట్నం/వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి భానుడు భగభగమండిపోయాడు. సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశంలో కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన భారీ వర్షం ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం కురిసింది. విజయవాడ నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. బస్టాండ్, లోబ్రిడ్జ్ సెంటర్లలో రోడ్లపై వర్షపు నీరు నిలవటంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బెంజ్‌సర్కిల్, ఈనాడు తదితర ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. నందిగామ, చందర్లపాడు మండలాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. చందర్లపాడు మండలం ఏటూరులో గణేష్ దేవాలయంలో ధ్వజస్తంభం విరిగిపడింది. చందర్లపాడులో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామం కొత్త ఎస్సీకాలనీ సమీపంలో ఓ తాటి చెట్టుపై పిడుగు పడి నిలువునా కాలిపోయింది. ఈ పరిణామంతో స్థానికులు భయాందోళన చెందారు. ఎ.కొండూరు మండలం గోపాలపురం వద్ద ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీయ రహదారిపై ఓ భారీ చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వర్షం తగ్గిన తర్వాత పోలీసులు, స్థానికులు చెట్టును తొలగించారు. రెడ్డిగూడెంలో సాయంత్రం ఐదు గంటల నుంచే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామాల్లో అంధకారం రాజ్యమేలింది.





ఎ.కొండూరు మండలం గోపాలపురం వద్ద జాతీయ రహదారిపై పడిన భారీ చెట్టు

ఈలప్రోలులో పిడుగుపడి కాలిపోతున్న తాటిచెట్టు

ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం!

సీపీ రాజశేఖర్‌బాబు విధుల్లో చేరగానే ఉత్తర్వులు

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై అసంతృప్తి

కమిషనరేట్ పరిధిలో బదిలీలకు రంగం సిద్ధం!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలగబోతుందా? త్వరలోనే బదిలీల ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయా? కొన్ని స్టేషన్ల విషయంలో మార్పులు కచ్చితంగా చేయాలని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారా? అంటే పోలీసు వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొంతమంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలన్న యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సెలవులో ఉన్నారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. రాజశేఖరబాబు ఈ నెల 11వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఆయన 12వ తేదీన విధుల్లో చేరతారు. ఆ తర్వాత బదిలీల ఫైలు సీపీ టేబుల్ మీదకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయంగా తెలిసింది.

మూడు స్టేషన్లలో కదలిక ఖాయం?

కమిషనరేట్ పరిధిలో ఉన్న కొన్ని పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై సీపీ అసంతృప్తితో ఉన్నారు. ఆయన నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడంలో వారు విఫలమవుతున్నారన్న భావన ఉంది. మరికొంత మంది ఇన్‌స్పెక్టర్లు విధి నిర్వహణలో చురుగ్గా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. ఇన్‌స్పెక్టర్లు ఒక స్టేషన్‌లో రెండేళ్ల పాటు పనిచేసే అవకాశం ఉంది. రెండేళ్లు దాటిన ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసే అధికారం అధికారులకు ఉంది. ఇప్పటికే సీపీ కొంతమంది ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై ఒక అంచనాకు వచ్చారు. విజయవాడ నగరంలో మొత్తం 13 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఇవి కాకుండా రూరల్ గ్రామాల్లో 15 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లంతా ఏడాది కాలాన్ని పూర్తి చేసుకోవడానికి దగ్గరలో ఉన్నారు. ఈ స్టేషన్లలో ఎవరెవరిని బదిలీ చేయాలన్న దానిపై కమిషనర్ కార్యాలయంలో చర్చలు జరుగుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో మూడు స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లను మార్పు చేయాలని మిగతా 6లో..


దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులు

దుర్గమ్మ భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

ఇంద్రకీలాద్రి, మే 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి ఘాట్ రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దేవస్థానం ఈవో, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు వన్ టౌన్ సీతమ్మవారి పాదాలు, భవానీపురం పున్నమీఘాట్ నుంచి భక్తులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడకుండా ఉండేందుకు ఇంజనీరింగ్ అధికారులు ఐరన్ మెస్ ఏర్పాటు పనులను మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈనెల 8 వరకు అధికారులు ఘాట్ రోడ్డును మూసివేస్తూ.. భక్తులకు ఇబ్బందులు లేకుండా సీతమ్మవారి పాదాలు, పున్నమీఘాట్ నుంచి ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లుల కొరకు వ్యాను ఏర్పాటు చేశారు. దుర్గమ్మ దర్శనానికి క్యూలలో భక్తులు బారులు తీరారు.

దుర్గమ్మను దర్శించుకున్న వీహెచ్‌పీ నేత అలోక్ కుమార్

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను మంగళవారం విశ్వహిందూ పరిషత్ అఖిల భారత అధ్యక్షుడు అలోక్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆయనకు ఆలయ ఉద్యోగులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.





అభయాంజనేయుని సేవలో.. ఎంపీ, ఎమ్మెల్యే

» భోజనశాల నిర్మాణానికి రూ.35 లక్షలు

హనుమాన్‌జంక్షన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం వెనుక యనమదల రామస్వామి సత్రం అవరణలో భోజనశాల నిర్మాణానికి రూ.35లక్షలు కేటాయిస్తున్నట్టు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్ ప్రకటించారు. మంగళవారం ఆయన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో దాతల సహాయంతో నిర్వహిస్తున్న మంగళవారం అన్నదాన కార్యక్రమానికి వసతి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎంపీ గతంలో హామీ ఇచ్చారు. ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం భోజనశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి అంచనాలు తయారుచేసి పంపాలని, భవనంపై సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భోజనశాలలో అన్నక్యాంటీన్ నిర్వహించడంతో పాటు పేదలు వివాహాలు చేసుకునే విధంగా మండపాన్ని నిర్మిస్తామని తెలిపారు. తొలుత ఈవో తారకేశ్వరరావు ఎంపీకి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, వడ్డి వాసవీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సిటీ బస్సును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీ సిటీ ఆర్డనరీ బస్సులు సిద్ధం

» పరిశీలించిన ఆర్టీసీ ఎండీ

బస్‌స్టేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జోనల్ వర్క్‌షాపు ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా తయారు చేసిన కొత్త సిటీ ఆర్డనరీ బస్సును మంగళవారం వైస్ ఛైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పరిశీలించారు. నూతనంగా తయారు చేసిన బస్సును అధికారులు విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణం వద్దకు తీసుకువచ్చారు. ఎండీ ద్వారకా తిరుమలరావు బస్సును పరిశీలించి బస్సు బాడీకి వాడిన మెటీరియల్, పెయింటింగ్, సీటు నాణ్యత, తయారు చేయటానికి అయిన ఖర్చు వంటి ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జోన్ల పరిధిలోని వర్క్‌షాపుల్లో బస్సు బాడీలు తయారు చేయటానికి కావాల్సిన వనరులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఎండీ అధికారులను ఆదేశించారు. ఎండీ వెంట సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జి.వి.రవి వర్మ (అడ్మిన్), ఎ.అప్పలరాజు (ఆపరేషన్), విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం, చీఫ్ మెకానిక్ ఇంజనీర్ (ఎం) జి.నాగేశ్వరరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వృత్తాకారంలో నిల్చొని జీరోషాడోను పరిశీలిస్తున్న విద్యార్థులు

గోరా టెక్నో హబ్‌లో జీరో షాడో డే

బెంజిసర్కిల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : బెంజిసర్కిల్ నాస్తిక కేంద్రంలోని గోరా టెక్నోహబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులు, నగర పౌరులు జీరో షాడో డేను తిలకించారు. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్స్ సెర్ఫ్ క్యాంపెయిన్ జాతీయ సహాయ కన్వీనర్, ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత మేకా సుసత్య రేఖ హాజరయ్యారు. సూర్యుడు కదిలే విధానం, జీరో షాడో మన కిందకు ఎలా విద్యార్థులకు వివరిస్తూ ప్రత్యక్షంగా చూపించారు. ఈ ఆసక్తికర ఖగోళ పరిణామం తిరిగి ఆగస్టు 7న తిలకించవచ్చని ఈమె పేర్కొన్నారు. పిల్లల్లో సైన్స్, టెక్నాలజీపై ఆసక్తిని పెంచేలా గోరా టెక్నోహబ్ కృషిని అభినందించారు. గోరా టెక్నో హబ్ చైర్మన్ డాక్టర్ జి.సమరం పర్యవేక్షణలో వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి, నియంత, సకల, డాక్టర్ జగతి తదితరులు పాల్గొన్నారు.

ఆసియాలోనే రెండో అతిపెద్దది.. దేశంలోనే అత్యంత రద్దీ బస్‌స్టేషన్‌లలో ఒకటి.. 28 ఎకరాల విస్తీర్ణం.. 62 ప్లాట్‌ఫాంలు ఈ బస్‌స్టేషన్ ప్రత్యేకత.. మూడువేలకు పైగా బస్సులు ఇక్కడ నుంచి వివిధ రాష్ట్రాలకు, ప్రాంతాలకు ప్రయాణిస్తాయి.. రోజూ సుమారు లక్షన్నర మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్‌స్టేషన్‌లో షాపులు, డార్మిటర్, ఇతర వసతుల నుంచి నెలకు రూ.కోటిన్నర వరకు ఆదాయం వస్తోంది. ఇంత ఘనత ఉన్న బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

ఆసియాలో అతిపెద్దది..

» కోట్ల ఆదాయం వస్తున్నా కనీస వసతులు కరవు
» ప్రయాణికుల ఇబ్బందులు పట్టని అధికారులు
» ఎక్కడ చూసినా దుర్గంధమే..
» పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ దుస్థితిపై ప్రత్యేక కథనం..

అభివృద్ధిలో ఆమడ దూరం!




చెరువును తలపిస్తున్న బస్టాండ్ ఆవరణ


ఫ్లోరింగ్‌పైకి చేరిన వర్షపు నీరు


పైపు లీకేజీతో ధారలా వస్తున్న నీరు

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతికి అతి సమీపంలో.. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. రోజూ లక్షల్లో ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అమరావతి అభివృద్ధి పనులు ప్రారంభంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాల్సిన అధికారులు అదిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చినుకు పడితే చిత్తడే..

రెండ్రోజుల క్రితం కురిసిన కొద్దిపాటి వర్షానికే బస్‌స్టేషన్‌లోకి నీరు చేరింది. దీనికి తోడు కాలం చెల్లిన పైపులు.. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు బయటకు ఎదగదన్నింది. కొన్నిచోట్ల పైపులు పగిలి నీరు ఫ్లోరింగ్‌పైకి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్‌స్టేషన్‌కు నాలుగు దిక్కులా ఇదే పరిస్థితి కనిపించింది. కనీసం నీటిని తొలగించేందుకు సరైన పరికరాలు కూడా లేక పారిశుధ్య సిబ్బంది చీపుర్లతోనే తంటాలు పడుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్‌స్టేషన్‌లో నడవాలంటేనే భయపడుతున్నారు. కోట్లఆదాయం వస్తున్నప్పటికీ కనీసం శిథిలమైన పైపులు మార్చేందుకు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కేబిన్లలోకి కూడా నీరు చేరుతున్నా పట్టించుకునే నాథుడు లేడని పలువురు ముక్కున వేలుసుకుంటున్నారు.

చెరువును తలపిస్తున్న ప్రాంగణం

వర్షం పడితే బస్‌స్టేషన్ ప్రాంగణం చెరువును తలిపిస్తుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. సిటీ బస్‌స్టాపుల నుంచి లోపలికి వెళ్లే మార్గం తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్షం పడితే పక్కనే ఉన్న కాలువ ద్వారా ప్రవహించే చెత్తాచెదారం అంతా బస్‌స్టేషన్ ఆవరణలోకి రావడంతో దుర్వాసన వస్తోంది. దీనికి తోడు ముఖద్వారం వద్ద షాపు యజమానులు అడ్డంగా బారికేడ్లు పెడుతుండడంతో మురుగునీటిలో నడవాల్సిన పరిస్థితి.

ప్రయాణికులకు తప్పని దుర్గంధం..

బస్‌స్టేషన్ పరిసరాల్లో తిరగాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.. ప్రయాణికులకు బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా వాటి శుభ్రతను పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు అందులోకి వెళ్లడానికి సంకోచిస్తున్నారు. పలువురు బస్‌స్టేషన్ పరిసరాల్లోనూ మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో నగరానికి వచ్చే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.


విమానాశ్రయంలో విద్యార్థులతో సౌమ్య

టెన్త్ టాపర్లకు విమానయాన భాగ్యం

నందిగామ, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విమానయానం ఆహ్లాదకరంగా సాగింది. తొలిసారి విమానం ఎక్కిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులతో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మంగళవారం విమాన పర్యటన చేశారు. ఇటువంటి పర్యటనల ద్వారా పేద విద్యార్థుల్లో వికాసం పెంపొందిచవచ్చని ఆమె చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్వయంగా విద్యార్థులతో గన్నవరం నుంచి విమానంలో హైదరాబాద్ వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయంలో సౌమ్య బృందానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు స్వాగతం పలికారు. అనంతరం హైదరాబాద్‌లోని పలు ముఖ్యప్రదేశాలలో పర్యటించిన అనంతరం రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణమయ్యారు. విమాన ప్రయాణం తాము ఊహించలేదని, తమకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సౌమ్యకు రుణపడి ఉంటామని విద్యార్థులు తెలిపారు. తమ అభివృద్ధిని కాంక్షించి ఆమె చేసిన ఈ పర్యటనకు ఫలితం ఇస్తామన్నారు. పలువురు నేతలు, ప్రజలు సౌమ్యకు అభినందనలు తెలిపారు.

7 సంస్థలకు భూముల కేటాయింపులు

సీఆర్డీఏ ఆమోదం

» ఈ-13, ఈ-15 రోడ్లను ఎన్‌హెచ్‌16కు అనుసంధానానికి గ్రీన్ సిగ్నల్
» మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ సీఆర్డీఏ అథారిటీ నిర్ణయం తీసుకుంది. గతంలో 64 సంస్థలకు భూములు కేటాయింపులు పూర్తికాగా తాజాగా మంగళవారం సీఎం చంద్రబాబు వద్ద జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో మరో 7 సంస్థలకు కేటాయింపులు చేసింది. మొత్తం 71 సంస్థలకు ఇప్పటి వరకు కోర్ క్యాపిటల్ ఏరియాలో 1050 ఎకరాల కేటాయింపులు చేసిందన్నారు. అథారిటీ వీటితోపాటు మరికొన్ని కీలక నిర్ణయాలను అథారిటీ సమావేశంలో తీసుకున్నారు. వాటికి సంబంధించిన వివరాలను అమరావతి సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాకు వివరించారు.

2014-19 మధ్యకాలంలో అమరావతిలో మొత్తం 131 సంస్థలకు భూములు కేటాయింపు చేసామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరిగి ఆయా సంస్థలతో పలు మార్లు సంప్రదింపులు జరిపాం.. ఎవరెవరు ఎప్పుడెప్పుడు సంస్థల ఏర్పాటు పనులు ప్రారంభిస్తారు, ఎంతెంత స్థలం అవసరం.. అనే దానిపై చర్చించాం. కొన్ని సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటును త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పగా మరికొన్ని సంస్థలు విత్‌డ్రా చేసుకున్నాయి. దీంతో ఆయా సంస్థలకు భూ కేటాయింపులు రద్దుచేసి కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి భూ కేటాయింపులు చేస్తున్నామన్నారు. మంగళవారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీలో పలు సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపామన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిన వాటికి సీఆర్డీఏ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అథారిటీ సమావేశంలో కొత్తగా ఆరు సంస్థలకు కేటాయింపులు చేశామని మంత్రి నారాయణ తెలిపారు.

క్వాంటం వ్యాలీకి-50 ఎకరాలు, లా యూనివర్సిటీకి-50 ఎకరాలు, ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్‌కు-0.78 ఎకరాలు, ఐఆర్‌సీటీసీ-ఎకరం, బసవతారకం కేన్సర్ ఫౌండేషన్‌కు గతంలో కేటాయించిన 15 ఎకరాలు, వైద్య కళాశాల నిర్మాణానికి మరో 6 ఎకరాలను కేటాయించామన్నారు. కోస్టల్ బ్యాంక్‌కు 0.4 ఎకరాలు, రెడ్ క్రాస్‌సొసైటీకి- 0.78 ఎకరాలు కేటాయింపులు చేసినట్టు తెలిపారు.

ఉద్యోగుల టవర్ల నిర్మాణానికి రూ. 1,732.31 కోట్ల పనులకు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, మౌలిక వసతుల పూర్తికి, ఎన్జీవోలకు సంబంధించిన 9 టవర్ల నిర్మాణానికి రూ.506.67 కోట్లతో, మరో 12 టవర్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు రూ.517.10 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. రాజధానిలో 190 ఎంఎల్డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ నిర్మాణంతోపాటు ఐదేళ్లపాటు ఆపరేషన్, నిర్వహణకై రూ.560.57 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.494.86 కోట్లతో టెండర్లకు ఆమోదం లభించిందన్నారు. జాతీయ రహదారులకు అనుసంధానం చేసేలా ఇ-13 రోడ్డును 4.10 కిలోమీటర్ల మేర రూ. 384.78 కోట్లతో, ఇ-15 రోడ్డును 3.98 కిలోమీటర్ల మేర రూ.70 కోట్లతో మౌలిక సదుపాయాలతో కలిపి పొడిగించేందుకు అథారిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఒక సీడ్ యాక్సిస్ రోడ్డు ఇ-3లో 1.5 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి ఆమోదముద్ర వేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు.



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారుతో మాట్లాడుతున్న దేవదాయ శాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, ఈవో సన్యాసిరావు

శ్రీవారి స్థలంలో ఆక్రమణలు తొలగించండి

» కమిషనర్ ఆదేశాల మేరకు ఈవో ఫిర్యాదు

వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు కట్ట దిగువన ఉన్న వన్‌టౌన్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించి, ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవస్థానానికి చెందిన 100 గజాల ఖాళీ స్థలాన్ని స్థానికంగా ఉంటున్న షేక్ నాగూర్ ఆక్రమించి నిర్మాణం చేపట్టాడు. దీనిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'శ్రీవారి స్థలం కబ్జా' కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ జిల్లా దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, దేవస్థానం ఈవో సన్యాసిరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలంలో నిర్మాణం చేపట్టిన షేక్ నాగూర్‌ను అధికారులు ప్రశ్నించారు. ఆక్రమణలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు షేక్ నాగూర్‌పై ఈవో పటమట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బందరు పోర్టు వయా ఓఆర్‌ఆర్!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. దీనికి సంబంధించి డీపీఆర్ రూపకల్పన తుదిదశకు చేరుకుంది. గతంలో ఆరు వరసలుగా విస్తరించాలన్న ఉద్దేశ్యంతో చైతన్య కన్సల్టెన్సీతో డీపీఆర్ రూపకల్పనచేయించినా.. మధ్యలోనే ఆపేసింది. అప్పట్లో హైదరాబాద్‌కు ఖమ్మం నుంచి బందరు పోర్టును అనుసంధానించాలన్న ఉద్దేశ్యంతో ఎన్‌హెచ్-216 హెచ్‌ను విస్తరించాలని నిర్ణయించింది. మళ్లీ కేంద్ర ప్రభుత్వం మనసు మార్చుకుని విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65ను విస్తరించాలని డీపీఆర్ తయారు చేయిస్తోంది. హైదరాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా విస్తరించటానికి మీద అడుగులు పడ్డాయి.

వాహనాల మళ్లింపు..

విజయవాడ నగరంలోకి ట్రాఫిక్ అంతా రాకుండా ఉండటం కోసం అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)ను రెండు భాగాలకు అనుసంధానంగా ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ జిల్లాలో దాములూరు దగ్గర ఓఆర్‌ఆర్ మీదుగా అర్ధ చంద్రాకారంలో తిరుగుతూ కృష్ణాజిల్లాలో కంకిపాడు ఎగువన తిరిగి ఎన్‌హెచ్-65 నుంచి నేరుగా బందరు పోర్టుకు చేరుకుంటాయి. మచిలీపట్నంలో ఎన్‌హెచ్-65కు అనుబంధంగా బందరు పోర్టుకు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వెలుపల నుంచి బందరు పోర్టుకు అనుసంధానం ఏర్పడబోతోంది. ఇదే సందర్భంలో అమరావతి రాజధానికి కూడా మచిలీపట్నం పోర్టు అనుసంధానం అవుతోంది. కంకిపాడు ఎగువన ఎన్‌హెచ్-65 నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు చలివేంద్రపాలెం మీదుగా వల్లూరుపాలెం, మున్నంగి, కంచెర్లపాలెం, శేకూరు, సేలపాడు, అనంతవరప్పాడు, పుల్లేటిగుంట, లింగాయపాలెం దగ్గర ఎన్‌హెచ్-16 కు అనుసంధానమవుతుంది. అమరావతిలో ఈ-13, ఈ-15 రోడ్లను ఎన్‌హెచ్-16కు రాజమార్గాలుగా అనుసంధానిస్తున్నారు.

మూడు నెలల్లో టెండర్లు పిలిస్తే..

బందరు పోర్టు పనులు ప్రస్తుతం 40 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి కావటానికి ఎంత లేదన్నా రెండు సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది. కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహించటానికి మరో 3 నుంచి 6 నెలల వరకు సమయం పట్టవచ్చు. మరో మూడు నెలల్లో కనుక హైదరాబాద్ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఎన్‌హెచ్ - 65 ఆరు వరసల విస్తరణకు సంబంధించి టెండర్లు పిలిస్తే.. రెండేళ్లలో పనులు పూర్తవుతాయి. ఇదే సమయంలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు పనులు కూడా మొదలైతే పూర్తి కావటానికి గరిష్టంగా ఐదేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) అందుబాటులోకి వచ్చే వరకు విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ఉపయోగించుకోవచ్చు. గొల్లపూడి నుంచి విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా వాహనాలను డైవర్షన్ చేయటానికి అవకాశం ఉంటుంది. తూర్పు బైపాస్ కూడా సాకారం అయి ఉంటే ఈ రెండూ మంచి ప్రత్యామ్నాయాలుగా ఉండేవి. తూర్పు బైపాస్ లేదు కాబట్టి.. ఈ వాహనాలను కేసరపల్లి దగ్గర కంకిపాడు బైపాస్ నుంచి ఎన్‌హెచ్ - 65కు చేరుకునేలా చేయవచ్చు.

విద్యుత్ సంస్థల డైరెక్టర్ల నియామకం

ఉత్తర్వు జారీ చేసిన ఇంధన శాఖ

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యుత్ సంస్థల డైరెక్టర్లను నియమిస్తూ ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్‌గా టి.వెంకట సూర్యప్రకాశ్, డైరెక్టర్(ప్రాజెక్టు)గా టి.వనజ, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్)గా కాకర్ల గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్టు)గా కె.ఆయూబ్‌ఖాన్, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్)గా ఎ.మురళీకృష్ణయాదవ్, డైరెక్టర్ (ప్రాజెక్టు)గా టీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఎస్.వెంకటేశ్వర్లు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ (టెక్నికల్)గా జె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ (ఫైనాన్స్)గా నిష్టల వెంకటరమణ మూర్తి, ఏపీజెన్కో డైరెక్టర్ (ఫైనాన్స్)గా కె.సీతారామరాజు, డైరెక్టర్ (హెచ్ఆర్-ఐఆర్)గా మేములాపల్లి ఉష, డైరెక్టర్ (హైడల్)గా ఎం.సుజయకుమార్, డైరెక్టర్ (కోల్ అండ్ లాజిస్టిక్స్)గా బమావత్తు నాగ్య, డైరెక్టర్ (థర్మల్)గా పి.అశోక్‌కుమార్‌ను నియమించారు.

నకిలీల్లో కలవరం!

(5వ పేజీ తరువాయి)

నియామకాన్ని పొందే సమయంలో అతడు తనకు ఆరోగ్యశాఖలో ఉద్యోగం వద్దని, మరో శాఖలో ఇప్పించాలని అప్పటి కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు. దీన్ని పరిశీలించిన జిల్లా అధికారులు అతడికి వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగం ఇచ్చారు. తర్వాత కొన్నాళ్లకు అతడు కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించాడు. అనంతరం ఈ ఉద్యోగాన్ని జ్యోతికి ఇచ్చారు. ఉద్యోగం పొందే సమయంలో పదో తరగతి లోపు చదువుకున్నట్టు తెలియజేసింది. దీనికి ఆధారంగా ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నట్టు ఒక ధ్రువీకరణపత్రాన్ని అధికారులకు సమర్పించింది. ఈ ధ్రువీకరణపత్రం అసలైనదేనని అధికారులు భావించారు. కొన్నాళ్ల తర్వాత జ్యోతి కుటుంబంలో వివాదాలు మొదలయ్యాయి. ఆమెకు మేనమామ వరసయ్యే వ్యక్తి జ్యోతి విద్యార్హతకు సంబంధించి నకిలీ ధ్రువీకరణపత్రంతో ఉద్యోగం చేస్తోందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం జ్యోతి పార్కు రోడ్డు డివిజన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తుంది. ఈ ఫిర్యాదు అందిన తర్వాత అధికారులు విచారణ చేసి, సంజాయిషి ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. దీనికి స్పందించకపోవడంతో ఆమెను మూడు నెలల క్రితం విధుల నుంచి తప్పించారు. తర్వాత ఉద్యోగ సంఘాల నాయకుల ద్వారా మళ్లీ ఆమె కార్యాలయంలోకి అడుగుపెట్టింది. కొద్దిరోజుల క్రితం పూర్తిస్థాయిలో విచారణ చేసిన అధికారులు జ్యోతికి ఉద్వాసన పలికారు. ఈ విషయాన్ని అత్యంతగోప్యంగా ఉంచారు.

ఖరీఫ్ కష్టాల నుంచి విముక్తి కల్పించండి!

» జలవనరుల మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే తాతయ్య వినతి


మంత్రి నిమ్మలకు వినతి పత్రం ఇస్తున్న తాతయ్య

జగ్గయ్యపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : గతేడాది వరదల వల్ల దెబ్బతిన్న జగ్గయ్యపేట నియోజకవర్గంలో పోలంపల్లి ఆనకట్ట, కాచవరం సప్లై చానల్స్ మరమ్మతులు, పునర్నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మంగళవారం కలిసి కోరారు. నియోజకవర్గంలో 20వేలకు పైగా ఆయకట్టు కలిగిన మునేరు ఆనకట్ట గత ఏడాది వచ్చిన వరదలకు అనేక చోట్ల గండి పడిందని, పెనుగంచిప్రోలు తువ్వ కాల్వ దెబ్బతిన్నదని మంత్రికి వివరించారు. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న కాచవరం సప్లై చానల్ దెబ్బతిన్నదన్నారు. వరద నిధుల కింద కొన్ని పనులకు మంజూరు లభించినా పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని.. లేకుంటే వచ్చే ఖరీఫ్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు, వరద వస్తే పలు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని మంత్రికి వివరించారు. ఎఫ్‌డీఆర్‌తో పాటు పోలంపల్లి వద్ద మునేరు ఆనకట్ట ఎడమ కాల్వ పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.97.70 లక్షలు, వత్సవాయి మండల పరిధిలో పెనుగంచిప్రోలు బ్రాంచి కెనాల్ పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.కోటి, పెనుగంచిప్రోలు పరిధిలో బ్రాంచి కెనాల్ మరమ్మతులకు రూ.60లక్షలు, కాచవరం హెడ్ రెగ్యులేటరి, ఎస్కేప్ రెగ్యులేటర్, తక్కెళ్లపాడు ఎస్కేప్ రెగ్యులేటర్‌ల నిర్మాణానికి రూ.25లక్షలు, బలుసుపాడు డిస్ట్రిబ్యూటరి కెనాల్ పునరుద్ధరణకు రూ.9.5లక్షలు, కాచవరం మెయిన్ బ్రాంచ్ కెనాల్‌కు రూ.34.17 లక్షలు మొత్తం రూ.341.70లక్షలు అవసరమని, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పోలంపల్లి ఆనకట్ట మరమ్మతులకు ఆర్థికశాఖ నుంచి క్లియరెన్స్ రావాలని, మిగిలిన పనులకు త్వరలో అనుమతిస్తామని తెలిపారు. మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే తాతయ్య పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శిగా చిరంజీవి చౌదరి పునర్నియామకం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి చిరంజీవి చౌదరిని రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శిగా పునర్నియమించింది. నిబంధనలు, షరతులపై ఒక ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం!

(5వ పేజీ తరువాయి)

అధికారులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. విజయవాడ నగరంలో రెండు, రూరల్ డివిజన్‌లో ఒక పోలీస్ స్టేషన్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్లను నియమించాలని భావిస్తున్నట్టు తెలిసింది. నగరంలో ఉత్తర మండలంలో ఒక ఇన్‌స్పెక్టర్, పశ్చిమ మండలంలో ఒక ఇన్‌స్పెక్టర్ పేర్లు బదిలీ జాబితాలో ఉన్నట్టు కమిషనరేట్ వర్గాల ద్వారా తెలిసింది. ఈ ఇద్దరు కాకుండా తిరువూరు మండలంలో మరో ఇన్‌స్పెక్టర్ పేరు వినిపిస్తోంది. ఈ మూడింటితో బదిలీలను ముగిస్తారా, ఈ సంఖ్యను ఇంకా పెంచుతారా అన్నది త్వరలో తెలుస్తుంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150,159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

హోటళ్లు, లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ నాగమురళి తన సిబ్బందితో లాడ్జిలు, హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్లలో మకాం చేసిన వారి గురించి ఆరా తీశారు. వారి వివరాలను సేకరించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉన్నారేమోనని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్‌లు ఇచ్చే సమయంలో సరైన ఆధారాలు ఉంటేనే ఇవ్వాలని, గుర్తింపు కార్డులు తీసుకుని రూమ్‌లు కేటాయించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



ప్రభుత్వాసుపత్రి ముందు గ్రీన్‌జోన్‌లో వ్యాపారాలు

గ్రీన్‌జోన్‌లో ఆక్రమణలు

- మూసుకుపోయిన ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డు
- అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- చోద్యం చూస్తున్న వైద్య, మున్సిపల్, హైవే శాఖలు
- ఆక్రమణల వెనుక వైసీపీ నేతలు !?

కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి : కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డుపై గ్రీన్ జోన్‌లో వెలిసిన అక్రమ ఆక్రమణల కారణంగా రోడ్డుపై జనాలు పెద్దసంఖ్యలో గుమిగూడుతున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది హైవే నిర్వహణలో ఉన్న ఈ గ్రీన్‌జోన్ మెష్‌ను తొలగించి మరీ కొందరు వ్యాపారులు బడ్డీకొట్లు, టిఫిన్ సెంటర్లు, కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు. అక్కడకు వచ్చే జనాల కారణంగా రోడ్డుపై రద్దీగా వుంటోంది. ఈ కారణంగా ఎమర్జెన్సీ కేసుల కోసం ఆసుపత్రి నుంచి బయటకు, లోనికి వచ్చే అంబులెన్సులకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ఈ అక్రమ ఆక్రమణల జోలికి మున్సిపల్, హైవే, వైద్య



శాఖల అధికారులు రాకపోవడంతో మొదట్లో ఒకటి, రెండు వున్న దుకాణాలు ఇప్పుడు పదుల సంఖ్యలో వెలిసి రోడ్డుపై రాకపోకలు సాగించేవారికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఈ ఆక్రమణల వెనుక కొందరు వైసీపీ నేతల హస్తం వున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు సైతం వీటి జోలికి వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ అధికారులు వైసీపీ నేతల కనుసన్నలలోనే పనిచేస్తున్నారనడానికి ఈ ఆక్రమణల జోలికి వెళ్లకపోవడమే నిదర్శనంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, నేషనల్ హైవేస్ ఉన్నతాధికారులు ఈ ఆక్రమణలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వున్న ఆక్రమణలు తొలగించి అక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పట్టాలు ఇచ్చేలా చూస్తా: ఎమ్మెల్యే గద్దె



బడ్డీకొట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాణిగారితోట, మే 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా రిటైనింగ్ రిటైనింగ్ వాల్ పక్కన నివాసం ఉంటున్న ఇళ్లలోని వారందరికి పట్టాలు ఇచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మంగళవారం 16వ డివిజన్ లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌కు చెందిన నిరుపేద మహిళలకు టిఫిన్ బండి, బడ్డీకొట్టును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ పక్కన రోడ్లు, సంప్, డ్రెయినేజీ నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఇక్కడి స్థలం గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మంత్రి లోకేష్ చేతుల మీదుగా యజమానులందరికి ఇళ్ల పట్టాలు అందజేస్తామని తెలిపారు. వర్షం వచ్చినపుడు కరెంటు లేకపోయినా పంపింగ్ హౌస్ పనిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

సౌమ్యకు క్రికెట్ కిట్ అందజేత

పటమట: తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం 27వ డివిజన్ కృష్ణలంక ప్రాంతానికి చెందిన తుమ్మలపల్లి సౌమ్యకు రూ.16 వేల విలువ చేసే క్రికెట్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మలపల్లి సౌమ్య అండర్ - 15లో జిల్లా క్రికెట్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. సౌమ్య భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సౌమ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రమాసహిత సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు నేటి నుంచి

వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం) ప్రాంగణంలోని శ్రీ విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో నటరాజన్ షణ్ముగం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం 6 గంటలు అంకురార్పణ జరుగుతుందన్నారు. 8న కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 9న పవళింపు సేవ, ఇతర వైదిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ప్రమాదకరంగా ఉన్న వైర్లు తొలగించండి

చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఆదేశం



మాట్లాడుతున్న చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్

కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రజల భద్రతకు ప్రమాదకరంగా మారిన కేబులు, ఇంటర్‌నెట్, తదితర వైర్లను వెంటనే తొలగించాలని విజయవాడ నగర పాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఆదేశించారు. కేబుల్ ఆపరేటర్లతో మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ ఆయన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ఉన్న కేబుల్, ఇంటర్‌నెట్, ఇతర వైర్లు కనిపిస్తే వాటిని వెంటనే తొలగించి, అవి అందంగా ఉండేలా పునర్నిర్మించుకోవాలని ఆదేశించారు. అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి, ఒక వారం రోజుల్లోగా తొలగించాలని ఆదేశించారు. వారం రోజుల తర్వాత నగరపాలకసంస్థ అధికారులు స్వయంగా రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. పౌరులు, కేబుల్ ఆపరేటర్లు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, మోహన్‌బాబు, కేబుల్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

విజేతలు జిల్లా విద్యార్థులు

జాతీయ స్థాయి ఇంగ్లీష్ వర్డ్ పవర్ చాంపియన్ షిప్



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ముంబయిలో ఏప్రిల్ 23న దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్న జాతీయ స్థాయి ఇంగ్లీష్ వర్డ్ పవర్ ఛాంపియన్ షిప్ పోటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం కన్నిమెర్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రానికి పేరు తెచ్చారు. ఈ పోటీలో మొత్తం 2 నుంచి 5వ తరగతి వరకు 4 విభాగాలలో పోటీలు నిర్వహించారు. వీటిలో 4వ తరగతి విభాగంలో 4వ తరగతి విద్యార్థి రేవంత్ ప్రథమస్థానం, 2వ తరగతి విభాగంలో 2వ తరగతి విద్యార్థిని సింధూ ప్రియ ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద ఓవరాల్ ఛాంపియన్ షిప్ పొందారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజేతను అభినందించి బహుమతులు అందచేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, ఏపీసీ జి.మహేశ్వరరావు, విభా ఫౌండేషన్ నుంచి వీరనారాయణ, లీప్ ఫర్ వర్డ్ సంస్థ నుంచి విజయకుమార్, సమగ్ర శిక్ష ఏఎంఓ అశోక్ బాబు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని విజయలక్ష్మిని కలెక్టర్ లక్ష్మీశ అభినందించి సన్మానించారు.. ఈ విజయానికి పునాది వేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ విద్యాసంస్థల కృషి అభినందనీయమని ఏపీసీ జి.మహేశ్వరరావు తెలిపారు.



సంతకాల సేకరణ చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

కృష్ణలంకలో సీపీఎం సంతకాల సేకరణ

కృష్ణలంక, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీలు తగ్గించాలని, సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్ల వద్దని ప్రభుత్వాన్ని నిలదీయాలంటూ సీపీఎం కృష్ణలంక శాఖ అధ్వర్యంలో మంగళవారం సత్యం హోటల్ సెంటర్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పి 10 నెలల కాలంలో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన వేశారని మండిపడ్డారు. ఏనాడో వాడిన కరెంట్‌పై 4 రకాల సర్దుబాటు చార్జీలు వేయడం దుర్మార్గమన్నారు. అదానీ ఇతర బడా సంస్థలతో చేసుకొన్న ఒప్పందాలు రద్దు చేసుకోవాలని మండిపడ్డారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, వ్యాపార సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

అనధికార విక్రేతలపై రైల్వే విజిలెన్స్ కొరడా



రైల్వేస్టేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్‌లో అనధికార విక్రేతలపై దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ విభాగం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. విజిలెన్స్ విభాగంతో పాటు రైల్వే రక్షకదళం కూడా ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ తనిఖీల్లో అనధికార విక్రేతల నుంచి రూ.4,65,000 జరిమానాలు వసూలు చేశారు. తనిఖీల్లో విక్రేతలకు సంబంధించిన వెండింగ్ అనుమతులు, గుర్తింపు కార్డులు, తదితరాలను పరిశీలించారు. లైసెన్స్ పొందిన స్టాల్ యజమానుల కింద సరైన అనుమతి లేకుండా విక్రయాలు జరిపినట్లయితే జరిమానాలు వేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనుమతిలేని విక్రేతలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎస్‌డీజీఎం), ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌లను అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. రైల్వే ప్రాంగణంలో అనుమతి పొందిన సిబ్బంది మాత్రమే నాణ్యమైన ఆహారం, సేవలను అందించాలని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

డీపీటీవో కార్యాలయాల ముట్టడి 13న

ఏపీపీటీడీ ఎన్ఎంయుఏ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు

విజయవాడ (బస్టేషన్), మే 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలుసార్లు నిరసనలు తెలిపినా సంస్థ, ప్రభుత్వం స్పందించకపోవటంతో ఈనెల 13న చలో డీపీటీవో కార్యాలయాల ముట్టడి చేయనున్నట్టు పీటీడీ ఎన్ఎంయూఏ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుమారు 6 నెలల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా పట్టించుకోలేదన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవోలకు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అయినా సంస్థ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవటంతో ఈనెల 13న 26 జిల్లాల డీపీటీవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 జీవోను అమలు చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి.వి.మోహన్ పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పౌర గ్రంథాలయ సంచాలకులు

గవర్నర్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ సంచాలకులు ఎ. కృష్ణమోహన్ మంగళవారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో జరుగుతున్న నిర్వహణ, వేసవి శిక్షణ తరగతుల శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం జీవితంలో ఎంతో మేలు చేస్తుందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఆయన ముచ్చటించారు. కావలసిన పుస్తకాలపై ఆరా తీశారు. ఏవైనా పుస్తకాలు అవసరమైతే లైబ్రేరియన్‌ను సంప్రదించాలని, వెంటనే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.నాగరాజు, గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందుకుంటున్న చర్మ వ్యాధి వైద్య నిపుణులు

పోస్టర్ విభాగంలో సిద్ధార్థ వైద్యుల సత్తా

ప్రభుత్వాసుపత్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): మంగుళూరులో ఈనెల 2 నుంచి 4 వరకు జరిగిన 13వ దక్షిణాసియా దేశాల చర్మవ్యాధి వైద్యుల సమావేశంలో విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన చర్మవ్యాధుల విభాగం వైద్యులు సత్తా చాటారు. ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ టి.వాణి సమర్పించిన పరిశోధన పత్రానికి పోస్టర్ విభాగంలో అవార్డు లభించింది. ఆమెతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు పలు పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టర్ వాణితో పాటు మరో నలుగురు స్కాలర్‌షిప్స్‌కు ఎంపికయ్యారు. సత్తా చాటిన వారిని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏవీ రావులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రారంభానికి కుట్టు శిక్షణ కేంద్రం సిద్ధం

- దాదాపు రూ.12లక్షలతో అభివృద్ధి
- ఎమ్మెల్యే చొరవతో సిద్ధం

రాణిగారితోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థికభరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం రాణిగారితోటలో ఏర్పాటు చేస్తున్న కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. రాణిగారితోట 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్‌లో రెండు గదులను రూ.12లక్షల వ్యయంతో కుట్టుమిషన్ కేంద్రం ఏర్పాటుకు పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచారు. ఈ కేంద్రం ఏర్పాటుతో స్థానికంగా ఉన్న మహిళలతో పాటు సమీపంలోని ఇతర డివిజన్ల మహిళలకు ఎంతో ఉపమోగకంగా ఉంటుంది.

గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో...

గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ కేంద్రం ప్రారంభం సంవత్సరం ఆలస్యం అయింది. ఎన్నికల ముందు ఇక్కడ కుట్టుమిషన్ కేంద్రం ఏర్పాటుకు ఎన్నో ఏళ్లగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వైసీపీ నాయకులు ఖాళీ చేయించారు. అనంతరం కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అవసరమైన మిషన్లు కూడా తెచ్చి హడావుడి చేసి చివరకు ఎన్నికల కోడ్ వచ్చిందంటూ ప్రారంభానికి నోచుకోకుండా చేశారు. ఇదే సందర్భంలో మిగిలిన డివిజన్లలో కేంద్రాలు ప్రారంభం అవడమే కాకుండా శిక్షణ తరగతులు కూడా ముగిశాయి. అప్పటి నుంచి ఈ డివిజన్‌లో కేంద్రం ఏర్పాటు అటకెక్కింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ కేంద్రంలో బూజు పట్టిన మిషన్ల దుస్థితిపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో ఎట్టకేలకు ఈ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధికారులను ఆదేశించడంతో కేంద్రం అభివృద్ధి పనులను సంబంధిత అధికారులు పూర్తి చేయడంతో ప్రారంభానికి సిద్ధమైంది.



ప్రారంభానికి సిద్ధమైన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం

ఆ మిషన్లు వాడతారా

గత వైసీపీ హయాంలో ఇక్కడ కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానిక తెచ్చిన మిషన్లు బూజుపట్టి ఉన్నాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాలతో ఈ కేంద్రం ప్రారంభానికి సిద్ధమయిన నేపథ్యంలో గతంలో తెచ్చిన మిషన్లను వాడతారా లేక ప్రభుత్వ ధన్నాన్ని వృథా చేసి పక్కనపెట్టి కొత్తవి తెస్తారో చూడలి.

మహిళల ఆర్థిక వృద్ధికి అండ



ఈ కేంద్ర ప్రారంభమైతే స్థానికంగా ఉన్న మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మహిళలు మిషన్లు నేర్చుకుని దానిని వృత్తిగా చేసుకుంటే కుటుంబానికి అండగా ఉండడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో దోహదం చేస్తుంది.

-కొక్కెర తిరుపతయ్య. (టీడీపీ నాయకుడు)

అపవిత్రం

పవిత్ర సంగమాన్ని అభివృద్ధి చేయాలి


రాళ్లు బయటికి వచ్చి ప్రమాదకరంగా మారిన సంగమానికి వెళ్లే రహదారి

సంగమం వద్ద పాడైన మరుగుదొడ్డి

కళ తప్పిన బుద్ధుడి విగ్రహం

నెర్రలిచ్చిన రోడ్డు

- తిష్ట వేసుకున్న సమస్యలు
- యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినా పట్టని అధికారులు
- వెలగని లైట్లు, పాడైన రోడ్లు, ఎండిపోతున్న చెట్లు
- కళాహీనంగా సంగమం
- ఓ వెలుగు వెలిగిన ప్రాంతం నేడు దయనీయం..!

అమరావతి పునర్నిర్మాణానికి శంకుస్థాపన, పనులు ఊపందుకోవడం రాజధానికి పునర్వైభవం తెచ్చే సూచికలు. విజయవాడ శివారులోని ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. కృష్ణా-గోదావరి నదుల సంగమంగా ఈ ప్రదేశానికున్న భౌగోళిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఎనలేనిది. సరైన నిర్వహణ లేకపోవడంతో కళతప్పింది. ఒకానొక సమయంలో పర్యాటకులతో నిండి ఉండే ఈ ప్రాంతం, ఇప్పుడు నిర్లక్ష్యంతో పాడైపోతున్న దుస్థితిలో ఉంది. మౌలిక సదుపాయాల కొరత, పరిశుభ్రత లోపాలు, అధికారుల నిర్లక్ష్యం వెరసి పవిత్ర సంగమాన్ని నిరుపయోగంగా మిగిల్చివేశారు. పర్యాటకాభివృద్ధి పేరుతో వచ్చిన ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే, అది కేవలం సాంస్కృతికంగానే కాదు, ఆర్థికంగానూ ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారుతుంది. కృష్ణా-గోదావరి సంగమాన్ని కేంద్రంగా చేసుకొని బోటు సఫారీలు, ఆధ్యాత్మిక యాత్రలు, ప్రకృతి దర్శనం వంటి పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి, శుభ్రత, భద్రత కల్పించి, పర్యాటకంగా ప్రోత్సహిస్తే సంగమానికి పునర్జీవం లభిస్తుంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా-గోదావరి నదులు కలిసే పవిత్ర సంగమం ఒకప్పుడు ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా వెలుగొందింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి నిత్య హారతులిచ్చేలా ఏర్పాటు చేసింది. ఈ హారతులను చూసేందుకు భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చేవారు. అయితే, 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ ప్రాంతం క్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. వైసీపీ ప్రభుత్వం హారతులను నిలిపివేయడంతో పవిత్ర సంగమం ఖ్యాతి మసకబారింది.




శిథిలావస్థకు చేరిన కట్టడాలు


పాడైపోయిన బోట్లు

నెరవేరని మంత్రుల హామీ

2024 ఆగస్టు 14న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పవిత్ర సంగమాన్ని సందర్శించి, త్వరలో నిత్య హారతులు పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అయితే, 10 నెలలు గడిచినా ఈ హామీ నెరవేరలేదు, నిత్య హారతులు ప్రారంభం కాలేదు.

పర్యాటక శాఖ దృష్టి సారించాలి

విజయవాడ నగరానికి అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం, కనకదుర్గమ్మ ఆలయం, కొండపల్లి ఖిల్లా, మూలపాడు, నగరం వనం వంటి ప్రాంతాలకు వచ్చే పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉంది. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర, ప్రశాంతమైన వాతావరణం కోసం ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి వాసులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. పర్యాటక శాఖ దృష్టి సారించి, రోడ్లు, స్నాన ఘాట్లు, లైటింగ్, తాగు నీరు, బయో టాయిలెట్స్ పచ్చదనం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిస్తే, పవిత్ర సంగమం మళ్లీ గొప్ప పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందవచ్చు. ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, ప్రజలకు ఆధ్యాత్మిక, వినోద వాతావరణాన్ని అందిస్తుందని స్థానికులు, పర్యాటకులు ఆశిస్తున్నారు.

సమస్యల సుడిగుండం

పవిత్ర సంగమం ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోంది. ఇబ్రహీంపట్నం నుంచి సంగమానికి వెళ్లే రోడ్డు పాడై, కొన్ని చోట్ల పగిలిపోయి, కుంగిపోయింది.నదిలోకి వెళ్లే మెట్లు బురద, చెత్తతో నిండి ఉన్నాయి. చెత్త తొలగించకపోవడంతో భక్తులు, పర్యాటకులు స్నానాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉంది. అతిథి గృహాలు నిరుపయోగంగా మారాయి. లైటింగ్ లేకపోవడంతో సాయంత్రం వచ్చే పర్యాటకులు, ముఖ్యంగా పిల్లలతో వచ్చే వారు సెల్‌ఫోన్ లైట్లపై ఆధారపడాల్సి వస్తోంది. పరిశుభ్రత, పచ్చదనం కనుచూపుమేరలోనే లేదు. తాగునీటి వసతులు, బయో టాయిలెట్స్, చెట్లకు నీరు పోసే వ్యవస్థ లేకపోవడంతో పచ్చదనం క్షీణించింది. పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉంది.అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. స్థానికులు ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమరావతితో పోలిస్తే కృష్ణా నది ఒడ్డున అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం, పవిత్ర సంగమాన్ని నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ నుంచి గోదావరి నీటిని కృష్ణానదిలో కలిపి, ఈ సంగమాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. కొండపల్లి ఖిల్లాతో లింక్ చేసి, లేజర్ షో ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించారు. అయితే, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఈ ప్రాంతంపై దృష్టి సారించలేదని స్థానికులు, పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీడియో చూడు.. నగదు పట్టు..!

- మరొకరిని చేర్పిస్తే అదనంగా రూ.200
- జీవితకాలం నగదు వస్తూనే ఉంటుంది
- బోర్డు తిప్పేసిన చైన్ లింక్ సంస్థ
- ఫిర్యాదు చేస్తే నగదు రాదని బెదిరింపులు


షై త్రీ యాడ్ స్కీంలో రూ.3,66000 కట్టి మోసపోయిన బాధితులు

ఆటోనగర్, మే 6(ఆంధ్రజ్యోతి) : యూట్యూబ్‌లో ప్రొడక్ట్ వీడియోలు చూసి టాస్కులు పూర్తి చేయాలి. ఒక్కో టాస్క్‌కు రూ.14, మరొకరిని చేరిస్తే కమీషన్ కింద రోజుకు రూ.200. ఇలా ఒక్కొక్కరూ ఏడుగురు వరకు చేర్చుకోవచ్చు.. జీవితకాలం ప్రతీరోజు నగదు వస్తుందని ఆశ చూపారు.. రెండు నెలలపాటు సమయానికి నగదు బ్యాంకులో వచ్చి చేరేది. అంతా సాఫీగా సాగుతున్న తరుణంలో నగదు రావడం ఆగిపోయింది. బాధితులు గొల్లుమన్నారు. బాధితుల కథనం ప్రకారం.. కొయంబత్తూరుకు చెందిన పి.సత్యానందన్ జిన్‌స్టా మార్కెటింగ్ సంస్థను నాలుగేళ్ల క్రితం మొదలు పెట్టారు. దీనికి తెలుగు రాష్ట్రాల్లో పలు బ్రాంచులు తెరిచారు. పేద, మధ్య తరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకున్నారు. అధిక మొత్తంలో నగదు వస్తుందని ఆశ చూపారు. ఒక్కసారి నగదు కడితే జీవితకాలం నగదు వస్తుందని నమ్మించారు. త్రీ యాడ్స్ స్కీంలో ఒకేసారి రూ. లక్ష 22 వేలు నగదు కడితే జీవితకాలం రోజుకు రూ.480 బ్యాంకులో జమ చేస్తామని తెలిపారు. ఇదీ కాకుండా మరొకరిని ఈ పథకంలో చేర్పితే రోజుకు అదనంగా మరో రూ.200 జమ చేస్తామని నమ్మబలికారు. ఇలా అదనంగా చేర్పించిన వారి వల్ల కమీషన్ నగదు రావడంతో అంతా నమ్మారు. తమ స్నేహితులు, బంధువులను ఈ ఊబిలోకి లాగారు. గత ఏడాది ఎన్నికల ముందు నుంచి సంస్థ యాప్ లావాదేవీలు నిలిచిపోయాయి. స్కీంలోని వారంతా సంస్థ ప్రతినిధులను ప్రశ్నిస్తే ఎన్నికల కోడ్ ఉండడంతో యాప్ నిలిచిపోయిందని ఏవేవో సాకులతో కాలం గడపడంతో యాప్‌ను 2025 ఫిబ్రవరిలో పూర్తిగా నిలిపేశారు.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సూమారు 2 వేల మందికి పైగా బాధితులు ఈ స్కీంలో చేరి నష్టపోయారు.. ఎనికేపాడులోని జిన్‌స్టా మార్కెటింగ్ సంస్థ బ్రాంచ్ మోసం చేసిందని పోలీస్ కమిషనరేట్ ప్రజా ఫిర్యాదుల వద్ద వీరవల్లి గ్రామానికి చెందిన దిండి సుబ్బారావు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది.. తనతోపాటు తన భార్య, అత్త పేరు మీద రూ. 3,66,000 కట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల గుణదల, పటమట పోలీస్‌స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేస్తే నగదు రావంటూ బెదిరింపులు..

రెండు, మూడేళ్లగా తాము కట్టిన నగదు వెనక్కి ఇవ్వాలని సంస్థ ప్రతినిధులను కలిస్తే బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు వాపోయారు. .స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని బాధితులు సంస్థ ప్రతినిధులకు వెల్లడిస్తే కేసులు పెట్టడం వల్ల ఉపయోగం లేదని, ఇలా కేసులు పెడితే నయాపైసా రాదని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు.

జిల్లాలో 80 లక్షల పనిదినాలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- మోటార్ బైక్‌పై సుడిగాలి పర్యటన
- పలుచోట్ల జరిగిన ఉపాధి పనుల పరిశీలన


పలుగుతో మట్టిని తవ్వుతున్న కలెక్టర్‌లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పని కోరిన శ్రామికులకు ఈ ఏడాది జిల్లాలో 80లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో మ్యాత్ సరోవర్ ట్యాంక్ పనుల్ని, కంచికచర్లలో పంట కుంట, ఫీడర్ చానల్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. మోటార్ బైక్‌పై ఆయన సుడిగాలి పర్యటన చేసి పలు చోట్ల జరుగుతున్న ఉపాధి హామి పథకం పనుల్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన పనులు పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన 80లక్షల పని దినాల్లో ఇప్పటి వరకు 25 లక్షల పనిదినాలు కల్పించినట్టు చెప్పారు. 3వేల పంటకుంటలను నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. చేపట్టిన పనుల ద్వారా శ్రామికులకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.307 దినసరి వేతనం తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మల్లె, గులాబి, నారింజ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జీడి మామిడి, దానిమ్మ, నేరేడు, అపిల్‌బెర్రి, మునగ, పామాయిల్ వంటి పండ్ల తోటలను పండించేలా ఉద్యాన రైతులు పంట కుంటలను నిర్మించుకునేందుకు ముందుకొస్తే తక్షణమే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా రైతులకు ఆర్థిక ఊతం కల్పించడంలో జిల్లాను అగ్రగామిగా నిల్పి ప్రభుత్వం ఆశించిన ఫలితాలను సాధించడంలో అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉపాధి హామి పీడీ ఎ.రాము, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, ఎంపీడీవో బి.లక్ష్మీకుమారి, ఏపీడీ వెంకటేశ్వరరావు, ఏపీవోలు ప్రమీళ, రమాదేవి, సతీష్, చంద్ర, జనార్ధన్ పాల్గొన్నారు.

మోటార్ బైక్‌పై సుడిగాలి పర్యటన

కలెక్టర్ జి.లక్ష్మీశ ఉపాధి పనుల్ని పరిశీలించేందుకు కారులో కాకుండా మోటార్ బైక్‌పై వెళ్లి స్వయంగా పనుల్ని పరిశీలించారు. ఉపాధి పనులు జరుగుతున్న చోటికి కారు వెళ్లే మార్గం ఉన్నా అందులో కాకుండా మోటార్ బైక్‌పై సుడిగాలి పర్యటన చేసి పనుల్ని పరిశీలించడమే కాకుండా పలుగు, పార పట్టి కూలీలతో కలిసి మట్టి తవ్వారు. మట్టి ఎత్తారు. గమేళాలకు మట్టి ఎత్తి దాన్ని కూలీల నెత్తినపెట్టారు. ఇలా కూలీలతో కలిసి కొంతసేపు పని చేశారు.

త్వరలో అందుబాటులోకి టూరిజం ప్యాకేజీ: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పర్యాటక హబ్‌గా తీ ర్చిదిద్దే క్రమంలో పర్యటకులకు మధురానుభూతి మిగిల్చేలా రూ పొందించిన ప్రత్యేక ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి వస్తాయ ని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ టూరిజం ప్యాకేజీలపై పర్యాటక శాఖ అధికారులతో పాటు టూర్ ఆపరేటర్లు, టూర్ అండ్ ట్రావెల్ ఏజెన్సీల ప్రతినిధులతో స మావేశం నిర్వహించారు. ఒకరోజు, రెండు రోజులు, మూడు రోజు లు, నాలుగు రోజుల పర్యాటక ప్యాకేజీలను వివరించారు. ప్యాకేజీల కింద సందర్శనకు అందుబాటులో ఉన్న ప్రాంతాలు, ధరలు, పర్యాటకులకు కల్పించే వివిధ సౌకర్యాలను వివరించి, సలహాలు, సూచనలు కోరారు. భాగస్వామ్య పక్షాల సూచనలను పరిగణలోకి తీసుకొ ని మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. కనకదుర్గమ్మ ఆలయం, కొం డపల్లి ఖిలా, పవిత్ర సంగమం, భవానీద్వీపం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనం, ఉండవల్లి గుహలు, మంగళగిరి ఎకో పార్కు ఇ లా ప్రస్తుతానికి 27 ప్రదేశాలను ప్యాకేజీల్లో చేర్చామని, హోటళ్ల, ట్రావెల్స్ తదితర విభాగాలతో పలు దఫాల్లో సమావేశాలు నిర్వహించి రూపొందించిన పర్యాటక ప్యాకేజీలపై విస్తృతస్థాయిలో ప్ర చారం కల్పించాల్సిన అవసరముందన్నారు. 50 మంది యువతకు వారం రోజులపాటు గైడ్లుగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పర్యాటకులకు మెరుగైన ఆతిథ్య సేవలందించేందుకు వీలుగా టూర్ ఆపరేటర్లు, డ్రైవర్లు వంటి వారికి కూడా శిక్షణ నిర్వహిస్తామన్నారు. స మావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈఓ డాక్టర్ తరుణ్ కాకాని, టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీల అసోసియేషన్ల మెంబర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ చాంబర్, పారిశ్రామిక వేత్తలతో...

ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ సభ్యులతో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. పీ4 కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, మార్గదర్శకులు ముందుకు రావాలని ఏపీ ఛాంబర్‌ను కలెక్టర్ కోరారు. ఏపీ ఛాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు, డైరక్టర్ వెలగపూడి సాంబశివరావు, టూరిజం కమిటీ చైర్మన్ డాక్టర్ తరుణ్ కాకాని, ఎనర్జీ ప్యానెట్ చైర్మన్ ఫణి బుర్రా, కె.లక్ష్మీనారాయణ, ఎంఎస్‌ఎంఈ పార్థసారధి, విద్యా సలహాదారు సుమ అట్లూరి తదితరులు ఈ కార్యక్రమానికి తాము మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు.

మోదీకి తొత్తులుగా రాష్ట్రంలోని పార్టీలు

- ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

గాంధీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పార్టీలు నరేంద్రమోదీకి తొత్తులుగా మారాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ. పాల్ విమర్శించారు. మోదీని ఢీకొట్టే శక్తి తనకు మాత్రమే ఉందన్నారు. గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి మోదీ చేసింది శూన్యమన్నారు. 2014లో రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు లక్ష కోట్ల నిధులు, కోటి ఉద్యోగాలు, తదితర వాగ్దానాలను నెరవేర్చలేదని మండిపడ్డారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 10 లక్షల కోట్లు పన్నుల రూపంలో తీసుకుని కేవలం 2 లక్షల కోట్లను మాత్రమే ఆయా రాష్ట్రాలకు ఇచ్చి 8 లక్షల కోట్లను గుజరాత్‌కు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల జరిగిన అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ మోదీని పొగడటం హాస్యాస్పదమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయన్నారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో బుకీలు

విజయవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): గన్నవరం కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఒక వ్యక్తి గన్నవరంలో యాప్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా విజయవాడకు చెందిన పటమట నాగరాజు అనే వ్యక్తి ఈ యాప్‌ను ఇచ్చినట్టు వివరించాడు. అతడిని అదుపులోకి తీసుకోగా తన సోదరుడు ఈ యాప్‌ను ఒక ఆటో డ్రైవర్ నుంచి తీసుకున్నట్టు తెలియజేశాడు. ఆటో డ్రైవర్ బాషా తో పాటు నాగరాజు, అతడి సోదరుడు, కరీంనగర్‌కు చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన యువకుడి ఖాతాలో రూ.2లక్షలు నిల్వ ఉన్నట్టు గుర్తించారు. ఇందులో నిందితులు కృష్ణలంక ప్రాంతానికి చెందిన వారు కావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు.

అర్జీ అంటే కాగితం కాదు.. ప్రజల ఆవేదన

- పీజీఆర్ఎస్ సామర్థ్య నిర్మాణ శిక్షణ వర్క్‌షాప్‌లో సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ చిన్నారావు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ చిన్నారావు, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు సమర్పించే అర్జీని కాగితంలా భావించొద్దని, వారి వేదనగా భావించి పరిష్కరించాలని అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ చిన్నారావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లాస్థాయి అధికారులకు సామర్థ్య నిర్మాణ శిక్షణ వర్క్‌షాపు జరిగింది. పీజీఆర్ఎస్ ద్వారా గ్రీవెన్స్ రిడ్రెసెల్ అధికారి అర్జీని స్వీకరించింది మొదలు నిర్దేశ గడువులో దరఖాస్తుదారుడు పూర్తిస్థాయి సంతృప్తిచెందేలా సమస్యను పరిష్కరించేవరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహరించాల్సిన తీరుపై చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు సూచనలు చేసి, అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి శాఖకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గ్రీవెన్స్ రిడ్రసల్ అథారిటీగా ఒకరికి బాధ్యతలు అప్పగించడం జరిగిందని, అర్జీని కిందిస్థాయి అధికారికి అప్పగించకుండా గ్రీవెన్స్ రిడ్రసల్ అధికారే అర్జీదారుడితో ఫోన్‌లో లేదా నేరుగా కలిసి మాట్లాడి, సమస్యను సావధానంగా వినాలన్నారు. సున్నిత అంశాల్లో నేరుగా కలిసి మాట్లాడటం మంచిదన్నారు. మండలస్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో తదితర అధికారులు అర్జీల పరిష్కారంలో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. అప్పుడే అర్జీల పరిష్కారంలో నాణ్యతతో పాటు సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. కిందిస్థాయిలో పరిష్కారానికి వీలులేని వాటిని సరైన విధంగా పైస్థాయికి పంపాల్సి ఉంటుందని, అలాగే అర్జీదారుడికి తెలుగులో స్పష్టమైన వివరణతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు, దార్శనికతకు అనుగుణంగా కలెక్టర్ సారథ్యంలో పీజీఆర్ఎస్‌ను జిల్లాలో విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని చిన్నారావు సూచించారు. గ్రీవెన్స్ రిడ్రసల్ ఆడిటింగ్, ఫీడ్‌బ్యాక్ మెకానిజం తదితరాలపై వర్క్‌షాపులో వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల, డివిజన్ స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి లోకేశ్


లోకేశ్‌కు వినతిప్రతం ఇస్తున్న వల్లూరు శివప్రసాద్ తదితరులు

విజయవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరాదరణకు గురౌతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృభాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న ప్రజాదర్బార్‌లో ఆయన్ను కలిశారు. నగరంలో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్ని రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మాదిరిగా పుస్తక మహోత్సవాన్ని ఎన్టీఆర్ ట్రస్టుతో కలిసి జరపాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధి వంటి వాటిపై కసరత్తు చేస్తున్నామని, అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య ప్రతినిధులు వెంకట నారాయణ, గోళ్ల నారాయణరావు ఉన్నారు.

20న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి: వడ్డే

గాంధీనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులు, రైతులు, కౌలు రైతులకు కార్మిక, కర్షక సంఘాలు పిలుపునిచ్చాయి. రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల రాష్ట్రస్థాయి సంయుక్త సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ జాతీయ రైతు నేత రాకేష్ తికాయిత్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. సీ2+ 50 ప్రకారం పంటల మద్దతు ధరల చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు మాఫీ చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా మోదీ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. దీనిలో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా చేపట్టబోయే సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. రైతు సంఘం నేతలు వై.కేశవరావు, కేవీవీ.ప్రసాద్, చుండూరు రంగారావు, కార్మిక సంఘాల నేతలు యం.రామకృష్ణ, పొలారి, మరీదు ప్రసాద్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.







ఫ్లవర్ పవర్

తెల్ల డ్రస్సు మీద రంగురంగుల ఆకర్షణీయమైన పూల డిజైన్లు మహిళలను ఇట్టే ఆకర్షించేస్తూ ఉంటాయి. అవి చీరలైనా, ఫ్రాకులైనా, కుర్తీలైనా మనోహరంగా కనిపిస్తాయి కాబట్టి మహిళలు వీటి పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. మరీ ముఖ్యంగా వేసవిలో సాయంకాలాలు ఆహ్లాదకరంగా గడపాలనుకునేవాళ్లు, బీచ్ వేర్, ఈవినింగ్ వేర్‌గా కూడా ఈ రకమైన దుస్తులను ఎంచుకుంటూ ఉంటారు. అయితే పూల దుస్తులు రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం కోసం వాటికి కొన్ని అదనపు హంగులు జోడిస్తూ ఉండాలి. అవేంటంటే...

పూల డ్రస్సు ఆకర్షణీయంగానే కాదు, ఆహ్లాదకరంగా కూడా కనిపిస్తుంది. కాబట్టే ప్రత్యేకించి వేసవిలో ఇలాంటి గౌన్లు, ఫ్రాకులకు డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. అలాంటి కొన్ని పూల డ్రస్సులు మీకోసం...

శాండిల్స్, హైహీల్స్ ఏవైనా పూల డ్రస్సులకు చక్కగా నప్పుతాయి. అయితే మోకాళ్ల వరకూ పొడవుండే పొట్టి ఫ్రాక్ ఎంచుకున్నప్పుడు హైహీల్స్‌కూ, పొడవాటి గౌన్ ఎంచుకున్నప్పుడు శాండిల్స్‌కూ ప్రాధాన్యం ఇవ్వాలి

భారీ ఆభరణాలకు ఈ డ్రస్సులకు నప్పకపోయినా, పూల డిజైన్లు కలిగిన ఘాగ్రా చోళీ ఎంచుకున్నప్పుడు తప్పనిసరిగా భారీ ఆభరణాలతో మ్యాచ్ చేయాలి. పొడవాటి ఝుంకాలు, హారాలు కూడా వేసుకోవచ్చు

సౌకర్యానికి ప్రాధాన్యం ఇచ్చేవారు శాటిన్, లెనిన్, రయాన్ వస్త్రాలతో తయారైన పూల దుస్తులను ఎంచుకోవాలి. హుందాగా కనిపించాలను కుంటే కాటన్‌కు పెద్ద పీట వేయాలి

ఆమె ఆలోచనే బ్రాండ్

'బిబా'... పట్టణ ప్రాంతాల్లో ఈ బ్రాండ్ తెలియని మహిళలు దాదాపు ఉండక పోవచ్చు. కుర్తీలు, టాప్‌లు, ఎథినిక్ వేర్‌లో (సంప్రదాయ దుస్తులు) ఈ బ్రాండ్‌ను ఇష్టపడని అమ్మాయిలు దాదాపు ఉండరు. ఎనిమిది వేల రూపాయల బ్యాంక్ రుణంతో మొదలైన చిన్న వ్యాపారం.. ఎన్నో సవాళ్లను అధిగమించి విదేశీ పెట్టుబడిదారులను సంపాదించుకుని వందల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యంగా ఎదిగింది. ఎంతో మందికి స్ఫూర్తినిచ్చే 'బిబా' వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ మీనా బింద్రా(81) ప్రయాణం ఆమె మాటల్లోనే..



పిల్లల చదువు కోసం మొదలుపెట్టి

నాకు 18 ఏళ్లకు పెళ్లైంది. భర్త నేవీ అధికారి. పిల్లలు, బాధ్యతలు, సంసార జీవితంతోనే 20 ఏళ్లు పైగా గడిచి పోయాయి. పిల్లలు కొంచెం పెద్దవాళ్లయ్యాక నాకు స్వేచ్ఛ దొరికింది. పిల్లల చదువు కోసం అవసరమయ్యే డబ్బు నేను సంపాదించాలనుకున్నాను. నాకున్న డిగ్రీతో ఉద్యోగం దొరకడం కష్టమని తెలుసు. అందుకే ఇంటి నుంచే ఏదైనా సొంతంగా చేయాలనుకున్నాను. అలా 1988లో ఎనిమిది వేల రూపాయాల బ్యాంక్ రుణం తీసుకుని స్వయంగా దుస్తులు డిజైన్ చేయడం ప్రారంభించా.

ప్రారంభ ధర రూ. 190 మాత్రమే

గతంలో మహిళలకు ఎక్కువగా చీరలు ధరించే అలవాటు ఉండేది. అయితే నేను డిజైన్ చేసిన సల్వార్ కమీజ్ సూట్‌లు సౌకర్యవంతంగా, ట్రెండీగా ఉండడంతో మహిళలు వాటిని ధరించడానికి మక్కువ చూపారు. సరసమైన ధరలోనే అందుబాటులో ఉండడంతో సల్వార్ కమీజ్‌కు మంచి ప్రాచుర్యం దక్కింది. చాలా తక్కువ సమయంలోనే దేశమంతా విస్తరించింది. ఉద్యోగస్థులు, మధ్యతరగతి వారు, కళాకారిణులతో పాటు పారిశ్రామిక వేత్తల భార్యలు కూడా నా బ్రాండ్ దుస్తులను కొనడం ప్రారంభించారు. అప్పట్లో నేను డిజైన్ చేసిన ప్రింటెడ్ కాటన్ సూట్ ప్రారంభ ధర 190 రూపాయలు మాత్రమే.

రిటైల్ వ్యాపారంలోకి.. ఆపై సొంత స్టోర్‌లు

1990లలో రిటైల్ వ్యాపారం మొదలుపెట్టా. మొదట షాపర్స్ స్టాప్ నన్ను సంప్రదించింది. దాంతో షాపర్స్ షాప్‌కు మా వస్త్రాలు అందించాం. ఆ తరువాత లైఫ్ స్టైల్, ప్యాంటలూన్స్ వంటి స్టోర్‌లకు కూడా మా వస్త్రాలు సరఫరా చేశాం. 2004లో సొంత స్టోర్‌లు తెరవాలని నిర్ణయించాం. మొదటగా ముంబైలో రెండు స్టోర్‌లు తెరిచాం. ఆ తరువాత పలు చోట్ల స్టోర్‌లు తెరిచాం. రెండో ఏడాది 16 స్టోర్లు, ఆ తరువాత కాలంలో వాటి సంఖ్య పెరుగ తూనే ఉంది. ప్రస్తుతం బిబాకు దేశంలో 372కు పైగా స్టోర్‌లు, దాదాపు 250 మల్టీబ్రాండ్ అవుట్‌లెట్‌లు ఉన్నాయి. సింగపూర్, లండన్, యూఏఈ, న్యూజెర్సీ లోనూ 'బిబా' బ్రాండ్ విస్తరించింది.

ఇతర ఉత్పత్తులు

మా స్టోర్‌లలో మూడేళ్ల చిన్నారి నుంచి 80-85 ఏళ్ల వయసున్న మహిళల వరకు అందరికీ అవసరమైన దుస్తులు లభ్యమవుతాయి. మిక్స్ అండ్ మ్యాచ్, పిల్లల దుస్తులు, సెమీ ఫార్మల్‌లు అన్నీ దొరుకుతాయి. తాజాగా పెళ్లి వస్త్రాలు కూడా రూపొందిస్తున్నాం. 35 స్టోర్లలో వీటికి అందుబాటులో ఉంచాం. ఫలితాలు కూడా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. చాలా సంవత్సరాలు వస్త్రాలకు మాత్రమే పరిమితమైన మేము ప్రస్తుతం పాదరక్షలు, బ్యాగులు, పెర్ఫ్యూమ్‌లను కూడా విక్రయిస్తున్నాం.

విదేశీ పెట్టుబడిదారులు

ఫ్యూచర్ గ్రూప్ వ్యవస్థాపకుడు కిషోర్ బియ్యాని మా బ్రాండ్‌లో భాగస్వామిగా ఉండేవారు. ఆయన నిర్మించిన 'న తుమ్ జానో న హమ్' సినిమాలో నటులకు మేం వస్త్రాలు మేం డిజైన్ చేశాం. ఆ సినిమా బాగా ఆడకపోయినప్పటికీ మా వస్త్రాలకు మంచి పేరు వచ్చింది. ఆరేళ్ల పాటు కిషోర్ బియ్యాని మాతో భాగస్వామ్యం కొనసాగించారు. ఆపై ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు మాతో భాగస్వామ్యం కోసం చాలా మంది ప్రయత్నించారు. అయితే ఎవరూ ఊహించని విధంగా అమెరికాలోని పెద్ద బ్రాండ్ వార్‌బర్గ్ పిన్‌కస్.. బిబాతో భాగస్వామ్యానికి ముందుకొచ్చింది. 2013లో ఫెరింగ్ క్యాపిటల్‌తో కలిసి వార్‌బర్గ్ పిన్‌కస్ 300 కోట్ల రూపాయలతో బిబాలో 30 శాతం వాటా సొంతం చేసుకుంది.

గ్లోబల్ బ్రాండ్ ఆకాంక్ష

'బిబా' గ్లోబల్ బ్రాండ్ కావాలన్నదే నా ఆకాంక్ష. బిబాను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలను కుంటున్నా. అందుకోసం ప్రయత్నాలు చేస్తున్నాం. కచ్చితంగా అనుకున్నట్లు ఎదుగుతాం అన్న నమ్మకముంది.

చైర్మన్ భార్యవి అయ్యుండి...

నా ఈ ప్రయాణమంతా సాఫీగా ఏం సాగలేదు. నేను పుట్టింది, పెరిగింది అంతా ఢిల్లీలోనే. మా నాన్న వ్యాపారం చేసేవారు. నాకు తొమిదేళ్ల వయసున్నప్పుడు ఆయన చనిపోయారు. అప్పుడు అమ్మే కుటుంబ బాధ్యతలు తీసుకుంది. ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ చేశాక నాకు పెళ్లి జరిగింది. నా భర్త ప్రభుత్వ అధికారి కావడంతో బదిలీలతో పలుచోట్లకు తిరగాల్సి వచ్చేంది. నేను వ్యాపారం చేసేటప్పుడు ఆయన విశాఖపట్నంలో ఓ ప్రభుత్వ రంగ సంస్థ చైర్మన్‌గా ఉన్నారు. ఆయనకు దూరంగా ముంబైలో ఉంటూ నా వ్యాపారం మొదలు పెట్టాను. అప్పటికి నాకు డిజైనింగ్‌లో ఎలాంటి నైపుణ్యం లేదు. కానీ నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందించాలని ఎంతో ప్రయాసపడ్డాను. అందుకోసం ఎంతో కష్టపడ్డాను. డబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉన్నాను. నేను తీసుకున్న బ్యాంకు రుణంలో మొదట సగం మాత్రమే ఖర్చు చేసి ఉత్పత్తులు తయారు చేశాను. సాధారణ మధ్యతరగతి మనస్తత్వంతో అలా చేశాను. నేను వ్యాపారం ఆరంభించినప్పుడు వ్యాపార సామ్రాజ్యంలో అంతా పురుషులదే హవా. ఇప్పుడంటే మహిళా వ్యాపారంలో మహిళలు ఎంతో ఎదుగుతున్నారు కానీ అప్పట్లో ఇలాంటి పరిస్థితులు లేవు. నీ భర్త ఓ చైర్మన్, అలాంటిది ఈ వ్యాపారమేంటని నన్ను నిరుత్సాహపరిచిన వారూ ఉన్నారు. ఓ వైపు వ్యాపారంలో పోటీ. ఇంకోవైపు మాకేమో సరిపడా వనరులు కూడా లేవు. అయినా సరే కష్ట పడి చిన్నగా అన్నీ సమకూర్చుకున్నాం. ఇలా ఎన్నో అడ్డంకులు దాటుకుని ఎంతోమంది మగువల మనసులను దోచుకోగలిగాం.

వేసవిలో మొక్కలు ఇలా పచ్చగా...

ఎండాకాలంలో మొక్కలు ఎక్కువగా తేమను కోల్పోయి వడలిపోతూ ఉంటాయి. కుండీల్లో అయితే మట్టి కూడా తడారిపోతుంది. మనం గమనించి నీళ్ల పోయడం ఆలస్యమైతే మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. ఇలా కాకుండా వేసవిలో కూడా మొక్కలు పచ్చగా ఎదగాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- వేసవిలో మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో సూర్యరశ్మి నేరుగా మొక్కల మీద పడకుండా టార్పాలిన్ షీట్ లేదా పలుచని కాటన్ గుడ్డని తెరలా కట్టాలి.
- మొక్కలకు ఉదయం, సాయంత్రం కొద్ది కొద్దిగా నీళ్ల పోయాలి. మొక్క చుట్టూ మట్టి తేమగా ఉండేలా చూసుకోవాలి. నీళ్లలో ముంచిన స్పాంజీని మొక్క మొదట్లో పెట్టవచ్చు. లేదంటే ఒక ప్లాస్టిక్ బాటిల్ తీసుకుని నీళ్లతో నింపి దానికి చుట్టూరా రంధ్రాలు చేసి మొక్క పక్కన ఉంచవచ్చు.
- మట్టిలో కోకోపిట్ లేదా సేంద్రీయ ఎరువు కలిపితే నీరు ఎక్కువసేపు నిలిచి ఉంటుంది. దీంతో మొక్కకు కావాల్సిన తేమ అంది ఏపుగా పెరుగుతుంది.



- మొక్కలకు గాలి తగిలేలా చూసుకోవాలి. దీనివల్ల అవి వేడి వాతావరణాన్ని తట్టుకోగల్గుతాయి.
- ఎండిపోయిన పూలు, ఆకులను ఎప్పటికప్పుడు తీసివేయాలి. నల్లగా మారిన కొమ్మలను కత్తిరించాలి. దీనివల్ల కొత్త చిగుర్లు వస్తాయి.
- ఎండాకాలంలో మొక్కలకు పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆకుల మీద రంధ్రాలు కనిపించినా, మొక్క వాడిపోతున్నా ఒకసారి పరిశీలించి ఏవైనా పురుగులు ఉంటే ఆ భాగాన్ని కత్తిరించి కాల్చివేయాలి. పసుపు నీళ్లను మొక్క భాగాలపై చిలకరించాలి. గుప్పెడు వేపాకులను మొక్క మొదట్లో వేయాలి.



మంజుమ్మెల్ గర్ల్

నిరుడు విడుదలైంది సర్వైవల్ థ్రిల్లర్... 'మంజుమ్మెల్ బాయ్స్' కదా? మరి ఈ గర్ల్ ఎవరనుకుంటున్నారా? ఆమె పేరు అలీషా గిన్సన్. బాధ్యత తీసుకోడానికి వయసుతో పని లేదంటూ పద్దెనిమిదేళ్లకే ఆటో డ్రైవర్‌గా మారి కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. మరోవైపు చదువు కూడా కొనసాగిస్తున్న అలీషా ఇప్పుడు ప్రతిష్ఠాత్మకమైన 'కేరళ సవారీ'కి బ్రాండ్ అంబాసిడర్ కూడా.

"ఏడాదిన్నర క్రితం ఇల్లు, కాలేజీ, స్నేహితులు, కుటుంబం... ఇదీ నా లోకం. నాన్న గిన్సన్ జార్జి... హౌస్ కీపింగ్ కాంట్రాక్టర్. ఇళ్లను, ఆఫీసుల్ని శుభ్రం చేయించే బిజినెస్ నడుపుతూ ఉండేవారు. నాన్న ఆదాయం మా కుటుంబానికి బొటాబొటిగా సరిపోయేది. ఆస్తిపాస్తులు లేకపోయినా... నన్ను, మా అన్నయ్యను బాగా చదివించాలని అమ్మా నాన్నా తపన పడేవారు. వారి కల నిజం చేయాలని మేము కష్టపడి చదివేవాళ్లం. అలా సాగిపోతున్న మా కుటుంబాన్ని ఒక దుర్ఘటన అల్లకల్లోలం చేసింది.

అంతా తల్లకిందులైంది...

సాయంత్రమయ్యేసరికి ఇంటికి వచ్చి, సరదాగా కబుర్లు చెప్పే నాన్న ఆ రోజు ఎంతకీ రాకపోయేసరికి 'ఏమయిందా?' అని ఫోన్ చేశాం. స్పందన లేకపోయేసరికి 'పనిలో బిజీగా ఉండి ఉంటారు. ఆయనే తిరిగి కాల్ చేస్తారు' అనుకున్నాం. కాసేపటికి ఆసుపత్రి నుంచి ఎవరో కాల్ చేశారు. నాన్న స్కూటర్ మీద ఇంటికి తిరిగి వస్తూ ఉండగా యాక్సిడెంట్ అయిందని, ఆయన తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ఆందోళనతో నేను, అమ్మ ఆసుపత్రికి పరుగులు పెట్టాం. నాన్న అపస్మారక స్థితిలో ఉన్నారు. ప్రాణాపాయం లేదు కానీ... కోలుకోడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. ఈ సంగతి తెలిసి... బెంగళూరులో చదువుతున్న అన్నయ్య ఇంటికి వచ్చేశాడు. నాన్న కొన్ని నెలలపాటు ఆసుపత్రిలోనే ఉండాల్సి వచ్చింది. బిజినెస్ బాధ్యతలు అన్నయ్య తీసుకున్నాడు. నాన్న పరిస్థితి చూసి... అమ్మ ఆరోగ్యం చెడింది. ఆమెకు న్యూమోనియా సోకి, ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ రావడంతో ఆమె కూడా ఆసుపత్రి పాలైంది. అలా ఇద్దరూ మంచాన పడడంతో మా పరిస్థితి ఒక్కసారిగా తల్లకిందులైంది. ఇంటి పనుల కోసం నేను, బిజినెస్ కోసం అన్నయ్య చదువు మధ్యలో మానేయాల్సి వచ్చింది. కొన్ని రోజులకు నాన్నను, అమ్మను ఇంటికి తీసుకువచ్చినా... మందులు, ఇతర అవసరాల కోసం ఎక్కువగానే ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ఆ సమయంలో... నేను నేర్చుకున్న ఆటో డ్రైవింగ్ అక్కరకు వచ్చింది.

కొత్త ప్రయాణం...

మా మామయ్య ఆటోలో పిల్లల్ని స్కూళ్లకు తీసుకువెళ్లేవాడు, దుకాణాలకు, గోడౌన్లకు వస్తువులను చేరవేసేవాడు. నన్ను కూడా మొదట బడికి, తరువాత కాలేజీకి తనే తీసుకువెళ్లేవాడు. నేను సరదా పడడంతో నాకు ఆటో నడపడం నేర్పాడు. మా ఇంటి పరిస్థితులను గమనించి "నీకు పద్దెనిమిదేళ్ళు నిండాయి కాబట్టి లైసెన్స్ తీసుకుంటే... అద్దెకు ఆటో ఇప్పిస్తాను. ఇంటి ఖర్చులకు ఆసరా అవుతుంది" అన్నాడు. అతని సలహా నాకు నచ్చింది. లైసెన్స్‌కు దరఖాస్తు చేశాను, అది మంజూరైన వెంటనే... ఆటో డ్రైవర్‌గా కొత్త ప్రయాణం మొదలుపెట్టాను. కొన్నిరోజుల పాటు మామయ్యకు సాయంగా... స్కూళ్లకు, సరుకుల చేరవేతకు ఆటో నడిపేదాన్ని. ఆ తరువాత తెల్లరంగు ఈ-ఆటోరిక్షాను రుణంపై తీసుకున్నాను. అప్పటినుంచి ప్రయాణికుల కోసం ఆటో నడుపుతున్నా. మొదట్లో రోజుకు రూ. 500 వరకూ మిగిలేవి. ఇప్పుడు 'ఊబర్'లో చేరాక... సుమారు రూ. 700 వరకూ సంపాదిస్తున్నా. సొంత ఆదాయం ఉంది కాబట్టి మళ్ళీ కాలేజీలో చేరాను. తరగతులు పూర్తయిన తరువాత... రోజూ సాయంత్రం అయిదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఆటో నడుపుతాను.

ఊహించని గౌరవం...

"ఆడ పిల్లవి. ఆటో నడుపుతున్నావ్.



ఎలాంటి ఇబ్బందులూ ఉండవా?" అని ఎంతోమంది అడుగుతూ ఉంటారు. అదృష్టవశాత్తూ నాకు ఎలాంటి చెడు అనుభవాలు ఎదురు కాలేదు. మగ ప్రయాణికులెవరూ చెడ్డగా ప్రవర్తించలేదు. జుట్టు దగ్గరగా కత్తిరించుకొని అబ్బాయిలా కనిపిస్తూ ఉండడం, మగ ప్రయాణికులతో పెద్దగా సంభాషణలోకి దిగకపోవడం దీనికి కారణం అనుకుంటున్నా. అదీకాకుండా... మంజుమ్మెల్... నేను పుట్టి పెరిగిన ఊరు. కాబట్టి ఎలాంటి భయం లేదు. నాకు మా ఊరంటే ఎంతో ఇష్టం. అందుకే నా ఆటో మీద 'మంజుమ్మెల్ గర్ల్' అనే పేరు రాయించుకున్నా. ఇప్పుడు అందరూ ఆ పేరుతో పిలుస్తున్నారు. కొన్నాళ్ళ క్రితం ఒక ప్యాసింజర్ వచ్చారు. "అబ్బాయ్!" అని పిలిచి, తను వెళ్ళాల్సిన చోటెక్కడో చెప్పారు. "తప్పకుండా వస్తా" అని చెప్పాను. "ఓహ్! నువ్వు అమ్మాయివా?" అని అన్నారతను. మళ్ళీ అవే మాటలు అనాలని అడిగి వీడియో తీశారు. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది వైరల్ అయిపోయింది. నా గురించి చాలామంది ఆరా తీయడంతో... నా కథ అందరికీ తెలిసింది. అది కేరళ రాష్ట్ర సాధారణ విద్య, కార్మిక మంత్రి శివకుట్టి దృష్టికి కూడా వెళ్ళింది. ఆయన నాతో మాట్లాడారు. ప్రయాణికులకు, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వారధిగా... ఎలాంటి ఇబ్బందులూ లేని ప్రయాణం కోసం కేరళ ప్రభుత్వం 'కేరళ సవారీ' అనే జీరో కమిషన్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చింది. కొన్ని సమస్యలతో ఆ యాప్ సేవలు ఆగిపోయాయి. దాన్ని పునఃప్రారంభిస్తూ... ఆ బ్రాండ్ అంబాసిడర్‌గా నన్ను నియమిస్తున్నట్టు మంత్రి శివకుట్టి ప్రకటించారు. ఇది నేను ఊహించని గౌరవం. ప్రతి ఒక్కరూ నన్ను అభినందిస్తూ ఉంటే... ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పుడిప్పుడే మా ఇంటి పరిస్థితి కుదుటపడుతోంది. నా చదువు కూడా బాగా సాగుతోంది. ఏమాత్రం ఖాళీ దొరికినా కొత్త విషయాలు నేర్చుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. జర్మన్ భాషలో ప్రాథమిక కోర్సు పూర్తి చేశాను. ఫ్యాషన్ డిజైనింగ్ డిప్లమా సంపాదించాను. కొత్త ప్రదేశాలకు ఒక్కదాన్నే వెళ్ళడం అంటే ఇష్టం. నా తల్లితండ్రుల్ని పూర్తి ఆరోగ్యవంతులుగా చేయడం, నా గురించి వాళ్ళు కన్న కలలు నెరవేర్చడం నా ఆశయం. దానికోసం ఎన్ని సవాళ్ళు ఎదురైనా సంతోషంగా స్వీకరిస్తాను."

స్నేహం ఇలా చేయాలి

మంచి స్నేహితులు ఉండాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. కొంతమందికి స్నేహితులు ఎక్కువగా ఉంటారు. మరికొంతమందికి మాత్రం ఒకరిద్దరికి మించి ఉండరు. ఈ వ్యత్యాసానికి కారణం వ్యక్తిత్వం, నడవడిక మాత్రమే అంటున్నారు నిపుణులు. అసలు స్నేహితులను ఎలా సంపాదించుకోవాలో... స్నేహం ఎలా చేయాలో తెలుసుకుందాం..!

- స్నేహితులను సంపాదించుకునే క్రమంలో చాలా మంది తమను తాము మార్చుకుంటూ ఉంటారు. దీనివల్ల భవిష్యత్తులో సమస్యలు రావచ్చు. అలాకాకుండా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా మెలగితే ఆలస్యంగానైనా నిజమైన స్నేహితులు దొరుకుతారు.
- కొత్త వ్యక్తులతో సౌమ్యంగా మాట్లాడాలి. చిన్న ప్రశ్నలతో వారి అభిరుచులు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. వారికి కూడా మాట్లాడే అవకాశం ఇవ్వాలి. ఇలా మాటలు కలుపుతూ ఉంటే క్రమంగా స్నేహితులు ఏర్పడతారు.
- కొత్త స్నేహితులతో ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడాలి. ఏ సందర్భంలోనైనా సరైన రీతిలో స్పందిస్తూ ఉంటే క్రమంగా స్నేహం పెరుగుతుంది.
- స్నేహితులతో మనస్ఫూర్తిగా మాట్లాడాలి. సొంత అభిప్రాయాన్ని తెలియజేయడంలో తడబడవద్దు. అదే సమయంలో వారి అభిప్రాయాలను కూడా తెలుసుకుని గౌరవించాలి.
- స్నేహితుల ఇష్టాలను తెలుసుకుంటూ ఉండాలి. వాటికి అనుగుణంగా మాట్లాడుతూ అవసరమైన సహకారం అందించాలి.
- స్నేహితులు చెప్పే విషయాలను పూర్తిగా వినాలి. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలి.



టీసీఎస్‌లో సీనియర్ ఉద్యోగులకు వేరియబుల్ చెల్లింపుల్లో కోత!

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ తన సీనియర్ ఉద్యోగులకు జనవరి-మార్చి త్రైమాసికానికి చెల్లించాల్సిన 'వేరియబుల్ పే'లో కోత విధించింది. వీరికి వేరియబుల్ పే తగ్గించడం వరుసగా ఇది మూడో త్రైమాసికమని ఓ ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. టీసీఎస్ సీనియర్ ఉద్యోగుల సీటీసీ (కాస్ట్ టు కంపెనీ)లో వేరియబుల్ పే 15-20 శాతంగా ఉంది. కాగా, టీసీఎస్ దీన్ని తోసిపుచ్చింది. కాగా ఈ మార్చి త్రైమాసికంలో 70 శాతానికి పైగా ఉద్యోగులకు 100 శాతం వేరియబుల్ పే చెల్లించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఉద్యోగి విధులు నిర్వహిస్తున్న బిజినెస్ యూనిట్ పనితీరు ఆధారంగా ఈ చెల్లింపులను నిర్ణయించడం జరుగుతుందని కంపెనీ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీసీఎస్‌లో 6 లక్షలకు పైగా ఉద్యోగులున్నారు.

వృద్ధి రేటు అంచనాను కుదించిన మూడీస్

న్యూఢిల్లీ: అమెరికా విధానాల్లో అస్థిరతలు, వాణిజ్య పరిమితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలన్నీ మాంద్యంలోకి జారుకునే ప్రమాదం ఉన్నదని, ఈ పరిస్థితుల్లో భారత వృద్ధి రేటు ఈ ఏడాది 6.3 శాతానికే పరిమితం కావచ్చని మూడీస్ రేటింగ్స్ తాజా అంచనాలో తెలిపింది. గతంలో తాను ప్రకటించిన 6.5 శాతం అంచనాను 0.20 శాతం మేరకు కుదించింది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కూడా వృద్ధికి సవాలుగా నిలుస్తాయని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	495
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	145	విజయవాడ	144
వరంగల్	145	గుంటూరు	142
కరీంనగర్	145	ఒంగోలు	142
మహబూబ్‌నగర్	145	చిత్తూరు	115
కర్నూలు	145	నెల్లూరు	120
విశాఖపట్నం	141	అనంతపురం	120
గోదావరి	144		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,460 ▲	90,250 ▲	1,07,900 ▼
విజయవాడ	98,500 ▲	92,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	1,00,360 ▲	90,250 ▲	1,07,900 ▼
రాజమండ్రి	99,450 ▲	90,250 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▲	90,250 ▲	98,500 ▲
ముంబై	96,888 ▲	88,749 ▲	95,854 ▲

ఇంకా నగదే రారాజు

డిజిటల్ యుగంలోనూ తగ్గని కరెన్సీ జోరు
2024-25లో సగటున ఒక్కో ఏటీఎం నుంచి రూ.1.3 కోట్ల విత్‌డ్రాయల్స్
టాప్‌లో ఉత్తర భారతం..
సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపులు ఎంతగా పుంజుకున్నా మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంకా నగదు హవా కొనసాగుతోంది. గత పదేళ్లలో, చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల (నగదు) పరిమాణం 157 శాతం, ఏటీఎంల సంఖ్య 32 శాతం, బ్యాంకు శాఖల సంఖ్య 36 శాతం పెరగడం ఇందుకు ఉదాహరణ. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నగదు నిర్వహణ సేవలు అందించే సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశంలోని ఒక్కో ఏటీఎం నుంచి సగటున రూ.1.3 కోట్ల నగదు ఉపసంహరణలు (విత్‌డ్రాయల్స్) నమోదయ్యాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.28 లక్షలు ఎక్కువ. గత ఏడాది మార్చి నాటికి చూసినా మన దేశ వినియోగదారుల చెల్లింపుల లావాదేవీల్లో 60 శాతం నగదు ద్వారానే జరిగాయి.

దక్షిణాదిలో కనిష్ఠం

దక్షిణ భారత్‌తో పోలిస్తే ఉత్తర భారత్‌లో నగదు హవా మరింత ఎక్కువగా ఉంది. నిజానికి దక్షిణ భారత్‌లో గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసే నగదు పరిమాణం వృద్ధి రేటు తగ్గింది. తమిళనాడు, తెలంగాణల్లో జీరో వృద్ధి రేటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మైనస్ ఒక శాతం, కేరళలో మైనస్ 14 శాతం, కర్నాటకలో మైనస్ రెండు శాతం నమోదైంది. ఇదే సమయంలో బిహార్‌లో 8 శాతం, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల్లో 4 శాతం, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో 2 నుంచి 3 శాతం నగదు విత్‌డ్రాయల్స్ పెరిగినట్టు సీఎంఎస్ ఇన్ఫో నివేదిక వెల్లడించింది.

సగటు విత్‌డ్రాయల్స్ రూ.5,658

గత ఆర్థిక సంవత్సరం ఒక్కో వ్యక్తి ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసిన సగటు నగదు మొత్తం రూ.5,658కు చేరింది. అంతకు ముందు సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు చూస్తే కొన్ని నెలల్లో నగదు ఉపసంహరణలు 4 నుంచి 6 శాతం పెరిగాయి. ఇదే సమయంలో సగటు డిజిటల్ చెల్లింపులు తగ్గాయి. 2023 ప్రథమార్ధంలో రూ.1,603గా ఉన్న యూపీఐ చెల్లింపుల సగటు.. గత ఏడాది తొలి ఆరు నెలల్లో రూ.1,478కు తగ్గింది. ఇదే సమయంలో పర్సన్-2-మర్చంట్ (పీ2ఎం) చెల్లింపులూ రూ.667 నుంచి రూ.643కు తగ్గినట్టు సీఎంఎస్ నివేదిక తెలిపింది.

పీఎస్‌యూల డీలిస్టింగ్‌కు ప్రత్యేక విధానం!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) స్వచ్ఛంద డీలిస్టింగ్‌ను సులభతరం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. ఇందుకోసం అనుసరించాల్సిన విధి విధానాలతో ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై మార్కెట్ వర్గాలు ఈనెల 26లోగా తమ స్పందన తెలియజేయాలని కోరింది.

చర్చా పత్రం ముఖ్యాంశాలు

- మొత్తం ఈక్విటీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్, ఇతర పీఎస్‌యూలు 90 శాతానికి పైగా వాటా కలిగి ఉండాలి
- ఇలాంటి పీఎస్‌యూల ఈక్విటీలో కనీస పబ్లిక్ వాటా లేకపోయినా డీలిస్ట్ కావచ్చు
- పీఎస్‌యూలు ఒక నిర్ణీత ధర వద్ద కూడా తమ షేర్లను డీలిస్ట్ చేయవచ్చు
- షేర్ల ట్రేడింగ్ ఫ్రీక్వెన్సీతో సంబంధం లేకుండా డీలిస్టింగ్ షేర్ల కనీస ధరపై 15 శాతం ప్రీమియం ఉండాలి
- మూడింట రెండు వంతుల మంది వాటాదారుల ఆమోదం నిబంధన పీఎస్‌యూల డీలిస్టింగ్‌కు వర్తించదు.

జెన్‌సోల్, బ్లూస్మార్ట్‌పై కార్పొరేట్ శాఖ దర్యాప్తు

న్యూఢిల్లీ: కంపెనీల చట్టం ఉల్లంఘనల ఆరోపణలకు సంబంధించి జెన్‌సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ మొబిలిటీపై దర్యాప్తునకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ప్రమోటర్లు పెద్దఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో ఈ రెండు కంపెనీలూ ఆర్థిక సంక్షోభంలోకి జారుకున్నాయి. నిధుల మళ్లింపుతో పాటు కార్పొరేట్ పాలన ప్రమాణాలను అతిక్రమించినందుకు గాను జెన్‌సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ ప్రమోటర్లైన అన్‌మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ సోదరులను సెబీ ఇప్పటికే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించింది. కాగా, ఈ రెండు కంపెనీల పద్దులు, ఆర్థిక పత్రాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సమీక్షిస్తోంది. ఆ ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. అంతేకాదు, జెన్‌సోల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు జరుపుతోంది.

రూ.6 లక్షల కోట్లు ఆవిరి

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో 155 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు బ్యాంకింగ్, ఆయిల్ సహా పలు రంగ షేర్లలో లాభాల స్వీకరణకు దిగారు. దాంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒక దశలో 315 పాయింట్లు క్షీణించినప్పటికీ, మళ్లీ కాస్త తేరుకుంది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.55 పాయింట్లు కోల్పోయి 24,379.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 నష్టపోయాయి. ఎటర్నల్ స్టాక్ 3.08 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, ఎస్‌బీఐ రెండు శాతానికి పైగా తగ్గాయి. బుధవారం నాడు అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుండటంతోపాటు యూఎస్-చైనా మధ్య వాణిజ్య చర్చల నేపథ్యంలో ట్రేడర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని, దాంతో ప్రధాన సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.6 లక్షల కోట్లు తగ్గి రూ.421.31 లక్షల కోట్లకు (4.98 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

● గత వారం ఐపీఓకు వచ్చిన విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ ఏథర్ ఎనర్జీ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.321తో పోలిస్తే, బీఎస్ఈలో తొలి రోజు ట్రేడింగ్ పూర్తయ్యే సరికి కంపెనీ షేరు 5.76 శాతం క్షీణించి రూ.302.50 వద్దకు జారుకుంది.

5 ఐపీఓలకు సెబీ ఆమోదం: వెరిటాస్ ఫైనాన్స్, లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ సహా 5 కంపెనీల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనలకు సెబీ ఆమోదం లభించింది. జాజూ రష్మీ రిఫ్రాక్టరీస్, రిగాల్ రీసోర్సెస్, అజయ్ పోలీ కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

మళ్లీ రూ.లక్ష చేరువలో బంగారం

ఢిల్లీలో ఒకే రోజు రూ.2,400 పెరుగుదల

వరుసగా మూడో రోజు ఎగబాకిన పసిడి మళ్లీ లక్ష రూపాయలకు చేరువైంది. మంగళవారం ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర ఒకే రోజు రూ.2,400 పెరిగి రూ.99,750కి చేరింది. కిలో వెండి రూ.1,800 పెరుగుదలతో రూ.98,500 ధర పలికింది. ట్రంప్ తాజా సుంకాలతో పాటు అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాల నేపథ్యంలో అంతర్జాతీయంగా వీటి ధరలు మళ్లీ పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 1.37 శాతం పెరిగి 3,379 డాలర్లకు చేరగా.. సిల్వర్ 33 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఐదేళ్లలో రూ.8.5 లక్షల కోట్ల వాణిజ్యం

• పెట్టుబడులు, జీడీపీ వృద్ధికి ఊతం • భారత్-యూకే వాణిజ్య ఒప్పందంపై ఇండియా ఇంక్

లండన్: భారత-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ ఎఫ్‌టీఏతో యూకే మార్కెట్లో భారతీయ ఎగుమతిదారులకు మరింత లబ్ధి చేకూరనుందని పారిశ్రామిక సంఘాలు తెలిపాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత వాతావరణంలో ఈ ఎఫ్‌టీఏతో ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, ఇన్నోవేషన్ ఆధారిత పరిశ్రమలకు లాభం చేకూరనుందని ఫిక్కీ ప్రెసిడెంట్ హర్ష వర్ధన్ అగర్వాల్ అన్నారు. అంతేకాకుండా 2030 నాటికి భారత్-యూకే ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 10,000 కోట్ల డాలర్ల (రూ.8.5 లక్షల కోట్లు)కు చేర్చే అవకాశం లభించనుందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) జాతీయ అధ్యక్షుడు సంజీవ్ పురి ఆశాభావం వ్యక్తం చేశారు. సుంకాల యుద్ధం నేపథ్యంలో రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఎఫ్‌టీఏ మరింత ప్రాధాన్యత సంతరించుకుందని సీఐఐ యూకే-ఇండియా బిజినెస్ ఫోరం చైర్మన్ కేశవ్ మురుగేశ్ అన్నారు. ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులకు ఉన్న ఆటంకాలూ తొలగిపోతాయని యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (యూకేఐబీసీ) పేర్కొంది. ఈ ఎఫ్‌టీఏ రెండు దేశాల ఆర్థిక వృద్ధితో పాటు ఉద్యోగాలు, నవకల్పనలకూ దోహదం చేస్తుందని యూకేఐబీసీ ఛైర్మన్ రిచర్డ్ హీల్డ్ చెప్పారు.

'ఈయూ నుంచి బయటికి వచ్చిన తర్వాత బ్రిటన్ కుదుర్చుకున్న అతిపెద్ద ఎఫ్‌టీఏ ఇదే. భారత్ ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. బ్రిటన్‌కు 11వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం 8,000 కోట్ల పౌండ్లకు పైగా పెరిగేందుకు ఈ ఎఫ్‌టీఏ ప్రేరకం కానుంది' అని ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) యూకే చాప్టర్ చైర్మన్ లార్డ్ కరన్ బిల్లీమోరియా చెప్పారు.

మరోవైపు ఈ ఒప్పందాన్ని నాస్కామ్ కూడా స్వాగతించింది. భారత టెక్నాలజీ కంపెనీలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న డబుల్ కంట్రిబ్యూషన్ భారం వంటివి తొలగిపోనున్నాయని, ఇది ఈ రంగానికి ఎంతగానో మేలు చేకూర్చనుందని పేర్కొంది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి ఎమర్జింగ్ రంగాల్లో మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఎఫ్‌టీఏతో లభించనుందని నాస్కామ్ వెల్లడించింది.

దక్షిణాదిలో అతిపెద్ద మహీంద్రా షోరూమ్

విజయవాడలో ఏర్పాటు

విజయవాడ (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రిటైల్ సంస్థ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద మహీంద్రా డీలర్‌షిప్ షోరూమ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఏర్పాటు చేసింది. విజయవాడలోని ఎనికేపాడులో రూ.15 కోట్లతో 1.03 లక్షల చదరపు అడుగుల్లో ఈ షోరూమ్‌ను నెలకొల్పినట్లు ఏఎంపీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ తెలిపారు. అత్యాధునిక 3ఎస్ (సేల్స్, సర్వీస్, స్పేర్స్) సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు.

తెలుగు స్విమ్మర్ల పతకాల పంట

ఖేలో ఇండియా యువజన క్రీడలు


సంపత్, తీర్థు

పట్నా/న్యూఢిల్లీ: ఖేలో ఇండియా యువజన క్రీడల్లో మంగళవారం తెలుగు స్విమ్మర్లు పతకాల పంట పండించారు. స్విమ్మింగ్ 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంపత్‌కుమార్ యాదవ్, తీర్థు సామదేవ్ వరుసగా స్వర్ణ, కాంస్యాలు దక్కించుకున్నారు. ఇక, 400 మీ. వ్యక్తిగత మెడ్లేలోనూ సత్తా చాటుతూ తీర్థు సామదేవ్ రజతం గెలిచాడు. తెలంగాణకు చెందిన వర్షిత్ (బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే), సుహాస్ ప్రీతమ్ (బాలుర 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్), శ్రీనిత్య సాగి (బాలికల 100 మీ. బ్యాక్‌స్ట్రోక్) తమ విభాగాల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి మూడు స్వర్ణాలు అందించారు. ఇక, ఒక కిలోమీటర్ సైక్లింగ్ ట్రాక్ ఈవెంట్‌లో సాయి చరణ్ యాదవ్ కాంస్యం నెగ్గి తెలంగాణ ఖాతాలో నాలుగో పతకాన్ని చేర్చాడు.



ఫేవరెట్ గుకేశ్

నేటి నుంచి సూపర్‌బెట్ క్లాసిక్

బుకారెస్ట్ (రుమేనియా): సూపర్‌బెట్ క్లాసిక్ చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేశ్ దొమ్మరాజు ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా బుధవారం నుంచి జరగనున్న ఈ ఈవెంట్‌లో మొత్తం 10 మంది గ్రాండ్ మాస్టర్లు తలపడనున్నారు. కాగా, తొలి రౌండ్‌లో సహచర జీఎం ప్రజ్ఞానందతో గుకేశ్ ఆడనున్నాడు. గత జనవరిలో టాటా స్టీల్ చెస్‌లో రెండో స్థానంలో నిలిచిన గుకేశ్. 3 నెలల విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు.

కెప్టెన్సీ.. మోయలేని భారంగా!

సారథ్యాన్ని వదులుకోవడంపై కోహ్లీ



బెంగళూరు: కెప్టెన్సీ భారంతో పాటు తన బ్యాటింగ్‌పై నిరంతర సమీక్షలను తట్టుకోలేకపోయినట్టు విరాట్ కోహ్లీ చెప్పాడు. ఒత్తిడిలేకుండా ఆటపైనే దృష్టిసారించాలన్న ఆలోచనతోనే ఐపీఎల్‌లో సారథ్య బాధ్యతల నుంచి తప్పుకొన్నట్టు 'ఆర్‌సీబీ బోల్డ్ డైరీస్' పాడ్‌కాస్ట్‌లో కోహ్లీ బయటపెట్టాడు. 2021 టీ20 వరల్డ్‌కప్ తర్వాత పొట్టి ఫార్మాట్ కెప్టెన్సీని వదులుకొన్న విరాట్..అనంతరం ఆర్‌సీబీ నాయకత్వానికి గుడ్‌బై చెప్పాడు. తర్వాతి ఏడాది దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో టెస్టు పగ్గాలను వదిలేశాడు. 'ఏడెనిమిదేళ్లు టీమిండియాకు, తొమ్మిదేళ్లు బెంగళూరుకు సారథ్యం వహించా. ప్రతిసారీ నాపైనే భారీ అంచనాలుండేవి. రాన్రాను పరిస్థితులు భారంగా మారాయి.. అదీ మోయలేనంతగా. అందుకే కెప్టెన్సీ వదిలి, ఆటను ఆస్వాదించాలన్న నిర్ణయానికి వచ్చా' అని విరాట్ తెలిపాడు.

ఆ ఓటమి...హ్యాంగోవర్: 2019 వరల్డ్‌కప్ సెమీస్‌లో ఓటమి తనకు 'భయంకరమైన హ్యాంగోవర్' లాంటిదన్నాడు. విరాట్ సారథ్యం వహించిన ఏకైక వన్డే వరల్డ్‌కప్‌లో లీగ్ దశలో అదరగొట్టిన భారత్.. సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. అయితే, ఆ ఓటమి బాధను దిగమింగుకోవడానికి చాలా కాలం పట్టిందన్నాడు.



భారత క్రికెట్.. ఎవరి సొత్తూ కాదు!

విమర్శకులకు గంభీర్ ఘాటు కౌంటర్

న్యూఢిల్లీ: 'భారత క్రికెట్ ఎవడబ్బ సొత్తూ కాద'ని టీమిండియా చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. తన కోచింగ్‌పై విమర్శలు చేస్తున్న మాజీ ఆటగాళ్లకు ఘాటుగా బదులిచ్చాడు. 'కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడే.. ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుసు. దేశం గర్వపడేలా చేయడమే నా పని. అంతేకానీ ఏసీ గదుల్లో కూర్చొని కామెంట్రీ పేరుతో ఏదో మాట్లాడే వారిని ప్రసన్నం చేసుకోవడం కాదు' అని కౌంటర్ ఇచ్చాడు. కొందరు మాజీలు భారత క్రికెట్‌ను సొంత ఆస్తిలా భావిస్తున్నారన్నాడు. 'కొందరు 25 ఏళ్లుగా కామెంట్రీ బాక్స్‌లో తిష్టవేసుకొని కూర్చొన్నారు. భారత క్రికెట్ ఏదో వారి కుటుంబ ఆస్తి అని అనుకొంటున్నారు. కానీ, ఇదంతా భారత ప్రజలది అనే వాస్తవాన్ని గుర్తించాలి' అని గౌతీ అన్నాడు. ఇక, ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ఎంపికలో తన జోక్యం ఏమీలేదన్నాడు. రోహిత్, కోహ్లీ మెరుగైన ప్రదర్శన చేస్తున్నంత కాలం జట్టులో కొనసాగే అర్హత ఉంటుందని చెప్పాడు. జట్టు ఎంపికలో తన పాత్ర లేదని.. అంతా సెలెక్టర్లదేనని గంభీర్ తెలిపాడు.

పాక్‌తో ఎక్కడా ఆడొద్దు

పహల్గాం దాడి నేపథ్యంలో.. సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలకనంత వరకు పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలని గంభీర్ డిమాండ్ చేశాడు. ఆసియాకప్, ఐసీసీ ఈవెంట్లలో కూడా పాక్‌తో ఆడకూడదనేది తన వ్యక్తిగత అభిప్రాయమన్నాడు.


హర్మన్

గెలుపే లక్ష్యంగా..

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ పోరు
మహిళల ముక్కోణపు సిరీస్

కొలంబో: వరుసగా ఎనిమిది వన్డేల్లో జైత్రయాత్ర సాగించిన భారత మహిళల జట్టుకు ఆదివారం శ్రీలంక చేతిలో ఝలక్ తగిలింది. ఆ మ్యాచ్‌లో విజయంతో మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లోనూ చోటు దక్కించుకోవాలనుకుంది. అయితే బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్ ద్వారా భారత్‌కు మరో అవకాశం. సఫారీలపై అన్ని విభాగాల్లో చెలరేగి హర్మన్ సేన తుది పోరుకు అర్హత సాధించాలనుకుంటోంది. అటు దక్షిణాఫ్రికా కూడా భారత్‌పై విజయంతో బోణీ చేయాలనుకుంటోంది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — కోల్‌కతా x చెన్నై — వేదిక: కోల్‌కతా — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	11	2	9	0	4	-1.117

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 2, రోహిత్ (సి) ప్రసిద్ధ్ (బి) అర్షద్ 7, విల్ జాక్స్ (సి) సుదర్శన్ (బి) రషీద్ 53, సూర్యకుమార్ (సి) షారుక్ (బి) సాయి కిషోర్ 35, తిలక్ (సి) గిల్ (బి) కొట్జీ 7, హార్దిక్ (సి) గిల్ (బి) సాయి కిషోర్ 1, నమన్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 7, కార్బిన్ బాష్ (రనౌట్) 27, దీపక్ చాహర్ (నాటౌట్) 8, కర్ణ్ శర్మ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం: 20 ఓవర్లలో 155/8; వికెట్ల పతనం:** 1-2, 2-26, 3-97, 4-103, 5-106, 6-113, 7-123, 8-150; **బౌలింగ్:** సిరాజ్ 3-0-29-1, అర్షద్ 3-0-18-1, ప్రసిద్ధ్ 4-0-37-1, సాయి కిషోర్ 4-0-34-2, రషీద్ 4-0-21-1, కొట్జీ 2-0-10-1.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 5, గిల్ (బి) బుమ్రా 43, బట్లర్ (సి) రికెల్టన్ (బి) అశ్వని 30, రూథర్‌ఫర్డ్ (ఎల్బీ) బౌల్ట్ 28, షారుక్ (బి) బుమ్రా 6, తెవాటియా (నాటౌట్) 11, రషీద్ (ఎల్బీ) అశ్వని 2, కొట్జీ (సి) నమన్ (బి) చాహర్ 12, అర్షద్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19 ఓవర్లలో 147/7; వికెట్ల పతనం:** 1-6, 2-78, 3-113, 4-115, 5-123, 6-126, 7-146; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-32-1, బౌల్ట్ 4-0-22-2, బుమ్రా 4-0-19-2, హార్దిక్ 1-0-18-0, కర్ణ్ శర్మ 2-0-13-0, అశ్వని కుమార్ 4-0-28-2, విల్ జాక్స్ 1-0-15-0.

గుజరాత్ గట్టెక్కింది

ఆఖరి బంతికి ముంబైపై విజయం

టాప్‌లోకి గిల్ సేన


గిల్ (43)

ముంబై: తాజా సీజన్‌లో హైలైట్ అనదగ్గ మ్యాచ్ అంటే ఇదేనేమో. గుజరాత్ టైటాన్స్ ముందు కేవలం 156 పరుగుల ఛేదనే అయినా ఎన్ని మలుపులో.. ముంబై ఇండియన్స్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గుచూపింది. దీనికితోడు రెండుసార్లు వరుణుడితో ఇబ్బంది. సవరించిన ఛేదన ప్రకారం ఆఖరి ఓవర్‌లో 15 పరుగులు కావాల్సిన వేళ మరింత హైడ్రామా నెలకొంది. అయినా ఎలాగోలా ఆఖరి బంతికి సింగిల్‌తో టైటాన్స్ ఊపిరిపీల్చుకుంది. దీంతో మంగళవారం జరిగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన గుజరాత్ నెగ్గింది. అలాగే 16 పాయింట్లతో టాప్‌లోకి చేరింది. అటు ముంబై వరుస ఆరు విజయాలకు బ్రేక్ పడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 53), సూర్యకుమార్ (24 బంతుల్లో 5 ఫోర్లతో 35), బాష్ (27) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సాయికిశోర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనను వర్షం కారణంగా గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147 పరుగులకు కుదించారు. అయితే, గుజరాత్ సరిగ్గా అన్నే ఓవర్లలో 147 రన్స్ చేసి గెలిచింది. గిల్ (43), బట్లర్ (30), రూథర్‌ఫోర్డ్ (28) పోరాడారు. బుమ్రా, బౌల్ట్, అశ్వనిలకు రెండేసి వికెట్లు దక్కాయి.

వణికించిన బౌలర్లు: స్వల్ప ఛేదనలో గుజరాత్ ఇన్నింగ్స్ సజావుగా ఏమీ సాగలేదు. పేసర్లు దీపక్, బౌల్ట్, బుమ్రా కట్టుదిట్టమైన బంతులకు పరుగులు రావడమే కష్టమైంది. గిల్, బట్లర్, రూథర్‌ఫోర్డ్ మినహా మరెవరూ దీటుగా నిలబడలేదు. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయి సుదర్శన్ (5)ను రెండో ఓవర్‌లోనే బౌల్ట్ అవుట్ చేశాడు. బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో ఆ తర్వాత గిల్, బట్లర్ నిదానం కనబర్చారు. దీంతో పవర్‌ప్లేలో 29/1 స్కోరు మాత్రమే సాధించింది. అయితే హార్దిక్ తన ఓవర్‌లో మూడు వైడ్లు, రెండు నోబ్స్, 4,6తో 18 పరుగులు సమర్పించుకున్నాడు. 12వ ఓవర్‌లో గిల్ సులువైన క్యాచ్‌ను తిలక్ వదిలేయగా.. తర్వాతి బంతికే బట్లర్‌ను అశ్వని అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆచితూచి సాగుతున్న ఇన్నింగ్స్‌కు రూథర్‌ఫోర్డ్ కదలిక తెచ్చాడు. 13వ ఓవర్‌లో అతడి 4,4,6తో 15 రన్స్ వచ్చాయి. 14వ ఓవర్ ముగిశాక వర్షం కారణంగా అర్ధగంట పాటు మ్యాచ్ ఆగింది. కానీ ఆ తర్వాత టైటాన్స్ ఒక్కసారిగా తడబడింది. వరుసగా నాలుగు ఓవర్లలో గిల్, రూథర్‌ఫోర్డ్, షారుక్ (6), రషీద్ (2)ల వికెట్లను కోల్పోయింది. ఇక 12 బంతుల్లో 24 రన్స్ కావాల్సిన వేళ మరోసారి వర్షంతో బ్రేక్ ఏర్పడింది. అర్ధరాత్రి 12.30కి మ్యాచ్ ఆరంభం కావడంతో లక్ష్యం 19 ఓవర్లలో 147కు మార్చారు. దీంతో గుజరాత్ ఆరు బంతుల్లో 15 పరుగులు చేయాల్సి ఉండగా..తెవాటియా ఫోర్, కొట్జీ సిక్సర్ బాదాడు. అయితే, ఐదో బంతికి కొట్జీని చాహర్ అవుట్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. కాగా, ఆఖరి బంతికి కావాల్సిన సింగిల్‌ను అర్షద్ పూర్తిచేయడంతో గుజరాత్ గట్టెక్కింది.

బ్యాటింగ్ వైఫల్యంతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైని టైటాన్స్ బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. వీరి ధాటికి ఓపెనింగ్ జోడీతో పాటు మిడిలార్డర్ కూడా వైఫల్యం చెందగా.. విల్ జాక్స్ సూర్యకుమార్ మాత్రం ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. చివర్లో బాష్ మెరుపు ఆటతో జట్టు గౌరవప్రదమైన స్కోరందుకుంది. వాస్తవానికి గుజరాత్ ఫీల్డింగ్‌లో కాస్త చురుకుగా ఉంటే ముంబై పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. పేసర్ సిరాజ్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రికెల్టన్ (2)ను అవుట్ చేశాడు. అదే ఓవర్‌లో వన్‌డౌన్ బ్యాటర్ జాక్స్ క్యాచ్‌ను సుదర్శన్ వదిలేశాడు. అటు ఫామ్ ప్రదర్శిస్తున్న రోహిత్ (7)ను నాలుగో ఓవర్‌లో అర్షద్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో జాక్స్-సూర్య జోడీ నిలబడింది. సిరాజ్ ఓవర్‌లో జాక్స్ 6,4 బాదగా, సూర్య ఐదో ఓవర్‌లో 3 ఫోర్లతో 16 రన్స్ అందించాడు. అదే ఓవర్‌లో అతడి క్యాచ్‌ను సాయికిశోర్ వదిలేశాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే జాక్స్ మరో 3 ఫోర్లు బాదగా, అతడి క్యాచ్‌ను కూడా సిరాజ్ అందుకోలేకపోయాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 56/2తో నిలిచింది. 11వ ఓవర్‌లో జాక్స్ సిక్సర్‌తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ వెంటనే షారుక్ క్యాచ్‌తో సూర్య వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్‌కు 71 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడినుంచి టైటాన్స్ బౌలర్లు పరుగులను కట్టడి చేయడంతో పాటు వరుస ఓవర్లలో జాక్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా (1), తిలక్ వర్మ (7), నమన్ ధిర్ (7)ల వికెట్లను తీసి పైచేయి ప్రదర్శించారు. 123/7 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన ముంబై చివర్లో బాష్ జోరుతో కోలుకుంది. ఆఖరి ఓవర్‌లో బాష్ రెండు సిక్సర్లు, దీపక్ (8 నాటౌట్) ఫోర్‌తో 18 రన్స్ రావడంతో ముంబై స్కోరు 150 దాటింది.

మానవాభివృద్ధి సూచీలో భారత్ పురోగతి

న్యూఢిల్లీ, మే 6: మానవ అభివృద్ధి సూచీ(హెచ్‌డీఐ) ర్యాంకుల్లో భారత్ పురోగతి సాధించింది. మంగళవారం ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) 2025 మానవ అభివృద్ధి నివేదిక (హెచ్‌డీఆర్)ను విడుదల చేసింది. ఆ నివేదికలో 193 దేశాలకు సంబంధించి వెల్లడించిన హెచ్‌డీఐ ర్యాంకుల్లో భారత్ 130వ స్థానం సాధించింది. 2022, 2023 మధ్య భారత్ తన స్థానాన్ని మెరుగుపరుచుకుని 133 నుంచి 130కి ఎగబాకింది. భారత్‌లో ఆరోగ్యం, విద్యలో అసమానతలు కొంత తొలగినా, ఆదాయం, లింగ వ్యత్యాసాలు ఇంకా కొనసాగుతున్నాయని నివేదిక స్పష్టం చేసింది. ప్రజల ఆయుర్దాయం 71.7 ఏళ్ల నుంచి 72 సంవత్సరాలకు చేరింది.

'మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్' పరీక్ష విజయవంతం

విశాఖపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో సబ్‌మెరైన్లు, యుద్ధ నౌకలను క్షణాల్లో పేల్చివేయడానికి ఉపయోగించే 'మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్' పరీక్షను భారత్ విజయవంతంగా పూర్తిచేసింది. డీఆర్‌డీవో సహకారంతో విశాఖపట్నంలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని రూపొందించారు. విశాఖ తీరంలోని బంగాళాఖాతంలో దీనికి నిర్వహించిన పరీక్ష విజయవంతమైనట్టు నేవీ వర్గాలు మంగళవారం తెలిపాయి. దీనికి ప్రయోగాలన్నీ పూర్తయ్యాయని, త్వరలోనే నౌకాదళానికి అందుతుందని నేవీ వర్గాలు వెల్లడించాయి.

బేబీ కిట్స్ పథకం పునరుద్ధరణ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): గతంలో అత్యంత ప్రజాదరణ పొందిన బేబీ కిట్‌ల పథకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంలో ఆరోగ్యశాఖ చేసిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బాలింతలకు బేబీ కిట్‌లను ప్రభుత్వాసుపత్రుల్లో అందించేవారు. 2014-19 మధ్య ఈ పథకాన్ని మంచి ఆదరణ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని రద్దు చేసింది. కాగా, ఈ పథకానికి అవసరమైన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకోవాలని ఆరోగ్య మంత్రి చేసిన ప్రతిపాదనను సీఎం ఆమోదించారు. నవజాత శిశువుల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఉద్దేశించిన 11వస్తువులతో కూడిన ప్రతి బేబీ కిట్‌కు రూ.1,410లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పథకం కింద దోమల తెరతో కూడిన బేబీ బెడ్, వాటర్ ప్రూఫ్ కాట్ షీట్, బేబీ డ్రస్, వాషబుల్ నేప్కిన్స్, టవల్, బేబీ పౌడర్, బేబీ షాంపూ, బేబీ ఆయిల్, బేబీ సోప్, సోప్ బాక్స్, బేబీ రాటిల్ టాయ్ అందిస్తారు.

టెలికమ్యూనికేషన్స్‌లో దూసుకెళ్తున్న భారత్

» టెలికాం-2025 సదస్సులో కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడి

న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రతిభ, టెక్నాలజీతో టెలికమ్యూనికేషన్స్‌లో ప్రపంచస్థాయిలో భారత్ దూసుకెళ్తోందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధిశాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఢిల్లీలోని తాజ్‌ప్యాలెస్‌లో మంగళవారం జరిగిన 'భారత్ టెలికాం-2025' సదస్సులో ఆయన మాట్లాడారు. 850 మిలియన్లకుపైగా ఇంటర్నెట్ వినియోగదారులతో భారతదేశం గణనీయమైన మైలురాళ్లను సాధించిందన్నారు. ప్రపంచంలోనే అత్యంత చౌక రేట్లతో డేటాను భారత్ అందిస్తోందని తెలిపారు. టెలికాం పరికరాల ఎగుమతి ఇటీవలి సంవత్సరాలలో నాలుగు రెట్లు పెరిగి మొత్తం విలువ రూ.1.49 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, సొల్యూషన్స్ ఆధారంగా 5జీ ఎకోసిస్టమ్‌ను రూపొందించినట్లు తెలిపారు.

100కు పైగా డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడులు

మాస్కో/కీవ్, మే 6: రష్యా విక్టరీ డే వేడుకల ముంగిట రష్యాకు ఉక్రెయిన్ పెద్ద షాకిచ్చింది. సోమవారం రాత్రి నుంచి డజనుకు పైగా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వందకు పైగా డ్రోన్లను రష్యాపై ప్రయోగించింది. వాటిని తాము సమర్థంగా కూల్చేశామని, ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని రష్యా ప్రకటించింది. అయితే.. మాస్కోలో ఉన్న 4విమానాశ్రయాలను కొన్ని గంటల పాటు తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చినట్లు తెలిపింది.

సుప్రీం జడ్జిల ఆస్తుల వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)



కోయంబత్తూర్‌లలో ఉన్నట్లు వెల్లడైంది. ఆదాయ పన్ను లెక్కల్లో ఆయన రూ.91.47 కోట్ల ఆస్తిని చూపారు. దిగిపోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆస్తుల విలువ కాకుండా వివరాలను ఇచ్చారు. అందులో 55.75 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, దక్షిణ ఢిల్లీలో మూడు బెడ్రూమ్‌ల ఇల్లు, కామన్‌వెల్త్ గేమ్స్ విలేజ్‌లో నాలుగు బెడ్రూముల ఇల్లు ఉన్నాయి. కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు బ్యాంకు ఖాతాల్లో 19.63 లక్షలు ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతిలో వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబైలోని బాంద్రాలో, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, అమరావతి, నాగపూర్‌లలో వ్యవసాయ భూమి ఉన్నాయి. ఏప్రిల్ 1న జరిగిన న్యాయమూర్తుల సమావేశంలో న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వెబ్‌సైట్లో పెట్టిన సమాచారం ప్రకారం చూస్తే వారంలో దిగిపోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నాకు గురుగ్రామ్‌లో 4 బెడ్రూముల ఇంట్లో 56 శాతం వాటా, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్‌హౌసీలో ఇంటి వాటా ఉన్నాయి. పీపీఎఫ్‌లో కోటి, జీపీఎఫ్‌లో కోటీ 77 లక్షలు, 25 తులాల బంగారం, రెండు కిలోల వెండి, 2015లో కొన్న మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి. జస్టిస్ గవాయ్‌కు రూ.5 లక్షల బంగారం, ఆయన భార్యకు 29 లక్షల బంగారం ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ప్రధాన న్యాయమూర్తి కాబోతున్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగావ్‌లో 300 గజాల ప్లాట్ ఉన్నాయి. రూ.4.11 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. బిజీ లాయర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జిగా ఎదిగిన జస్టిస్ విశ్వనాథన్ అత్యధిక ఆస్తులను చూపించారు.

న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేయడమే కాకుండా గత రెండున్నరేళ్లుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకం జరిగిన విధానాన్ని కూడా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టారు. గత రెండున్నరేళ్లలో నియామకానికి పరిశీలించిన పేర్లలో కేవలం 6 శాతం మంది మాత్రమే న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. మొత్తం 221 మంది పేర్లను జడ్జిలుగా సిఫార్సు చేస్తే అందులో 14 మంది న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారని తేలింది. వారిలో ఒకరి (పంజాబ్ హైకోర్టుకు చెందిన న్యాయవాది రోహిత్ కుమార్) పేరును మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆమోదించాల్సి ఉంది. రెండున్నరేళ్లలో 221 పేర్లను సుప్రీంకోర్టు సిఫార్సు చేయగా, 29 పేర్లు ఇంకా కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉండగా హైకోర్టు కొలీజియాల నుంచి 303 ప్రతిపాదనలు వచ్చాయి. అందులో 170 మంది(56 శాతం) పేర్లను జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. అందులో ఏడు శాతం మంది(12) న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రధాన న్యాయమూర్తి అయ్యాక రాష్ట్రాల కొలీజియాల నుంచి 103 ప్రతిపాదనలు రాగా వాటిలో 51 మందిని ఆయన ఆమోదించారు. అందులో ఇద్దరు న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జిగా ఎంపికైన జస్టిస్ బిబూ దత్త గురు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు బావ/బావమరిది. జస్టిస్ దత్తగురు ఎంపిక అయినపుడు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కొలీజియంలో లేరు.

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు.. సీజేఐకి త్రిసభ్య కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, మే 6: జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై దర్యాప్తు జరిపిన త్రిసభ్య కమిటీ.. తన నివేదికను సీజేఐకి సమర్పించింది. మార్చి 14న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి (ఆ సమయంలో) జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరగ్గా.. మంటలు ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సగం కాలిన నోట్ల కట్టలు దొరికాయన్న వార్తలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా మార్చి 22న ముగ్గురు న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్లు రైలు కంపార్టుమెంట్ లాంటివి

» ముందు ఎక్కినవారు ఇతరులను అనుమతించరు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 6: కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు కంపార్ట్‌మెంట్ లాంటివని, ముందుగా కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కినవారు ఇతరులను లోపలకు రానీయరంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహారాష్ట్రలో స్థానిక ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని స్థానిక సంస్థలకు చివరిసారిగా 2016-17లో ఎన్నికలు నిర్వహించారు. ఓబీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో జరుగుతున్న న్యాయపోరాటం కారణంగా అక్కడ ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా లెక్కల సమయంలో సేకరించిన ఓబీసీల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని పిటిషన్ దాఖలైంది. అయితే, రిజర్వేషన్ల అమలుకు ముందుగా ఓబీసీల్లోని రాజకీయంగా, సామాజికంగా వెనుకబడినవారిని గుర్తించడం అవసరమని ప్రభుత్వం తరఫు న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తెలిపారు. ఈ సమయంలో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ... రైలు కంపార్ట్‌మెంట్‌ను ఉదహరిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని కుటుంబాలు, కొన్ని బృందాలే రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. "సమ్మిళిత సూత్రంపై ఆధారపడి రిజర్వేషన్ల అమలు ఉంటుంది. వాటి పరిధిలోకి రాగల మరిన్ని సమూహాలను గుర్తించడం ప్రభుత్వాల విధి" అని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు

1.50 లక్షల వరకూ ఉచిత వైద్యం

న్యూఢిల్లీ, మే 6: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత ఉచిత చికిత్సను అందించడానికి వీలుకల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేసింది. సోమవారం నుంచే ఇది అమలులోకి వచ్చిందని పేర్కొంది. ప్రమాదం జరిగిన ఏడు రోజుల్లోగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. నిర్దేశిత ప్రమాణాలు కలిగి, నమోదైన ఏ ఆసుపత్రిలోనైనా చికిత్స పొందవచ్చు. పోలీసులు, ఆసుపత్రులు, స్టేట్ హెల్త్ ఏజెన్సీల సహకారంతో 'రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం 2025'ను జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్ఏ) అమలు చేస్తుంది. రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. పథకం అమలు, ఆసుపత్రులను పథకంలో చేర్చడం, బాధితులకు చికిత్స, ఆసుపత్రులకు చెల్లింపులు తదితర అన్ని విషయాలను ఎన్‌హెచ్ఏతో సమన్వయం చేసుకొనే బాధ్యత ఈ నోడల్ ఏజెన్సీదే. పథకం అమలు తీరుతెన్నులను పరిశీలించడానికి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది.

భారత్, యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

» ఇరు దేశాల మధ్య 'సుంకాల' తగ్గింపు



న్యూఢిల్లీ, మే 6: భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని గణనీయంగా పెంచడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం తోడ్పడుతుంది. యూకే ప్రధాన మంత్రి కెయిర్ స్టార్మర్‌తో చర్చల అనంతరం ప్రధాని మోదీ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. "యూకే ప్రధానితో మాట్లాడాను. భారత్, యూకే మధ్య ఇరుదేశాలకు ఎంతో ప్రయోజనం కలిగించే ప్రతిష్ఠాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇది చరిత్రాత్మకం. ఇరుదేశాల వాణిజ్యం, పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సృజనాత్మక ఆవిష్కరణలకు ఈ ఒప్పందం ఊతమిస్తుంది" అని మోదీ వెల్లడించారు. అనంతరం ఈ అంశంపై ప్రధాని కార్యాలయం, యూకే ప్రభుత్వం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. భారత్‌తో ఒప్పందం ఇరుదేశాల సంబంధాల్లో ఓ మైలురాయి అని స్టార్మర్ పేర్కొన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రకారం.. భారత్, యూకేల మధ్య దిగుమతి సుంకాలు భారీగా తగ్గనున్నాయి. పదేళ్లలో సుంకాలు సున్నా స్థాయికి చేరుతాయని యూకే ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. యూకే నుంచి మద్యం దిగుమతులపై 150శాతం నుంచి 40 శాతానికి, వాహనాలపై 100శాతం నుంచి 10 శాతానికి సుంకాలు తగ్గుతాయని పేర్కొంది. ఇరుదేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం రూ.4.80 లక్షలకోట్లుకాగా.. పదేళ్లలో మరో రూ.2.90 లక్షల కోట్ల మేర పెరుగుతుందని అంచనా వేసింది. ఇక, యూకేలో ఉద్యోగులు జాతీయ ఆరోగ్య బీమా కోసం ఏటా తప్పనిసరిగా 500 పౌండ్లు(సుమారు రూ.56 వేలు) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, యూకేలో పనిచేసే భారతీయ ఉద్యోగులు..ఆ బీమా సొమ్ము కట్టాల్సిన అవసరం లేకుండా తాజాగా ఒప్పందం కుదిరింది.

పవన్ కల్యాణ్‌కు దీర్ఘదృష్టి లేదు

ప్రజా సమస్యలపై అవగాహనాలేదు: ప్రకాశ్‌రాజ్

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్‌కు ప్రజా సమస్యలపై ఏమాత్రం అవగాహన లేదని నటుడు ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. ఆయన మంగళవారం చెన్నైలో సీఎం ఎంకే స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధితో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'మెగాస్టార్ చిరంజీవి కుటుంబం నుంచి పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన అభిమానులంతా పార్టీ కార్యకర్తలుగా మారారు. విజయ్ కూడా అగ్రహీరో. ప్రముఖ దర్శకుడు ఎస్‌ఏ చంద్రశేఖర్ కుమారుడు. విజయ్‌కు స్టార్ ఇమేజ్ రాకముందే ఆయన ప్రతి ఒక్కరికీ తెలుసు. పవన్ కొన్నేళ్ల క్రితమే రాజకీయాల్లోకి వచ్చారు. కానీ, విజయ్ మాత్రం ఇప్పుడే వచ్చారు. పవన్ పదేళ్ల రాజకీయ ప్రయాణంలో ఆయనకు దీర్ఘదృష్టి కానీ, ప్రజా సమస్యలపై అవగాహన కానీ ఉన్నట్లు నేను గమనించలేదు. పవన్ కల్యాణ్, విజయ్ తమ స్టార్ ఇమేజ్‌ను పక్కనబెట్టి ప్రజల్లోకి వచ్చి గెలుపు స్థానాన్ని కోరుకుంటున్నారు. విజయ్‌కు ఉన్న ఇమేజ్ కారణంగా తమిళనాట కొన్ని స్థానాలు దక్కవచ్చు. ఆ తర్వాత ఆయన తన సత్తాను నిరూపించుకోవాలి' అని అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'వీరమల్లు' వస్తున్నాడు



పవన్ కల్యాణ్ హీరోగా జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'హరిహర వీరమల్లు' తొలి భాగం షూటింగ్ మంగళవారంతో పూర్తయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తూ నిర్మాత ఏ.ఎం.రత్నం ఆనందం వ్యక్తం చేశారు. 'చిత్రీకరణ పూర్తయింది. ఇక థియేటర్లలో విడుదల కావడమే తరువాయి. బ్లాక్‌బస్టర్ సాంగ్స్, అదిరిపోయే ట్రైలర్ త్వరలో విడుదలవుతాయి' అని ఏ.ఎం.రత్నం తెలిపారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ చారిత్రక యోధుడిగా నటిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ డియోల్, అనుపమఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించారు. అయితే కొంత షూటింగ్ మిగిలి ఉండడంతో వాయిదా పడింది. ఇప్పుడు మొత్తం చిత్రీకరణ పూర్తయినందున విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మెగా ఫ్యామిలీలో మరో ఆనందం



వరుణ్ తేజ్- లావణ్య త్రిపాఠి దంపతులు శుభవార్త చెప్పారు. తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఇద్దరు చేతులు పట్టుకొని చిన్నపిల్లల షూతో ఉన్న ఫొటోను షేర్ చేసారు. 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్' అని వరుణ్ తేజ్ క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది. పలువురు సినీ ప్రముఖులు వరుణ్ తేజ్- లావణ్య త్రిపాఠి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సమంత, రకుల్ ప్రీత్ సింగ్, అల్లు స్నేహ తదితరులు కంగ్రాట్స్ అంటూ కామెంట్స్ పెట్టారు. కాగా, 2017లో విడుదలైన 'మిస్టర్' సినిమాలో వరుణ్ - లావణ్య తొలిసారి కలసి నటించారు.

నేటి రాజకీయాల నేపథ్యంలో..



ఇంద్రజ, అజయ్ ప్రధాన పాత్రల్లో గడ్డం రమణారెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సీఎం పెళ్లాం'. బొల్ల రామకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో మాట్లాడింది. చిత్ర దర్శకుడు రమణారెడ్డి మాట్లాడుతూ 'ఎమ్మెల్యే బిజీగా ఉండి బయట తిరుగుతున్న సమయంలో.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వచ్చిన ప్రజలను ఆ ఎమ్మెల్యే పెళ్లాం కలసి మాట్లాడితే వ్యవస్థలో చాలా మార్పులు వస్తాయని నమ్మాను. అదే ఈ సినిమాలో చూపించాను. రాజకీయ నాయకులు బూతులు మాట్లాడొద్దన్న పాయింట్‌నూ చూపించాను' అని చెప్పారు. అజయ్ మాట్లాడుతూ 'మహిళా సాధికారత గురించి వివరించిన ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర నిర్మాత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు బయటకు వచ్చి ప్రజలకు సేవ చేస్తే ఎలా ఉంటుంది? రాష్ట్రం ఏవిధంగా బాగుపడుతుంది అనే కోణంలో చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాం' అని తెలిపారు.

క్లాసిక్ లుక్‌లో...



'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి.. తన అందం, అభినయంతో అందర్నీ ఆకట్టుకున్నారు హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో 'కాంత', విజయ్ దేవరకొండతో 'కింగడమ్', రామ్ పోతినేనితో 'రాపో 22' (వర్కింగ్ టైటిల్) వంటి వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారీ బ్యూటీ. మంగళవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా 'కాంత' సినిమా నుంచి భాగ్యశ్రీ లుక్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. ఓ వింటేజ్ కారులో కూర్చుని మెరిసిపోతున్న ఆమె క్లాసిక్ లుక్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పోట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు.

నా అహం కంటే మీపై ప్రేమే ఎక్కువ

సోనూ నిగమ్



ఇటీవల జరిగిన ఓ కాన్సర్ట్‌లో గాయకుడు సోనూ నిగమ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడం, దాని వల్ల ఏర్పడిన పరిణామాలు అందరికీ తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై సోనూ నిగమ్ స్పందించారు. ఆ కాన్సర్ట్‌లో తను చేసిన వాఖ్యలపై వివరణ ఇచ్చి, క్షమాపణలు తెలిపారు. 'సారీ కర్ణాటక. నా అహం కంటే మీపై నాకున్న ప్రేమే ఎక్కువ' అని సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. కాగా, ఆ కాన్సర్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలపై 'కర్ణాటక రక్షణ వేదిక' బెంగుళూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు ధర్మరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల్లోపు విచారణలో పాల్గొనాలని పోలీసులు ఆయనకు నోటీసులిచ్చారు. అలాగే, ఈ వ్యాఖ్యలపై ఆగ్రహించిన 'కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్'.. ఓ సమావేశం ఏర్పాటు చేసి ఆయనను కన్నడ సినిమాల నుంచి బ్యాన్ చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

తెరచాప సందేశం



నూతన నటీనటులతో తెరకెక్కుతోన్న సందేశాత్మక చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాశ్ దుర్గం నిర్మిస్తున్నారు. నవీన్ రాజు, పూజ సుహాసిని జంటగా నటిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ప్రేక్షకులను మెప్పించేలా 'తెరచాప' చిత్రాన్ని తీశాను. కథానుసారం తమిళనాడు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి' అని చెప్పారు. 'ఈ సినిమా నాకు నిర్మాతగా తొలి చిత్రమే అయినా కథపైన గట్టి నమ్మకంతో నిర్మించాను. ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి' అని కైలాశ్ దుర్గం తెలిపారు.

కాలం నాలో చాలా మార్పులు తెచ్చింది

సమంత



'ఒక నటిగా, మనిషిగా కాలం నాలో చాలా మార్పులు తెచ్చింది. ఇటీవల నా జీవితంలో జరిగిన విషయాలను బట్టి ఒక్కటి మాత్రం నాకు బాగా అర్థమైంది... వ్యక్తిగత జీవితాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగంగా చర్చనీయాంశం చేయకూడదని. ఇకపై నా పర్సనల్ లైఫ్ గురించి బయటెక్కడా స్పందించను' అని సమంత అన్నారు. స్వీయ నిర్మాణంలో ఆమె అతిథి పాత్రను పోషించిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. ఈ నెల 9న విడుదలవుతున్న సందర్భంగా సమంత సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

● ఒక సినిమా విడుదలవరకూ వచ్చిందంటే దాని వెనుక ఎంత కష్టం ఉంటుందో తొలిసారి తెలిసొచ్చింది. నా చిత్రబృందంపైన మరింత గౌరవం పెరిగింది. వాళ్లంతా వారం రోజులుగా నిద్రపోకుండా పనిచేస్తున్నారు. ఇదంతా చూశాకే సినిమా తీయడం ఎంత కష్టమో నాకు అర్థమైంది. వాళ్లను చూస్తుంటే నా కెరీర్ తొలినాళ్లు గుర్తుకు వచ్చాయి. 'ఏం మాయ చేశావే' సినిమా వచ్చి పదిహేనేళ్లవుతోంది. ఇన్నేళ్లలో నా జీవితంలో చాలా జరిగాయి. ఈ సినిమా మరోసారి నా మూలాలను నాకు గుర్తు చేసింది.

మంచి సినిమా ఇవ్వాలని ప్రయత్నించాం

● నటిగా నాకు మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. అభిమాన గణం ఏర్పడింది. నా జీవితాంతం నటిగానే కొనసాగుతాను అనుకున్నాను. అయితే అనారోగ్యంతో సినిమాలకు దూరమవ్వాల్సి వచ్చింది. నేను నటిగా మళ్లీ సెట్‌లోకి అడుగుపెడతానో లేదో కూడా అప్పుడు తెలియదు. బాగా దిగులుపడ్డాను. అప్పుడు నాలో ఒక ఆశారేఖను వెతుక్కోవాల్సి వచ్చింది. నా అంతరాత్మ చెప్పిన మాట విన్నాను. చేయాల్సింది చాలా ఉంది అనిపించింది. అలా నిర్మాతగా మారాను. 'బ్రౌన్ గర్ల్ ఇన్ ద రెయిన్' అని నా చిన్నప్పుడు ఒక కవిత ఉండేది. దాని స్ఫూర్తితో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అని మా బేనర్‌కు పేరు పెట్టాం. నేను ఇండస్ట్రీలోకి వచ్చి 15 ఏళ్లు అయింది. చాలా తెలుసుకున్నాను, నేర్చుకున్నాను. ఆ అనుభవంతో ఎనిమిది నెలల్లో ఒక సినిమాను షూట్ చేసి విడుదలకు సిద్ధం చేశాం. షూటింగ్ పూర్తి చేసేంతవరకూ బయటకు చెప్పలేదు. ఎక్కువగా మాట్లాడకుండా పనిచేసి, మంచి సినిమా ఇద్దామని ప్రయత్నించాం. ఇదొక సింపుల్ హారర్ కామెడీ అని చెప్పవచ్చు.

సినిమా చూస్తే తెలుస్తుంది

● దర్శకుడు గౌతమ్‌మీనన్ గారు 'ఏం మాయ చేశావే' చిత్రంతో నాకు నటిగా అవకాశం ఇచ్చారు. ఆయన అడిగితే అప్పట్లో పెద్ద హీరోయిన్లు ఆ సినిమాలో చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ కొత్తవాళ్లకు అవకాశమిచ్చి ఆయన రిస్క్ చేశారు. కొత్త కథలు చెప్పడంతో పాటు కొత్త వాళ్లకు అవకాశమివ్వడం నా బాధ్యత అనిపించింది. నా సొంత చిత్రాల్లో నటించకూడదు అనే నియమం పెట్టుకున్నాను. సినిమాలో నేనే లీడ్‌రోల్ చేయవచ్చు. కానీ అందరికీ అవకాశాలు రావాలి. అందుకే నా తొలి సినిమాలో నేను నటించకూడదు అనుకున్నాను. కానీ ఇందులో నేను అతిథి పాత్ర చేయాల్సి వచ్చింది. తొలుత ఎవ్వరినైనా అడుగుదామనుకున్నాను. తొలి సినిమాకే సాయం చేయమని అడగడానికి నాకు మనసురాలేదు. నేను చేస్తానని కూడా ఎవ్వరూ ఊహించలేదు. పాత్ర చిన్నదే అయినా చాలా ప్రభావం ఉంటుంది.

● నిర్మాతగా తొలి చిత్రమే అయినా నాకు చాలా నేర్పింది. నేను గతంలో నిర్మాతల పట్ల మరింత బాధ్యతతో ఉండి ఉండాల్సిందేమోనని అనిపించింది. వారిపై గౌరవం పెరిగింది. సమయం వృథా కావడం వల్ల నిర్మాతకు చాలా నష్టం జరుగుతుంది. ఈ సినిమాకు ఎక్కువ తక్కువ అని కాకుండా సినిమా డిమాండ్ చేసినంతమేర ఖర్చు చేశాం. ముందనుకున్న బడ్జెట్ కన్నా కొంచెం ఎక్కువ అయింది తప్ప పూర్తిగా అదుపు తప్పలేదు.

హీరోయిన్‌గా చేసినప్పుడూ ఫలితంపై టెన్షన్ ఉండేది కానీ నిర్మాతగా అనే సరికి ఇంకొంచెం ఎక్కువగా ఉంది. ప్రివ్యూలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. కథ బాగా వచ్చింది కాబట్టి మంచి సినిమాగా నిలుస్తుందనే నమ్మకం ఉంది.

నా దృష్టిలో హీరో అయినా హీరోయిన్ అయినా ఒక్కటే. పారితోషికాల్లో లింగవివక్ష చూపడం మొదట్నుంచి నాకు ఇష్టం లేదు. ఒకే స్థాయి అనుభవం, నైపుణ్యాలు ఉన్న వ్యక్తులకు ఒకే స్థాయి పారితోషికం అనేదాన్ని నేను సమర్థిస్తాను. అది నిజమైతే చూడాలని ఆశపడ్డా. ఈ సినిమాతో దాన్ని నిజం చేశాను. మా బృందంలోని మహిళా టెక్నీషియన్లకు కూడా సమానంగా పారితోషికం ఇచ్చాను. ఈ సినిమాకు అలా కుదిరింది. అయితే అన్ని సినిమాలకు అలా కుదురుతుందా అంటే కష్టమే.

నిర్మాతగా తొలి సినిమాకే సమంత శుభం కార్డు వేశారంటూ చాలా మీమ్స్ వస్తున్నాయి. ఈ కథ కూడా సుదీర్ఘంగా సాగే సీరియల్ నేపథ్యంలో ఉండడంతో శుభం కార్డుకు ప్రాధాన్యం ఉంది. మామూలుగా 'శుభం' అనే టైటిల్ కార్డు సినిమాకు ముగింపులో వేస్తారు. కానీ దాన్ని ఈ సినిమాకే టైటిల్‌గా ఎందుకు పెట్టాం అనేది సినిమా చూస్తే ప్రేక్షకులకు తెలుస్తుంది.

నటిగా నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నాను

కేతిక శర్మ



'హీరోయిన్‌గా నా కెరీర్ గురించి పూర్తి సంతృప్తితో ఉన్నాను. జయాపజయాలు మన చేతిలో ఉండవు. ఫలితం గురించి ఆలోచించకుండా పని చేయడంపైనే నా దృష్టంతా. నటిగా నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నాను' అని హీరోయిన్ కేతిక శర్మ అన్నారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన 'సింగిల్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా కేతిక శర్మ మీడియాతో మాట్లాడారు. 'అల్లు అరవింద్ సమర్పణలో ఓ సినిమా వస్తోందంటే అందులో విషయం ఉంటుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో సినిమా చేయాలనేది ఎప్పటినుంచో నాకున్న కోరిక. అది 'సింగిల్' సినిమాతో నెరవేరింది. ప్రేక్షకులకు మంచి వినోదం అందిస్తుంది. ఈ సినిమాలో పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. స్వతంత్ర భావాలున్న యువతి. ఈ తరం అమ్మాయిల ఆలోచనలకు దగ్గరగా ఉంటుంది. కథను మలుపు తిప్పే పాత్ర నాది' అని తెలిపారు.

నదుల అనుసంధానం

▸ మోదీ, చంద్రబాబుల లక్ష్యం: నిమ్మల



పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన విదేశీ బృందాన్ని సత్కరించిన మంత్రి నిమ్మల

పోలవరం, మే 6(ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలసి పోలవరం ప్రాజెక్టును మంత్రి పరిశీలించారు. ఎగువ కాఫర్ డ్యాం, బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్ నిర్మాణంలో జరుగుతున్న గ్రాబ్ కట్టింగ్ పనులను పరిశీలించారు. ప్రాజెక్టు కార్యాలయంలో విదేశీ నిపుణుల బృందంతో సమావేశమయ్యారు. బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్ నిర్మాణాలు త్వరితగతిని పూర్తయ్యేలా, గ్యాప్-1, 2, డయాఫ్రం వాల్ డిజైన్లకు త్వరితగతిన అనుమతులు వచ్చేలా కేంద్రానికి నివేదిక ఇవ్వాలని నిపుణుల బృందాన్ని కోరారు. సమావేశంలో విదేశీ నిపుణులు డేవిడ్ బి.పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో, సీన్ హెంచ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ, సీఈ కె.నరసింహమూర్తి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పీపీఏ కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జల సంఘం అధికారులు సరబ్జిత్ సింగ్ భక్షి, రాకేశ్, తేజ, అశ్వనీ కుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో 'నేతన్న నేస్తం'లో సగభాగం ఆ పార్టీ గూండాలకే!

▸ కూటమి ప్రభుత్వం రాకతో చేనేతలకు స్వర్ణయుగం: మంత్రి సవిత

▸ ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన


మెగా టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్, ఫరూక్, ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, పార్థసారథి

ఎమ్మిగనూరు, మే 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేతల కోసం ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకంలో 50 శాతం మాత్రమే చేనేతలకు ఇవ్వగా మిగిలిన సగాన్ని అనర్హులు, వైసీపీ గూండాలకే ఆ ప్రభుత్వం ఇచ్చిందని' మంత్రి సవిత ఆరోపించారు. మంగళవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద 77 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్కుకు రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ, 'జగన్ తన ఐదేళ్ల కాలంలో చేనేతలకు ఏం చేశాడు? కేవలం 83వేల మందికి నేతన్న నేస్తం ఇస్తున్నట్లు చెప్పి అందులో సగం వైసీపీ గూండాలకు ఇచ్చారు. చేనేతలకు 365 రోజులు ఉపాధి కల్పించాలని మంత్రి లోకేశ్ చెప్పారు. అందులో భాగంగానే మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నాం. మన రాష్ట్రానికి రూ.348 కోట్లు కేటాయించి, చేనేతల అభివృద్ధికి ప్రధాని మోదీ బాటలు వేశారు' అని అన్నారు. జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఏపీఐఐసీ సీఈ ప్రసాద్, ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సుజనాకు విజయవంతంగా శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, విజయవాడ(వన్‌టౌన్), మే 6(ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే సుజనా చౌదరి కుడి భుజానికి శస్త్రచికిత్స చేశాం. సుమారు 4గంటలపాటు జరిగిన సర్జరీ విజయవంతమయింది' అని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ చీఫ్ సర్జన్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సుజనా ఆరోగ్య పరిస్థితిని మీడియాకు వివరించారు. 'నెల నుంచి రెండు నెలల పాటు ఫిజియోథెరపీ అవసరం. లండన్ పర్యటనలో ఉన్న ఆయన ఓ సూపర్ మార్కెట్‌లో ప్రమాదవశాత్తూ కిందపడిపోయారు. కుడి భుజం వద్ద ఎముక విరగడంతో మంగళవారం ఉదయం బేగంపేటలోని మా ఆసుపత్రికి తెచ్చారు. భుజంలో ఎముక ఐదారు ముక్కలైనట్లు గుర్తించాం' అని గురువారెడ్డి తెలిపారు.

ప్రధాని తొలిసారి మట్టి.. రెండోసారి చాక్లెట్ ఇచ్చారు

▸ దెబ్బతిన్న పంటలను ఇప్పటికీ పరిశీలించని అధికారులు: రామకృష్ణ

తాడేపల్లి టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు రాజధాని అమరావతిలో ఈ నెల 2న పెద్ద ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రధాన మంత్రిని పిలిచారు. తొలిసారి మోదీ వచ్చినప్పుడు ముంత మట్టి, చెంబు నీరు తీసుకొచ్చారు. ఈసారి చాక్లెట్ ఏదో తీసుకొచ్చారు. నోరు తీయగా ఉంటుందని చెప్పి వెళ్లారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి తాడేపల్లిలో దెబ్బ తిన్న పంటలను ఆయన పరిశీలించారు. సీఎం నివాసం ఉంటున్న తాడేపల్లిలోనే ఇంతవరకు దెబ్బ తిన్న పంటలను పరిశీలించలేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

రాష్ట్ర పండుగగా సత్యసాయి శత జయంతి

పుట్టపర్తి టౌన్, అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అసెంబ్లీలో కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది.

తొమ్మిది మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొమ్మిదిమంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. మంగళవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీగా ఉన్న శీనా నాయక్‌ను విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. పులివెందుల ఆర్డీవోగా జి.చిన్నయ్యను, వెయిటింగ్‌లో ఉన్న కేఎల్ శివజ్యోతిని మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న హనుమంతరావు ఆనంద్‌ను అనంతపురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(పీఏబీఆర్‌గా) నియమించారు. కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మిని విశాఖపట్నం మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీగా, తూర్పుగోదావరి జిల్లాలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న జి.మమ్మిని కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా, అనంతపురం జిల్లా (అహుడా) అహుడా సెక్రటరీ గౌరీశంకర్రావును తిరుపతి జిల్లా సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా, పల్నాడు జిల్లా ఎస్‌డీసీ కేఆర్ఆర్‌సీ కుమిదిని సింగ్‌ను కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా, మచిలీపట్నం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఎస్‌డీసీ పద్మావతిని గుంటూరు జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా బదిలీ చేశారు.

మ్యాన్ పవర్ ఏజెన్సీల తీరు మారాలి: వాసంశెట్టి

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): మ్యాన్ పవర్ ఏజెన్సీల కింద పని చేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు కూడా చెల్లించకుండా ఇబ్బందుల పెడుతున్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు మ్యాన్ పవర్ కింద పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్‌లు కూడా కట్టడం లేదు. మ్యాన్ పవర్ ఏజెన్సీల అవకతవకలను ఇక ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు' అని మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో కార్మిక, ఫ్యాక్టరీల శాఖల అధికారులతో సమావేశమైన మంత్రి మ్యాన్‌పవర్ ఏజెన్సీల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా లేబర్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌తో పాటు ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు.

ప్రభుత్వ వైద్యుని ప్రైవేటు చికిత్స

▸ రోగి మృతి... క్రమశిక్షణా చర్యలకు మంత్రి సత్యకుమార్ ఆదేశం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించాల్సిన సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సర్జరీ చేసి రోగి మృతికి కారణమైన ఇద్దరు ప్రభుత్వ వైద్యులపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. 2022లో జరిగిన ఘటనను తీవ్రంగా పరిగణించిన మంత్రి.. ఇద్దరు వైద్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.చక్రధర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రాకేశ్ ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేయాల్సిన సమయంలో ప్రైవేటు ఆస్పత్రిలో ఒక రోగికి శస్త్ర చికిత్స చేశారు. కొన్నిరోజుల తర్వాత రోగి మరణించాడు. దీనిపై మృతుడి బంధువులు ఫిర్యాదు చేశారు. ఆ ఆరోపణలపై వైద్యులు లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. 'మేం మానవతా దృక్పథంతో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేశాం. ఇందులో మా వైపు నుంచి ఎటువంటి తప్పు లేదు. మా చర్యను క్షమించమని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని వివరణ ఇచ్చారు. మంత్రి వారి వివరణను తిరస్కరించారు.

యాక్సిస్‌పై యాగీ

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించి కొనుగోలుకు సిద్ధమైంది. దీంతో ఒక్కొక్క యూనిట్ విద్యుత్‌పై రూ.0.52 పైసలు చొప్పున తగ్గనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా వినియోగదారులకు ఇది మేలు చేయనుంది. అయినప్పటికీ ఈ నిజాన్ని దాచిపెట్టిన జగన్ రోత పత్రిక ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ పబ్బంగడుపుకొనే ప్రయత్నం చేస్తోంది.

అసలేం జరిగింది?

2022లో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యాక్సిస్ సంస్థ నుంచి యూనిట్‌కు రూ.5.12 చొప్పున కరెంటును కొనుగోలు చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కానీ, సంస్థ యూనిట్ సిద్ధంగా లేకపోవడంతో విద్యుత్‌ను తీసుకోలేదు. అనంతరం.. యాక్సిస్ సంస్థ బిల్డింగ్, బ్యాలెన్సింగ్, బ్యాంకింగ్(బీబీబీ) విధానంలో 400 మెగావాటతో కూడిన సౌర విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్పీడీసీఎల్ యాక్సిస్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం తర్వాత ప్రజాభిప్రాయ సేకరణతో పాటు విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)లో విచారణ కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 2న యాక్సిస్ నుంచి యూనిట్‌కు రూ.4.60 చొప్పున విద్యుత్‌ను కొనాలని ఏపీఎస్పీడీసీఎల్‌ను ఈఆర్‌సీ ఆదేశించింది. దీనిపైనే జగన్ రోత పత్రిక యాగీ ప్రారంభించింది. కానీ, వాసవం మాత్రం.. 2022లో జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం మేరకు యూనిట్‌కు రూ.5.12 కంటే.. తాజాగా ఈఆర్‌సీ ఇచ్చిన ఆదేశాల మేరకు రూ.4.60 చొప్పున విద్యుత్ కొంటున్నారు. దీంతో ఒక్కొక్క యూనిట్‌పై రూ.0.52 పైసలు చొప్పున భారం తగ్గనుంది. లక్షల యూనిట్లతో పోల్చి చూస్తే.. ప్రభుత్వానికి రూ.కోట్లలో లబ్ధి చేకూర్చనుంది. ఈ విషయం తెలిసి కూడా జగన్ పత్రిక మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుండడంపై నిపుణులు విస్తుపోతున్నారు.

తాజా ప్రయోజనాలు ఇవీ..

- ▲ యాక్సిస్‌తోయూనిట్ విద్యుత్‌రూ.4.60కే రానుంది.
- ▲ 25 ఏళ్లలో రూ.2719.45 కోట్ల భారం తగ్గనుంది.
- ▲ 2,091 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కానుంది.
- ▲ ఏటా రూ.794 కోట్లు రాష్ట్రానికి ఆదాయం.
- ▲ యాక్సిస్ సంస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేయడంతో ట్రాన్స్‌మిషన్ సర్వీస్ చార్జీలు వర్తించవు.
- ▲ ఎస్‌జీఎస్టీ కింద రూ.731 కోట్ల రాబడి.
- ▲ సేకరించే భూమికి ఎకరాకు ఏటా రూ.31,000 కౌలు ఆదాయం.
- ▲ రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి చాన్స్.
- ▲ యాక్సిస్‌లో విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ విధానం.
- ▲ ఉదయం, రాత్రి, పీక్ అవర్‌లో విద్యుత్ పుష్కలం.

జగన్ ఒప్పందం కొనసాగిస్తే..

- ▲ యాక్సిస్‌తో జగన్ చేసుకున్న ఒప్పందం కొనసాగిస్తే యూనిట్‌ను రూ.5.12 చొప్పున కొనాలి.
- ▲ ఏటా రూ.108.78 కోట్ల మేర భారం ఖాయం.
- ▲ మొత్తం 25 ఏళ్లలో రూ.2719.45 కోట్ల మేర ప్రజలపై బాదుడు.

'జగన్మాయ' ఇదీ..

- ▲ గడచిన రెండు రోజులుగా జగన్ రోత పత్రికలో రాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థలు చేసుకున్న కొనుగోలు ఒప్పందాలపై గగ్గోలు పెడుతున్నా.. జగన్ హయాంలో ఒప్పందం ధర యూనిట్ రూ.5.12గా ఉందని చెప్పడం లేదు.
- ▲ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఇఫ్ ఇండియా(సెకీ)తో చేసుకున్న 7000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని యూనిట్ రూ.2.49కే చేశామని చెబుతున్నారు. కానీ.. సెకీ ప్లాంట్ రాజస్థాన్‌లో ఉంది. అక్కడ నుంచి రాష్ట్రానికి విద్యుత్తు సరఫరా కావాలంటే.. ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సేవల చార్జీలు(ఐఎస్‌టీఎస్) పడతాయి. ఈ చార్జీలు యూనిట్‌కు రూ.3.10 దాకా ఉన్నాయి. ఈ విషయాన్ని కూడా జగన్ పత్రిక దాచేసింది.
- ▲ ఇక, నేరుగా విద్యుత్తు ఉత్పత్తి చేయని సెకీ.. సౌర విద్యుదుత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేసి, రాష్ట్రానికి సరఫరా చేస్తుంది. దీనికిగాను యూనిట్‌కు 7 పైసల కమీషన్ తీసుకుంటుంది.
- ▲ సెకీతో ఒప్పందం మేరకు ఒక యూనిట్ విద్యుత్ రూ.5.66కు చేరుతుంది. దీనిలో యూనిట్ విద్యుత్ రూ.2.49, 7 పైసల కమీషన్, ఐఎస్‌టీఎస్ చార్జీలు రూ.3.10 ఉంటాయి.
- ▲ అంటే.. యాక్సిస్‌తో పోల్చితే.. సెకీ నుంచి కొనుగోలు చేసే విద్యుత్ యూనిట్‌కు రూ.1.06 ఎక్కువే. అయినా.. జగన్ పత్రిక మాత్రం మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది.
- ▲ ప్లాంటు రాజస్థాన్‌లో ఉండటంతో యువతకు ఉపాధి అవకాశాలు దక్కవు. ఏపీకి జీఎస్టీ రాదు.
- ▲ 2021 డిసెంబరు 1 నుంచి ఇప్పటిదాకా యూనిట్ రూ.2.49కే సెకీ నుంచి కొన్నానని జగన్ చెబుతారు. కానీ.. ఇప్పటిదాకా ఈ ఒప్పందం అమలు కాలేదు.
- ▲ సెకీ నుంచి ఒక్క యూనిట్ కరెంటు కూడా రాష్ట్రానికి రాలేదు. కారణం... సెకీ విద్యుత్తును సేకరించలేకపోవడమే. ఇలా ఎందుకు జరిగిందో జగన్ చెప్పరు. జగన్ పత్రిక రాయదు. ఇదే.. జగన్మాయ!!.



విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

యాక్సిస్‌తో ఒప్పందం జగన్ కుదుర్చుకున్నదే!

▸ యూనిట్‌కు రూ.5.12 చెల్లిస్తామని ఆయన అగ్రిమెంటు

▸ మేం 4.60కే తగ్గించి ఒప్పందం చేసుకున్నాం: టీడీపీ

▸ ఖజానాకు రూ.2,719 కోట్లు ఆదా చేశాం: పట్టాభి

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): యాక్సిస్ ఎనర్జీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ)లో అక్రమాల జరిగాయంటూ జగన్ చేస్తున్న దుష్ప్రచారమంతా తన తప్పు కప్పిపుచ్చుకునేందుకేనని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం విమర్శించారు. ఆ సంస్థతో 2022 నవంబరు 24న జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, దాని ప్రకారం 2022-23, 23-24 సంవత్సరాలకు యూనిట్‌కు రూ.5.12 చొప్పున చెల్లించేందుకు అంగీకరించిందని తెలిపారు. ఆ ధరను రూ.4.60కి తగ్గిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం అదే యాక్సిస్ ఎనర్జీతో ఒప్పందం చేసుకుంటే జగన్ ఎందుకు గగ్గోలు పెడుతున్నారని ప్రశ్నించారు. తాజా ఒప్పందం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.2,720 కోట్లు ఆదా చేశామన్నారు. జగన్ హయాంలో సెకీతో రూ.2.49కే ఒప్పందం చేసుకున్నట్లు ఆయన రోత పత్రికలో బుకాయిస్తున్నారని.. కానీ ఆ ఒప్పందానికి, యాక్సిస్ ఎనర్జీతో చేసుకున్న ఒప్పందానికి ఉన్న తేడాను చెప్పకుండా ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. సెకీ విషయంలో వారు నిర్దేశిత సమయంలో ఇచ్చినప్పుడే మనం విద్యుత్ తీసుకోవాలని.. కానీ యాక్సిస్ ఎనర్జీ మన డిమాండ్‌ను బట్టి విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఐకానిక్ అమరావతి

ప్రతి బిల్డింగ్ డిజైన్ ప్రత్యేకత చాటాలి

▸ అంతర్జాతీయ సంస్థలతో అమరావతికి బ్రాండ్

▸ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో సీఎం


సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, అధికారులు

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణాలు అన్నీ ఐకానిక్‌గా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశించారు. ప్రతి బిల్డింగ్ డిజైన్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవి ప్రత్యేకతలు చాటాలని చెప్పారు. ఆర్‌బీఐ, ఇన్‌కంట్యాక్స్, నాబార్డ్, ఎల్ఐసీ కార్యాలయాల భవనాలను చూస్తేనే ఒక మంచి అభిప్రాయం కలగాలన్నారు. డిజైన్ల విషయంలో అవసరమైతే ఆయా సంస్థలతో సంప్రదించి మన ఆలోచనలు పంచుకోవాలని చెప్పారు. రాజధాని ఎలా ఉండాలన్న దానిపై సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి నిలవాలంటే దాని కోసం అధికారులు ఆలోచనలు, ప్రణాళికలు ఎలా ఉండాలో వివరించారు. గతంలో తన అనుభవాలను ఈ సందర్భంగా వివరించారు. 15 డిజైన్లు పరిశీలించి హైదరాబాద్ హైటెక్ సిటీ భవనాన్ని ఖరారు చేశామన్నారు. 20 ఎయిర్‌పోర్టులు చూసిన తర్వాత శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించామని తెలిపారు. ఎయిర్‌పోర్టుకు 5 వేల ఎకరాలంటే.. నాడు తనను విమర్శించని వాళ్లు లేరని అన్నారు. వాటికి భయపడి వెనక్కి తగ్గితే.. హైదరాబాద్‌కు అలాంటి ఎయిర్‌పోర్టు ఉండేదా? అని ప్రశ్నించారు. ఎక్కడా రాజీపడకుండా పని చేస్తేనే ఫలితాలొస్తాయని చెప్పారు. అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిలవాలంటే ప్రతి ఒక్కరి ఆలోచనలు ఆ స్థాయిలో ఉండాలని సీఎం ఉద్బోధించారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలు రాజధానికి వస్తే అమరావతి ఓ బ్రాండ్ అవుతుందన్నారు.

పెద్ద సంస్థలను రప్పించాలి..

మూడేళ్లలో రాజధాని కడతాం అని ప్రధాని సమక్షంలో చెప్పామని, అందుకు అవసరమైన వేగం, ప్రణాళిక, విజన్‌తో అడుగులు వేయాలని స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్యం, క్రీడా, టెక్నాలజీ రంగాలకు కేంద్రంగా రాజధాని నిలవాలన్నారు. పెద్ద సంస్థలను రప్పించాలని, వెంటపడి ఒప్పించాలని, దానికోసం వాళ్లతో సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. బిట్స్ వంటి సంస్థలను తెచ్చేందుకు తన పరిచయాలతో వారిని సంప్రదించానని తెలిపారు.

క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు: మంత్రి నారాయణ

గతంలో 64 సంస్థలకు భూములు కేటాయింపులు పూర్తికాగా మంగళవారం మరో 7 సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ సీఆర్డీఏ అథారిటీ నిర్ణయం తీసుకుంది. ఆ వివరాలను మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. మొత్తం 71 సంస్థలకు కోర్ క్యాపిటల్ ఏరియాలో 1,050 ఎకరాల కేటాయింపులు జరిగాయన్నారు. మంగళవారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీలో పలు సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలపగా.. వాటికి సీఆర్డీఏ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు, లా యూనివర్సిటీకి 50 ఎకరాలు, ఇన్‌కంట్యాక్స్ ఆఫీస్‌కు 0.78 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి ఒక ఎకరం, కోస్టల్ బ్యాంక్‌కు 0.4 ఎకరాలు, రెడ్ క్రాస్‌సొసైటీకి 0.78 ఎకరాలు, బసవతారకం క్యాన్సర్ ఫౌండేషన్‌కు గతంలో 15 ఎకరాలు, వైద్య కళాశాల నిర్మాణానికి ఇప్పుడు మరో 6 ఎకరాలను కేటాయించామన్నారు. ఉద్యోగుల నివాసాల టవర్ల నిర్మాణానికి రూ. 1,732.31 కోట్ల పనులకు, రాజధానిలో 190 ఎంఎల్డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్‌కు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. జాతీయ రహదారులకు అనుసంధానం చేసేలా ఇ-13, ఇ-15 రోడ్లను పొడిగించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు.

మాజీమంత్రి పెద్దిరెడ్డికి నోటీసులు

▸ ఎల్లుండి దేవదాయ శాఖ అధికారి ఎదుట హాజరవండి

▸ బుగ్గమఠం భూముల వ్యవహారంలో మరో నలుగురికీ...

▸ హాజరుకాకుంటే ఆక్రమణల తొలగింపునకు ఉత్తర్వులు



తిరుపతి, మే 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి బుగ్గమఠం భూముల వ్యవహారంలో ఈ నెల 9న వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా ఐదుగురికి దేవదాయ శాఖ తుది నోటీసులు జారీ చేసింది. ఒకవేళ హాజరు కాకపోతే బుగ్గమఠం భూముల్లో ఆక్రమణల తొలగింపునకు చట్టప్రకారం నోటీసులు జారీ చేయనుంది. బుగ్గమఠం అధికారులు, దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు ఈ నెల 3న సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో భాగంగా మొత్తం 7 చోట్ల 14.49 ఎకరాల మఠం భూములు ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. భూములు ఆక్రమించినవారిలో పెద్దిరెడ్డితో పాటు మఠం భూముల పాత కౌలుదారుల వారసులు మరో నలుగురు ఉన్నట్టు తేల్చారు. భూములు ఖాళీ చేయాలని ఈ ఐదుగురికీ మఠం అధికారులు గత మార్చి 7నే నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులను పెద్దిరెడ్డి, పాత కౌలుదారైన యశోదమ్మ వారసులు హైకోర్టులో సవాల్ చేశారు. మిగిలిన పాత కౌలుదారుల వారసులు తమకు భూముల లీజును పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేదంటే ప్రస్తుత మార్కెట్ ధర నిర్ణయిస్తే చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. పెద్దిరెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు వ్యక్తిగతంగా హాజరై ఆధారాలు సమర్పించేందుకు అవకాశం కల్పిస్తూ ఆయనకు నోటీసులు జారీ చేయాలని దేవదాయ శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో పెద్దిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. దాని ప్రకారం గతనెల 17న ఆయన జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎదుట హాజరు కావాల్సి ఉండగా తాను ఎమ్మెల్యేగా పలు కార్యక్రమాలతో బిజీగా ఉన్నందున ఆ తేదీన రాలేనని జవాబిచ్చారు. దీంతో 9న వ్యక్తిగతంగా హాజరై ఆధారాలు సమర్పించాలని పెద్దిరెడ్డితో పాటు మిగిలిన ఆక్రమణదారులకు రెండో, తుది నోటీసులు జారీచేశారు. అయితే బుగ్గమఠంలో అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం 14.49 ఎకరాల భూములను మఠం ఎవరికీ విక్రయించలేదు. వాటిపై పూర్తి అధికారాలు మఠానివే. విచారణకు హాజరైనవారు అందజేసే రికార్డులు చెల్లుబాటు కాకపోయినా, లేదా వారు హాజరు కాకపోయినా దేవదాయశాఖ అధికారులు మఠం భూముల్లో ఆక్రమణలు తొలగించాలంటూ పై ఐదుగురికీ ఎవిక్షన్ నోటీసులు జారీ చేయనున్నారు.

భద్రతా సన్నద్ధతకే మాక్ డ్రిల్స్

▸ ప్రజల్లో అవగాహన, చైతన్యం కోసం నిర్వహణ

▸ దేశ రక్షణలో ప్రభుత్వానికి అండగా నిలవాలి

▸ భారత రిటైర్డ్ మేజర్ జనరల్ బొల్లిన వెంకటరావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]



తణుకు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వం తీసుకునే భద్రతా చర్యలకు దేశ ప్రజలంతా మద్దతుగా నిలవాలని రిటైర్డ్ మేజర్ జనరల్ బొల్లిన వెంకటరావు పిలుపునిచ్చారు. మాక్ డ్రిల్ నిర్వహించడం వల్ల భద్రతా సన్నద్ధతపై ప్రజల్లో అవగాహన ఏర్పడటంతో పాటు ఒకవేళ యుద్ధం వస్తే శత్రుదేశాల దాడుల నుంచి ప్రాణాలు, వనరులను కాపాడుకోవడంపై వారిని సంసిద్ధం చేయడానికి దోహదం చేస్తుందని చెప్పారు. 7న దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి బొల్లిన వెంకటరావు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ..

మాక్ డ్రిల్ ఉద్దేశం ఏమిటి?

ఉద్రిక్తతలు నెలకొన్న సమయాల్లో మాక్ డ్రిల్స్ మామూలే. కార్గిల్, పార్లమెంటుపై దాడి, పుల్వామా దాడి సమయంలోనూ వీటిని చేపట్టారు. అప్పట్లో మిలిటరీ బేస్‌ల్లోనే సాగాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఒకవేళ యుద్ధం వస్తే శత్రుదేశం జరిపే దాడుల నుంచి తమను తాము ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంచడానికి వీటిని నిర్వహిస్తారు.

ఉగ్రదాడి అనంతరం పాక్ పరిస్థితి ఏమిటి?

ఉగ్రదాడి అనంతరం కేంద్ర ప్రభుత్వం పాక్‌పై అనేక ఆంక్షలు విధించింది. ముఖ్యంగా అక్కడి జనాభాలో 40శాతం మందికి ఉపాధి కల్పిస్తూ జీడీపీకి 24 శాతం తోడ్పడే సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. వాఘా, అటారీ సరిహద్దులు మూసేయడంతో పాటు ఆ దేశంతో వర్తక, వాణిజ్య సంబంధాలను తెంచుకుంది. పాకిస్థాన్‌తో సముద్ర రవాణా మార్గాలను, మన గగనతలాన్ని సైతం మూసివేసింది. ఈ చర్యలు పాక్ ఆహార భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని ప్రమాదంలో పడేస్తాయి.

భారత్ వ్యూహమెలా ఉండనుంది?

పహల్గాం ఘటన తర్వాత భారత్ ప్రతీకార దాడులు చేస్తుందనే భయం పాక్‌లో ఉంది. ఎటునుంచి యుద్ధం ప్రారంభిస్తుందోనని ఆందోళన చెందుతోంది. ఈ విధంగా ఆందోళన, భయంతో వాళ్లను ఎంతకాలం ఉంచితే అంతగా బలహీనపడతారు. ఇదీ ఒక వ్యూహమే. పాక్ ఒక ప్రాణాంతక క్యాన్సర్ లాంటిది. అందుకే ఈ విషయంలో భారత్ ఓపికను ప్రదర్శిస్తోంది. శత్రువుపై దాడిచేసే ముందు వారు బలహీనపడేలా చేయడమూ వ్యూహమే. మనం ఎంత ఎక్కువ సమయం వేచిచూస్తే పాక్ అంతగా బలహీనపడుతుంది.

మన దేశ రక్షణ వ్యవస్థ గురించి...?

మన రక్షణ వ్యవస్థ, సైనిక సంసిద్ధత దృఢమైనవే. కానీ సంయమనంతో ఉంటాం. నియంత్రణ రేఖను దాటకుండానే దాడి చేయగల అత్యాధునిక ఆయుధ సామర్థ్యం మనకుంది. నియంత్రణ రేఖ వెంబడి పాక్ కవ్వింపు చర్యలకు భారత సైన్యం దీటుగా బదులు చెబుతోంది.

భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు ఎలా ఉంటుంది?

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు ఉంది. అమెరికా, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్ తదితర దేశాలు పహల్గాం దాడిని ఖండించాయి. ఈ విషయంలో పాక్ వాదనలు ఆయా దేశాలు తిరస్కరించాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి వచ్చే నిధులను అరికట్టడం ద్వారా పోరాడేందుకు తగిన వనరులు లేక యుద్ధం కొనసాగించలేని స్థితిలోకి పాక్ జారుకుంటుంది. కేంద్రం అనుసరిస్తున్న వ్యూహంతో పాక్ దీర్ఘకాలంలో పూర్తిగా బలహీనపడుతుంది.

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన రిటైర్డ్ మేజర్ జనరల్ బొల్లిన వెంకటరావు ఆర్మీలో వివిధ హోదాల్లో సేవలందించి పదవీ విరమణ పొందారు. భారత రక్షణ దళంలో చేసిన ఈయన సేవలకు గాను 2019లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పరమ విశిష్ట సేవా పతకం అందుకున్నారు. 1987లో శ్రీలంకలో జరిగిన ఆపరేషన్ 'పవన్'లో, 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో, 2001లో పార్లమెంట్‌పై ఉగ్రదాడికి సంబంధించిన చేపట్టిన ఆపరేషన్ పరాక్రమ్‌లో, 2009-15 వరకూ జమ్ముకశ్మీర్‌లో నిర్వహించిన కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్ 'రక్షక్'లో పాల్గొన్నారు. ఆయన తండ్రి బొల్లిన విశ్వనాథం తణుకు ప్రాంతంలో రైతు సంఘం నాయకుడిగా ప్రసిద్ధి చెందారు.

గాలిని పట్టుకునేందుకు మారువేషాల్లో వెళ్లాం

- ఓఎంసీ అక్రమ మైనింగ్‌ను నిరూపించేందుకు.. అమెరికా నుంచి శాటిలైట్ చిత్రాలు తెప్పించి సరిపోల్చాం
- అక్రమ మైనింగ్ చేసేవారికి ఈ తీర్పు ఒక గుణపాఠం
- నాటి సీబీఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడి




హైదరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పు.. అక్రమ మైనింగ్ చేసేవారికి ఒక గుణపాఠం అవుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆనాడు ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు నిర్వహించిన లక్ష్మీనారాయణ.. అప్పట్లో తమ దర్యాప్తులో వెల్లడైన విషయాలే ఇప్పుడు రుజువయ్యాయని పేర్కొన్నారు. గాలి జనార్దన్‌రెడ్డిని పట్టుకునేందుకు మారువేషాల్లో వెళ్లామన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఆనాటి అనుభవాలను లక్ష్మీనారాయణ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. "విచారణలో అనేక అనుభవాలున్నాయి. కళ్లముందు అక్రమ మైనింగ్ జరిగిందని కనిపిస్తున్నా.. నిరూపించేందుకు కావాల్సింది సాక్ష్యం. దానికోసం అప్పట్లో అనుసరించిన పద్ధతులు అపూర్వం. శాస్త్రీయంగా అక్రమాలు నిరూపించాం. రూ.882 కోట్ల అక్రమ మైనింగ్ జరిగిందని చెప్పాం" అని సీబీఐ మాజీ జేడీ అన్నారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ చేసిందన్నది స్పష్టమని, కానీ.. అది ఎక్కడ జరిగింది, ఎంత జరిగిందన్నది నిరూపించడం చాలా కష్టమయిందని చెప్పారు. తాము విచారణ ప్రారంభించేసరికే అక్కడ తవ్వకాలన్నీ అయిపోయాయని, అక్కడికి వెళ్లేసరికి అన్నీ ఖాళీ గోతులే ఉన్నాయని తెలిపారు. దీంతో ఏం చేయాలన్నది ఆలోచించి అమెరికా నుంచి ఆ ప్రాంతం శాటిలైట్ ఇమేజ్‌లు తెప్పించామని, వాటిని క్షేత్రస్థాయిలో సరిపోల్చామని వివరించారు. మళ్లీ అక్కడ మైనింగ్ సీన్ మొత్తం రీకన్‌స్ట్రక్షన్ చేసి.. ఏ రోజు ఎంత తవ్వకం జరిగి ఉంటుందన్నది లెక్కలేసి పరిశీలించామన్నారు. "అనుమతులు ఇచ్చింది ఎక్కడ, ఎంత పరిమాణం? తవ్వింది ఎక్కడ, ఎంత పరిమాణం? వంటివన్నీ లెక్కలేశాం. సింగరేణి సర్వే బృందాలతో మళ్లీ సర్వే చేయించాం. చివరకు ఎంత ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తవ్వారో అంచనా వేసి.. రూ.882 కోట్లుగా తేల్చాం. దాదాపుగా అదే ఇప్పుడు నిజమైంది" అని లక్ష్మీనారాయణ అన్నారు.

ఐటీ అధికారుల్లా హోటల్‌లో దిగాం..

"అప్పుడు ఎంత జాగ్రత్తగా విచారణ చేశామన్న దానిపై ఒక్క విషయం చెబుతాను. గాలి జనార్దన్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు మా బృందంతో బళ్లారికి వెళ్లాం. అక్కడ హోటల్‌లో ఎక్కడా సీబీఐ అధికారులమని చెప్పలేదు. ఐటీ అధికారులమని చెప్పాం. ఎందుకంటే బళ్లారిలో అతని నెట్‌వర్క్ పెద్దది. సీబీఐ అనగానే అప్రమత్తం అయిపోవచ్చు. ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం, పత్రాలు తరలించివేయొచ్చు. అందుకే సీబీఐలా కాకుండా వేరేలా వెళ్లాం. ఉదయాన్నే ఇంటికెళ్లి అరెస్టు చేసి.. ఇంట్లో ఉన్న కీలక పత్రాలు, నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నాం. అన్నింటినీ హెలికాప్టర్‌లో సీబీఐ కార్యాలయానికి తరలించాం" అని సీబీఐ మాజీ జేడీ వివరించారు. గాలి జనార్దన్‌రెడ్డి కేసును విచారించేటప్పుడు తమపై ఒత్తిడేమీ లేదని లక్ష్మీనారాయణ తెలిపారు. "ఓవైపు వ్యవస్థల్ని గుప్పిట్లో పెట్టుకునే నేత ఆయన. మరోవైపు రాంజెఠ్మలానీ,ఉదయ్ లలిత్‌లాంటి పేరుమోసిన న్యాయవాదులు దిగేవారు. అయినా మా సీబీఐ లీగల్ టీం బాగా పనిచేసింది. నాటి సీబీఐ అధికారులు వెంకటేశ్, ఆర్.ఎం.ఖాన్ తదితరులంతా బాగా సహకరించారు. అందరం ఒక బృందంలా పనిచేశాం" అని వివరించారు.

గాలికి ఏడేళ్ల జైలు



(మొదటి పేజీ తరువాయి)

అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య కేంద్రానికి లేఖ రాయడంతో సీబీఐ రంగంలోకి దిగింది. సరిహద్దులను కూడా మార్చేసి, నిబంధనలకు విరుద్ధంగా జరిపిన తవ్వకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అప్పట్లోనే రూ.884 కోట్ల నష్టం వాటిల్లినట్టు సీబీఐ తన దర్యాప్తులో తేల్చింది. మంగళవారం వెలువడిన తీర్పులో ఏ1 బి.వి.శ్రీనివాస్‌రెడ్డి(గాలి బావమరిది), ఏ2 గాలి జనార్దన్‌రెడ్డి, ఏ3 అప్పటి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఏ4 ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఏ7 మెహఫూజ్ అలీ ఖాన్ (గాలి వ్యక్తిగత సహాయకుడు)లను దోషులుగా నిర్ధారించి, నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. 8 నిందితుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కృపానందం, తొమ్మిదో నిందితురాలిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి గనుల మంత్రి, ప్రస్తుత తెలంగాణ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కేసు విచారణ సమయంలోనే ఏ5 ఆర్.లింగారెడ్డి మృతి చెందారు. ఏ6గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మిని తెలంగాణ హైకోర్టు 2022లో ఈ కేసు నుంచి డిశ్చార్జి చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా 219 మంది సాక్షులను విచారించారు. 3,336 పత్రాలను సాక్ష్యంగా కోర్టుకు సమర్పించారు. జనార్దన్‌రెడ్డిని సీబీఐ 2011 సెప్టెంబరు 5న అరెస్టు చేసింది. దాదాపు మూడున్నరేళ్లు జైల్లో గడిపిన తర్వాత సుప్రీంకోర్టు బెయిలుతో బయటకు వచ్చారు.

శిక్ష తగ్గించాలని ప్రాధేయపడ్డ గాలి

తీర్పు వెలువరించే క్రమంలో భాగంగా న్యాయస్థానం తొలుత కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటించింది. ఆ వెంటనే సబిత కోర్టు హాల్ నుంచి బయటకు వచ్చిన కుమారుడు కార్తీక్‌రెడ్డిని ఆలింగనం చేసుకొని తనని నిర్దోషిగా ప్రకటించిన విషయం చెప్పారు. ఆ తర్వాత న్యాయస్థానం నిందితులను వరుస క్రమంలో పిలుస్తూ, దోషులుగా ప్రకటిస్తూ శిక్షను ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డికి శిక్ష విధించడానికి ముందు కోర్టుకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా అని జడ్జి ప్రశ్నించారు. తనకు శిక్ష తగ్గించాలని గాలి ప్రాధేయపడ్డారు. మాజీ మంత్రిగా, ప్రజాప్రతినిధిగా ప్రజలకు సుదీర్ఘ కాలంగా సేవ చేస్తున్నానని, స్వచ్ఛంద సంస్థల ద్వారా కూడా పలు సామాజిక కార్యక్రమాలను చేస్తున్నందున శిక్ష తగ్గించాలని కోరారు. తాను చేస్తున్న ప్రజాసేవను గుర్తించి గతంలో కర్ణాటకలోని గంగావతి, బళ్లారి ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇప్పటికే సుమారు నాలుగేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించినందున, తన వయసును కూడా దృష్టిలో పెట్టుకొని శిక్ష తగ్గించాలని కోరారు. అయితే ఆరోపణలు రుజువైనందున మీకు యావజ్జీవ శిక్ష ఎందుకు విధించకూడదని న్యాయమూర్తి ప్రశ్నించారు. దాంతో గాలి మౌనం వహించారు. ఆయనకు శిక్ష ఖరారు కాగానే కోర్టు హాల్‌లో ఉన్న ఆయన కుమార్తె బ్రహ్మణిరెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. గాలితో సహా నలుగురు ముద్దాయిలను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

గాలిపై అనర్హత వేటు

గాలికి ఏడేళ్ల జైలు శిక్ష పడడంతో అతడిపై అనర్హత వేటు పడే అవకాశముందని తెలుస్తోంది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఏదైనా కేసులో రెండేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడితే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు పడుతుంది. సీబీఐ కోర్టు తీర్పును బుధవారం హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు గాలి జనార్దన్‌రెడ్డి తరఫున న్యాయవాదులు తెలిపారు. 17వ తేదీన గాలి కుమారుడు కిరీటిరెడ్డి వివాహం ఉండటంతో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరనున్నామని న్యాయవాది జితేందర్‌రెడ్డి చెప్పారు. గాలి అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారని, బెయిల్ పిటిషన్లో ఈ విషయాన్ని కూడా ప్రస్తావిస్తామని వెల్లడించారు.

న్యాయం గెలిచింది: సబిత

సీబీఐ కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించడం పట్ల సబిత సంతోషం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు అనంతరం మీడియాతో మట్లాడారు. కోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. మైనింగ్ కేసు నమోదైన తర్వాత కన్నీళ్లతో సీబీఐ కోర్టు మెట్లెక్కానన్నారు. న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, 12 ఏళ్ల ఈ కేసులో న్యాయం కోసం పోరాటం చేశానని, చివరకు న్యాయం గెలిచిందని చెప్పారు. కేసు నమోదు, విచారణ సమయంలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని తెలిపారు. చాలామంది అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందికర పరిస్థితుల్లో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఇక 'బ్రదర్' జగన్ వంతేనా?!

- 'గాలి'కి శిక్ష పడటంతో సర్వత్రా ఇదే చర్చ
- వైఎస్ హయాంలో ఒక వెలుగు వెలిగిన జనార్దన్‌రెడ్డి
- జగన్ తన బ్రదర్ అంటూ అప్పట్లో వ్యాఖ్యలు
- సోదరబంధంతోపాటు అక్రమ వ్యాపార బంధమూ!
- త్వరలో అదీ బయటపడుతుందంటున్న నిపుణులు



ఎంతటి రాజకీయ బలశాలి అయినా, ఎంత పెద్ద కార్పొరేట్ సామ్రాట్ అయినా, అధికార మదంతో ఎంతగా విర్రవీగినా.. సమయం వచ్చినప్పుడు వారందరినీ ధర్మరథ చక్రాలు నలిపేస్తాయనేందుకు గాలి జనార్దనరెడ్డి కేసే నిదర్శనం. వ్యవస్థలను దుర్వినియోగం చేస్తే ఏమవుతుందో గాలి కేసులో నిరూపించిన న్యాయస్థానంలోనే జగన్‌పై 11 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసుల్లో సగం రుజువైనా జగన్ రాజకీయ జీవితానికి శాశ్వతంగా తెర పడినట్టేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గాలి కేసును సుప్రీంకోర్టు నేరుగా పర్యవేక్షించింది. ప్రజాప్రతినిధులపై కేసులను వేగంగా పరిష్కరించాలంటూ ఇప్పటికే అనేకసార్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. ఇదంతా గమనిస్తున్నవారు... తర్వాత జగన్ వంతేనా....అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్‌ను తన బ్రదర్‌గా చెప్పుకొన్న కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డికి ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో ఏపీ రాజకీయాల్లో కలకలం మొదలైంది. ఒక్క కేసులోనే గాలికి ఏడేళ్ల కఠినశిక్ష పడితే.. 11కేసుల్లో నిందితుడైన జగన్‌కు ఇంకెన్నేళ్లు శిక్ష పడుతుందోనంటూ ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఏపీ, కర్ణాటక సరిహద్దులోని ఓబుళాపురం మైనింగ్ కేసులో 884 కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు సీబీఐ తేల్చిన కేసులో ఇంత శిక్ష పడింది. అయితే జగన్ ఏకంగా రూ.43వేల కోట్ల విలువైన అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ లెక్కన ఆయనపై నేరాలు రుజువైతే జీవితకాలం జైలు పాలే.. అనే చర్చ బలంగా జరుగుతోంది. ఉమ్మడి ఏపీ సీఎంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు గాలి జనార్దనరెడ్డి ఒక వెలుగు వెలిగారు. జగన్‌ను బ్రదర్ అని సంబోధిస్తూ వైఎస్ హయాంలో తన వ్యాపార విస్తరణకు అడ్డదారులు తొక్కారు. ఆయనకు అప్పట్లో 69 హెక్టార్ల భూమి అనంతపురం జిల్లాలో కేటాయించారు. కడప జిల్లాలో స్టీలు ప్లాంటు ఏర్పాటు పేరుతో పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించారు. ఈ వ్యవహారంలోనే గాలికి సీబీఐ శిక్ష వేయించింది. ఈ కేసులో జగన్‌ను నేరుగా ప్రాసిక్యూట్ చేయలేదు. కానీ, గాలిని దండించిన సీబీఐ కోర్టులోనే జగన్ కేసులు ఉన్నాయి. నాడు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని కంపెనీలతో క్విడ్ ప్రో కో ఒప్పందాలను జగన్ కుదుర్చుకున్నారనేది ప్రధాన అభియోగం. భూములు, మైనింగ్ లీజులు, అడ్డగోలు అనుమతుల ద్వారా రాజశేఖరరెడ్డి హయాంలో లబ్ధి పొందిన సంస్థలు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టాయని సీబీఐ నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారంలో జగన్ దురాశకు సహకరించిన ఆరోపణలపై అప్పట్లో ఆరుగురు మంత్రులు, ఎనిమిది మంది ఐఏఎస్‌లను సైతం సీబీఐ నిందితుల జాబితాలో చేర్చింది. జగన్ పై సీబీఐ దాఖలు చేసిన 11 చార్జిషీట్లలో 43వేల కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగినట్టు తేల్చింది. వాటి ఆధారంగా ఈడీ నమోదు చేసిన మరో ఆరు మనీలాండరింగ్ కేసులు సైతం విచారణలో ఉన్నాయి. 2012 మే చివరి వారంలో జగన్ పదహారు నెలల (2013సెప్టెంబరు దాకా) పాటు జైలు పాలవ్వడానికి కారణమైన ఈ కేసుల్లో తీర్పు వెలువడితే పదహారేళ్లకు పైగా జైలుకే అంకితమయ్యే అవకాశం ఉందనే వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి.

ఈడీ కేసులు...

1. పెన్నా గ్రూప్
2. ఇందూ టెక్ జోన్
3. ఇండియా సిమెంట్స్
4. రాంకీ ఇన్వెస్టిమెంట్స్
5. హెటిరో అరబిందో ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్
6. జగతి పబ్లికేషన్స్

గాలి కేసులో తీర్పు.. జగన్ కేసుల్లో మలుపు

అధికారాన్ని అడ్డంపెట్టుకొని దోచుకోవడంలో గాలి జనార్దనరెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక తరహా వ్యక్తులని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. వైఎస్ ప్రభుత్వ హయాంలో ఒక వెలుగు వెలిగిన ఈ ఇద్దరి మధ్య వ్యాపార, ఇతర అక్రమ లావాదేవీల సంబంధాలు ఉన్నట్లు చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణల్లో చిక్కుకుని జైలు పాలైన రాజకీయ నాయకులు దేశంలో చాలా మందే ఉన్నారు. కానీ వారంతా ఒకటో, రెండో కేసుల్లో మాత్రమే జైలుపాలై రాజకీయ జీవితానికి స్వీయ సమాధి కట్టేసుకున్నారు. జగన్ తరహాలో ఏకంగా 11 అక్రమాస్తుల కేసులు, ఆరు మనీ లాండరింగ్ కేసులు, మొత్తం 38కేసుల్లో నిందితుడిగా ఉన్న నేత దేశంలోనే మరెవరూ కనిపించరు. 2011 ఆగస్టు 10న హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించడంతో ఆగస్టు 17న జగన్‌పై కేసు నమోదైంది. నేరపూరిత కుట్ర, మోసం, నేరపూరిత నమ్మక ద్రోహం, లెక్కలు తారుమారు చేయడం, క్రిమినల్ మిస్ కండక్ట్‌తో పాటు అవినీతి నిరోధక చట్టాల కింద ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదయింది. జగన్‌తోపాటు మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డిని ఈ కేసులో ప్రధాన నిందితునిగా సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత దర్యాప్తులో మొత్తం 71మందిని ఈ కేసుల్లో చేర్చింది. వాన్‌పిక్‌కు భూముల కేటాయింపు కేసులో మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణను అరెస్టుచేసి అప్పట్లో జైల్లో పెట్టింది. 2012మే చివరి వారంలో అరెస్టై పదహారు నెలలు జైల్లో ఉన్న జగన్, ఆ తర్వాత నుంచి బెయిల్ మీద బయటే ఉన్నారు. పన్నెండేళ్లుగా ఈ కేసుల విచారణ కొనసాగుతూనే ఉంది.



కానిస్టేబుల్ కుమారుడు..

కోట్లకు పడగెత్తాడు!



అతి సాధారణ జీవనం నుంచి బంగారు సింహాసనం దాకా

సొంత హెలికాప్టర్లో కర్ణాటక సచివాలయానికి వెళ్లే స్థాయికి ఎదిగిన గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారిలో సాధారణ కానిస్టేబుల్‌గా పనిచేసిన చెంగారెడ్డి కుమారుడే మైనింగ్ కింగ్ గాలి జనార్దన్‌రెడ్డి. వాస్తవానికి చిత్తూరు జిల్లాకు చెందిన చెంగారెడ్డి కుటుంబం.. ఆ తర్వాత బళ్లారి వలస వెళ్లింది. ఆయన అత్యంత సాధారణమైన జీవితం నుంచి కోట్లకు పడగలెత్తి అత్యంత సంపన్నుడిగా ఆవిర్భవించడం వెనుక అక్రమ వ్యాపారాల చరిత్ర ఉంది. 1967లో బళ్లారిలో జన్మించిన జనార్దన్‌రెడ్డి.. కేవలం 21 ఏళ్ల వయసులో బళ్లారిలో 'ఎన్నేబుల్ ఇండియా సేవింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీ'ని ప్రారంభించి ప్రజల నుంచి పెద్దఎత్తున డిపాజిట్లు వసూలు చేశారు. ఎల్ఐసీకి దీటైన సంస్థ అంటూ ప్రచారంతో ఊదరగొట్టి సామాన్యుల నుంచి డిపాజిట్లు సేకరించారు. బళ్లారితోపాటు కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచీ పలువురు డిపాజిట్లు చేశారు. ఈ సంస్థపై రిజర్వ్ బ్యాంక్‌కు పలు ఫిర్యాదులు రావడంతో ఎన్నేబుల్ సంస్థను ఆర్బీఐ మూసివేయించింది. అప్పటికే పెద్దఎత్తున పొదుపు ఖాతాల్లో డబ్బు పెట్టిన వేల మంది ప్రజలు నష్టపోయారు. అదే సమయంలో గాలి జనార్దన్‌రెడ్డి తన సోదరులైన కరుణాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డితో కలిసి చిట్‌ఫండ్ వ్యాపారం ప్రారంభించారు. ఈ క్రమంలో మైనింగ్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)ని ప్రారంభించారు. ఇనుప ఖనిజం అమ్మకాలతో భారీగా డబ్బు సంపాదించారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ద్వారా ఓఎంసీకి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనింగ్ లీజులు పొందారు. మైనింగ్ దందాలో డబ్బు వస్తున్న కొద్దీ రాజకీయ అండ అవసరం కావడంతో గాలి సోదరులు బీజేపీలో చేరారు.



సొంత హెలికాప్టర్.. బంగారు కుర్చీ

ఓఎంసీని ప్రారంభించి అనంతపురం జిల్లాలో ఇనుపఖనిజం భూములను లీజుకు తీసుకుని దందా ప్రారంభించిన గాలి జనార్దన్‌రెడ్డి... వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పెరిగిన సాన్నిహిత్యంతో అపరిమితంగా ఎదిగారు. అత్యంత విలాసవంతమైన జీవితం గడిపారు. ఆయన ఇంట్లో బాత్‌రూం కమోడ్ నుంచి భోజనం చేసే కంచాల వరకు అన్నీ బంగారమేనని అనేవారు. ఆయన బంగారు సింహాసనంలో కూర్చునేవారని ప్రచారం. కొన్నాళ్లు కర్ణాటక మంత్రిగా పనిచేసిన గాలి.. అప్పట్లో సొంత హెలికాప్టర్లో సచివాలయానికి వచ్చేవారు. అక్రమ తవ్వకాల కేసులో 2011 సెప్టెంబరు 5న సీబీఐ ఆయన్ను అరెస్టుచేసింది. మూడేళ్లకుపైగా జైల్లోనే ఉన్నారు. బెయిల్ కోసం ఏకంగా న్యాయమూర్తులకే రూ.కోట్ల లంచం ఇవ్వడానికి గాలి ముఠా ప్రయత్నించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కుమార్తె బ్రహ్మణి వివాహానికి ఆయన భారీగా రూ.500 కోట్లు ఖర్చుపెట్టినట్లు ప్రచారం జరిగింది.

ఇచ్చింది కొంత.. తవ్వింది కొండంత

కేవలం 69 హెక్టార్ల మైనింగ్ లీజు పొందిన గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీ ఓఎంసీ.. అక్రమంగా అంతకు రెట్టింపు మైనింగ్ జరిపిందని సీబీఐ దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులను కూడా ధ్వంసం చేశారు. 60 లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని విదేశాలకు అక్రమంగా ఎగుమతి చేసినట్లు విచారణలో వెల్లడైంది. అక్రమంగా ఇనుప ఖనిజం తవ్వడం, రవాణా, ఎగుమతులు, విక్రయాల ద్వారా గాలి రూ.వందల కోట్లు గడించినట్లు వెల్లడైంది. అప్పట్లో ప్రైవేటు హెలికాప్టర్ 'రుక్మిణి'తోపాటు అనేక లగ్జరీ కార్లను గాలి ఇంట సీజ్ చేశారు.

ప్రభుత్వాలను శాసించే స్థాయికి..

మైనింగ్ మాఫియాతో రూ.కోట్లకు పడగలెత్తిన గాలి.. అనంతర కాలంలో ప్రభుత్వాలను సైతం శాసించే స్థాయికి ఎదిగారు. అప్పట్లో అనంతపురం డీఎఫ్‌వోగా పనిచేసిన బిశ్వాస్ తన నివేదికలో రూ.700 కోట్ల విలువైన ఇనుప ఖనిజాన్ని ఓఎంసీ తరలించినట్లు నివేదిక ఇచ్చారు. ఆయనపై కూడా అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేశారు. అప్పటి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అండదండలతో అక్రమ మైనింగ్ నిర్వహించి కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

రూ.10 లక్షల పెట్టుబడితో ఆరంభం..

2001-02 సంవత్సరంలో కేవలం రూ.10 లక్షల పెట్టుబడితో ప్రారంభమైన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ.. అక్రమ ఖనిజ తవ్వకాలు, ఎగుమతులతో ఆరేడేళ్లలోనే ఏకంగా సుమారు రూ.3 వేల కోట్లు ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులో మైనింగ్ మాఫియాను గాలి జనార్దన్‌రెడ్డి నడిపించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలంలో ఆరు గనులు ఉండగా.. వాటిలో ఐదు ఓఎంసీ అధీనంలోనే ఉన్నాయి. బళ్లారి ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 27.12 హెక్టార్లు, ఓఎంసీ-1 25.98 హెక్టార్లు, అంతరగంగమ్మ కొండలో ఓఎంసీ-2లో 68.50 హెక్టార్లు, ఓఎంసీ-3లో 39.50 హెక్టార్లు, అనంతపురం మైనింగ్ కంపెనీలో 6.5 హెక్టార్లు, వై మహాబళేశ్వరప్ప అండ్ సన్స్‌లో 20.24 హెక్టార్లను ప్రభుత్వం గనుల లీజుకు కేటాయించింది. వీటిలో బళ్లారి ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తప్ప మిగిలినవన్నీ ఓఎంసీ అధీనంలో ఉన్నాయి. అంతరగంగమ్మ కొండలోని లీజు ప్రాంతంలో 29.32 లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని ఓఎంసీ తరలించినట్లు అధికారులు అప్పట్లో తేల్చారు. అక్కడ నాణ్యమైన ఖనిజం లేదని, పక్క ప్రాంతంలోని ఖనిజాన్ని తవ్వి అంతరగంగమ్మ కొండ పేరుతో తరలించినట్లు ఆరోపణలు వచ్చాయి. అటవీ శాఖ అనుమతులు లేకుండానే ఖనిజాన్ని తరలించినట్లు తేలింది. బళ్లారి ఐరన్‌ఓర్‌కు చెందిన లీజు ప్రాంతంలో చొరబడి 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించినట్లు ఓఎంసీపై ఆరోపణలు వచ్చాయి. ఆ సంస్థ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసింది. కానీ గాలి అండ్ కో ఆ యాజమాన్యాన్ని భయపెట్టి దౌర్జన్యంగా తవ్వకాలు సాగించారు. అక్రమ తవ్వకాలు చేపట్టే ప్రాంతాల్లో తుపాకులతో సాయుధ బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారు.

నాడు టీడీపీ నేతలపై అక్రమ కేసులు

ఓబుళాపురంలో గాలి జనార్దన్‌రెడ్డి అక్రమ మైనింగ్‌ను పరిశీలించేందుకు 2007 జూలైలో ఉమ్మడి ఏపీ టీడీపీ నేతల బృందం ఓబుళాపురానికి వెళ్లింది. ముఖ్యనేతలు అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, ఎర్రబల్లి దయాకర్‌రావు, నాగం జనార్దన్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, పినిశెట్టి రంగనాయకులు, టీసీ గోవిందప్ప, మెట్టు గోవిందరెడ్డి, కొప్పుల హరీశ్వరరెడ్డి, చిన్నం బాబు రమేష్, పడాల అరుణ, లలితకుమారి, బొమ్మిడి నారాయణరావు, అమర్‌నాథ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు అక్కడకు వెళ్లకుండా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. వారు ఆందోళనకు దిగడంతో అరెస్టు చేశారు. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఆ కేసులను విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు ఈ ఏడాది మార్చిలో కొట్టివేసింది.

- అనంతపురం/బెంగళూరు, ఆంధ్రజ్యోతి.

న్యాయం గెలిచింది



తప్పు చేసిన వారెవరూ న్యాయ దేవత నుంచి తప్పించుకోలేరని సీబీఐ కోర్టు తీర్పుతో మరోసారి రుజువైంది. అంతిమంగా న్యాయం గెలిచింది. గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డితోపాటు మరికొందరిని ఏడేళ్ల జైలుశిక్ష పడటాన్ని స్వాగతిస్తున్నాం. సుదీర్ఘ పోరాటం అనంతరం వారికి శిక్ష పడింది. గాలి జనార్దనరెడ్డి ఇప్పటికైనా తన ఆత్మసాక్షిగా దేవుడి ముందు క్షమాభిక్ష కోరుకోవాలి. సీబీఐ సీజ్ చేసిన ఇనుప ముడిఖనిజం దొంగతనం జరిగింది. దానిపైనా కేసు నమోదు చేసి విచారించాలని ఫిర్యాదు చేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గనుల మంత్రి కొల్లు రవీంద్ర దీనిపై దృష్టి పెట్టి, న్యాయం చేయాలి. మా మైనింగ్ మెటీరియల్‌ను మాకు ఇప్పించాలి.

- టపాల్ శ్యాంప్రసాద్, ప్రధాన సాక్షి.

అక్రమ మైనింగ్ కేసులో.. ఎప్పుడేం జరిగింది?

- 2006 సెప్టెంబరు 3వ తేదీన గాలి జనార్దన్‌రెడ్డి సిద్ధాపురం-ఓబుళాపురం సరిహద్దులో ఉండే సుంకులమ్మ దేవాలయాన్ని కూల్చి, ముడి ఖనిజం తవ్వకాలు చేపట్టారు.
- 2006లోనే కర్ణాటకలోని టుముటిమెన్‌లో ఓఎంసీ చొరబడి అక్రమ తవ్వకాలు చేయడంతో పాటు సరిహద్దు రాళ్లను మార్చినట్లు బళ్లారిలోని సండూర్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది.
- 2007 జూలై 21 నుంచి మూడు రోజుల పాటు అప్పటి ఉమ్మడి ఏపీలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకుల బృందం గనులను పరిశీలించడానికి వస్తే వారిని రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. ఆ క్రమంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతల బృందం పోలీసు స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు.
- 2007 ఆగస్టు 11 నుంచి 14 వరకు అఖిలపక్ష బృందం అక్రమ తవ్వకాలపై పరిశీలన చేసింది.
- 2008 జనవరి 14న ఓఎంసీకి పక్కనే ఉన్న బీఐఓపీ మైనింగ్ ప్రాంతంలో చొరబడి దౌర్జన్యంగా విలువైన ఖనిజాన్ని కొల్లగొడుతోందని ఆ సంస్థ యాజమాన్యం అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఫిర్యాదు చేసింది.
- ఆ ఏడాది జనవరి 28, 29, 30వ తేదీల్లో అప్పటి అనంతపురం జిల్లా జడ్జి గడ్డెన్న గనుల్లో పర్యటించి అక్రమాలపై నివేదిక ఇచ్చారు.
- కర్ణాటకలోని ఇన్‌ట్రేడర్ మైన్స్‌లో చొరబడి అక్రమ తవ్వకాలు చేయడంపై ఫిర్యాదు అందుకున్న కర్ణాటక లోకాయుక్త విచారించి వాస్తవమేనని నివేదిక ఇచ్చింది.
- 2009లో ఓఎంసీ అక్రమాలు, సరిహద్దుల మార్పులపై అనంతపురం మైనింగ్ యజమాని టపాల్ గణేశ్.. కేంద్ర సాధికారిక సంస్థకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆ కమిటీ.. సర్వే ఆఫ్ ఇండియాతో మైనింగ్ ప్రాంతాన్ని సర్వే చేయించాలనీ, అప్పటివరకు ఆరు మైన్స్‌లో తవ్వకాలను నిలిపి వేయించాలనీ ఏపీ ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం సమ్మిరెడ్డి కమిటీని నియమించింది.
- 2009 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సీబీఐ విచారణ ప్రారంభించింది. ఓఎంసీ హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుంది. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏకేపాద నేతృత్వంలో 2010 మార్చిలో కమిటీ ఏర్పాటైంది. మూడు నెలలు గడువు కోరిన ఈ కమిటీ.. అంతరాష్ట్ర సరిహద్దు వివాదాన్ని తేల్చలేకపోయింది.
- బళ్లారి రక్షిత అటవీ ప్రాంతంలో మైనింగ్ కంపెనీల అక్రమ తవ్వకాలు, పర్యావరణ ముప్పు లాంటి అంశాలపై సమాజ్ పరివర్తన సంస్థ పూర్తి స్థాయి నివేదికను తయారు చేసి కేంద్ర సాధికార సంఘానికి 2010లో అందించింది.
- 2011 ఫిబ్రవరి 9న అప్పటి సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ బృందం గనులను పరిశీలించింది.
- 2011 సెప్టెంబరు 5న గాలి జనార్దనరెడ్డి, ఎండీ శ్రీనివాసరెడ్డి అరెస్టు.
- 2025 మే 6న..సీబీఐ కోర్టు గాలికి శిక్ష విధించింది.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి.

మద్యం కేసులో నిందితులుగా ఇద్దరు బాసులు

- ఎఫ్ఐఆర్‌లో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పేర్లు
- భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప కూడా: సిట్ మెమో దాఖలు
- కసిరెడ్డి, చాణక్య, సజ్జల, దిలీప్ రిమాండ్ పొడిగింపు


సజ్జల శ్రీధర్‌రెడ్డి


పైలా దిలీప్

విజయవాడ, మే 6(ఆంధ్ర జ్యోతి): మద్యం కుంభకోణం కేసులో కొత్తగా ముగ్గురు నిందితుల పేర్లను సిట్ అధికారులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. నాటి సీఎం కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, అప్పటి జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డితోపాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్ప పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చుతూ మంగళవారం ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. ముందస్తు బెయిల్ కోసం వారు సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఊరట దక్కని సంగతి తెలిసిందే. కాగా, మద్యం కుంభకోణంలో అరెస్టయి విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నలుగురు నిందితులు.. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్‌లకు రిమాండ్‌ను 20 వరకు పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు.

వంశీ రిమాండ్ పొడిగింపు


కోర్టుకు వచ్చిన వంశీతో పంకజశ్రీ

విజయవాడ, మే 6(ఆంధ్ర జ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రిమాండ్‌ను ఏసీబీ కోర్టు పొడిగించింది. విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా వంశీ రిమాండ్‌ను ఈనెల 13 వరకు పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తాను శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్నానని న్యాయాధికారి దృష్టికి వంశీ తీసుకెళ్లారు. దీనిపై మెమో దాఖలు చేయాలని న్యాయాధికారి చెప్పారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవడానికి సమయం ఇవ్వాలని అభ్యర్థించడంతో న్యాయాధికారి ఒక గంట సమయం ఇచ్చారు. దీంతో సతీమణి పంకజశ్రీతో వంశీ మాట్లాడారు. అనంతరం పంకజశ్రీ మీడియాతో మాట్లాడుతూ.. వంశీ అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయనకు హిమోగ్లోబిన్ తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశీకి చాలాకాలంగా వెన్నెముక, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయని, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారని చెప్పారు. జైలులో ఈ సమస్య మరింతగా పెరిగిందన్నారు. కాగా, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏసీబీ కోర్టులో వంశీ మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను ఈనెల 8కి వాయిదా వేశారు.

పీఎస్ఆర్‌కు నాలుగు న్యాయ ములాఖత్‌లు



విజయవాడ, మే 6(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వాని కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు జైలులో ములాఖత్‌ల సంఖ్య పెరిగింది. ఆయన తన న్యాయవాదిని కలుసుకునేందుకు వారంలో నాలుగు ములాఖత్‌లను మంజూరు చేస్తూ విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం ఆదేశాలు ఇచ్చింది. సీఐడీ కస్టడీ ముగిసిన తర్వాత పీఎస్ఆర్‌ను న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టినప్పుడు ములాఖత్‌ల అంశాన్ని ప్రస్తావించిన విషయం తెలిసిందే. తనకు ఐదు ములాఖత్‌లు ఉంటే వాటిని రెండుకు కుదించారని న్యాయాధికారికి చెప్పారు. దీనిపై మెమో దాఖలు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈమేరకు వేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయాధికారి టి.తిరుమలరావు వారంలో నాలుగుసార్లు న్యాయవాదితో ములాఖత్ అవ్వడానికి పీఎస్ఆర్‌కు అవకాశం కల్పించారు. పడుకోవడం కోసం ఆయనకు బెడ్, తలగడ ఇవ్వాలని ఆదేశించారు.

బెయిల్ రద్దు పిటిషన్‌పై కౌంటర్ వేయాలి!

- సంజయ్‌కు సుప్రీంకోర్టు మరో చాన్సు



న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక విభాగంలో అవినీతి ఆరోపణల కేసులో ప్రధాన నిందితుడైన సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 15వ తేదీలోపు కౌంటర్ దాఖలుచేయాలని సుప్రీంకోర్టు ఆయనకు స్పష్టం చేసింది. ఈమేరకు ఆయనకు మరో అవకాశమిచ్చింది. తదుపరి విచారణను 15వ తేదీకి వాయిదా వేసింది. అగ్నిమాపక శాఖలో ఎన్వోసీలు ఆన్‌లైన్లో జారీచేసేందుకు అగ్ని ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు నాడు ఫైర్ విభాగం డీజీగా ఉన్న సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షలు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి రూ.1.19 కోట్లు చెల్లించారు. ఈ రెండు అంశాల్లో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారని విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రధాన నిందితుడిగా సంజయ్ పేరును చేర్చింది. ఈ కేసులో ఆయనకు రాష్ట్ర హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దీనిని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. గత విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సంజయ్‌కు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులిచ్చింది. ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కౌంటర్ దాఖలుకు గడువు కావాలని సంజయ్ తరఫు న్యాయవాది కోరగా.. విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.

ఎస్సీ ఎస్టీ బెయిల్ పిటిషన్ల పరిధిపై విచారణ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణపరిధిని తేల్చే వ్యవహారం మంగళవారం ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి, న్యాయవాది ఎంఆర్‌కే చక్రవర్తి వాదనలు వినిపించారు. ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదైనప్పుడు సంబంధిత సెక్షన్లు నిందితులకు వర్తించవని ప్రాథమికంగా అభిప్రాయనికి వస్తే ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపి నిర్ణయాన్ని వెల్లడించే అధికారం హైకోర్టుకు ఉందన్నారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పులను చదివి వినిపించారు. వ్యాజ్యాలపై పూర్తిస్థాయి వాదనల కోసం విచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ వి.సుజాతతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనల కింద కేసులు నమోదైనప్పుడు ముందస్తు బెయిల్ కోసం ముందుగా సంబంధిత ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని హైకోర్టు సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. అయితే నేరుగా హైకోర్టును ఆశ్రయించవచ్చని వైసీపీ నేతలు విడదల రజని, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మరికొందరు పిటిషనర్లు ఇటీవల హైకోర్టులోని మరో సింగిల్ జడ్జి వద్ద వాదనలు వినిపించారు. దీంతో న్యాయమూర్తి... ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ పరిధిని తేల్చే వ్యవహారాన్ని ధర్మాసనానికి నివేదించారు. దీంతో సీజే ఈ వ్యవహారాన్ని తేల్చే బాధ్యతను జస్టిస్ సురేష్ రెడ్డి ధర్మాసనానికి అప్పగించారు.

ఢిల్లీ విమానాశ్రయంలో తోపుదుర్తి!


- గుర్తించిన పోలీసులు.. వాట్సా‌ప్‌లో నోటీసులు
- 14 రోజుల్లో విచారణకు రావాలని సూచన
- హెలికాప్టర్ పైలట్‌కు మూడో నోటీసు
- 12న వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పష్టీకరణ

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో గత నెల 8న జగన్ పర్యటన సమయంలో కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద చోటు చేసుకున్న ఘటన దర్యాప్తులో పోలీసులు దూకుడు పెంచారు. అజ్ఞాతంలో ఉన్న ప్రధాన నిందితుడు, వైసీపీ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ విమానాశ్రయం లాంజ్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద ఆయనకు వాట్సాప్ ద్వారా నోటీసులు పంపించారు. 14 రోజుల్లో రామగిరి సర్కిల్ కార్యాలయంలో విచారణకు రావాలని సూచించారు. బుధవారం అనంతపురంలోని ఆయన ఇంటికి వెళ్లి వ్యక్తిగతంగానూ నోటీసులిస్తామని పోలీసులు తెలిపారు. అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా.. ఆయనకు నోటీసులిచ్చి విచారించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అదే సమయంలో దర్యాప్తునకు సహకరించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని కూడా స్పష్టంచేసింది. అయినా ఆయన పోలీసులకు అందుబాటులోకి రాలేదు. మరోవైపు.. ఆ రోజు హెలికాప్టర్ పైలట్ అనిల్‌కుమార్‌కు పోలీసులు మూడోసారి నోటీసు పంపారు. 12న రామగిరి సర్కిల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పష్టంచేశారు. అనిల్‌కుమార్ మొదటి రెండు నోటీసులకు స్పందించినా.. విచారణకు రాలేదు. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అవకాశమివ్వాలని కోరగా.. పోలీసులు నిరాకరించారు.


ఢిల్లీ విమానాశ్రయం లాంజ్‌లో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

భూకబ్జాల భూమన!

(మొదటి పేజీ తరువాయి)



తరించాల్సిన ఆయన భూములను చెరపట్టడంలో ఆరితేరిపోయారంటూ విజిలెన్స్ సర్కారుకు తాజాగా నివేదించింది. రాజకీయ కక్షతో ఆ నివేదిక ఇచ్చారంటే పొరపాటే. సర్వే నంబర్ల వారీగా భూములు, వాటి సరిహద్దులు, నదీ పరివాహకాన్ని సమగ్రంగా పరిశీలించి అన్ని నివేదికలు, రికార్డులను పరిశీలించి భూమన భూ బాగోతాన్ని వెలికితీసి సర్కారుకు నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో భూమనపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తిరుపతి కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఆక్రమించుకున్న భూములపై సమగ్ర సర్వే చేయాలని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది.

జరిగింది ఇదీ!

భూమన కరుణాకర్‌రెడ్డిపై ఇటీవలి కాలంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అనేక ఫిర్యాదులు వచ్చాయి. అందులో భూ ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణల్లో కొన్నింటిపై విజిలెన్స్ అధికారుల బృందం ప్రత్యేకంగా విచారణ జరిపింది. తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూర్, తిరుపతి అర్బన్(నగర) మండలం మంగళం గ్రామంలోని తిమ్మినాయుడిపాలెం తదితర గ్రామాల పరిధిలో ఆయన 16.30 ఎకరాలు ఆక్రమించారని విజిలెన్స్ నిర్ధారించింది. ఆ భూముల విలువ రూ.కోట్లలో ఉంటుందని అంచనా వేసింది. నివేదికలోని ముఖ్యాంశాలు...

స్వర్ణముఖి: తొమ్మిది ఎకరాలు

తిరుచానూరు గ్రామంలోని సర్వే నంబర్ 472, 473, 474 లో 15.36 ఎకరాల భూమి భూమన కుమారుడు, ఆయన భార్య రేవతి పేరిట ఉంది. కానీ పొజిషన్‌లో ఉన్న భూమిని సర్వే చేయగా మొత్తం 24.36 ఎకరాల ఉన్నట్లు తేలింది. ఆ భూమిలో మామిడి సాగు చేస్తున్నారు. అయితే, ఇందులో ఇనాం భూమి ఉన్నట్లు విజిలెన్స్ గుర్తించింది.ఆ భూమి స్వర్ణముఖీ నదీ పరీవాహకంలో ఉంది. నదీ పరీవాహకంలోని తొమ్మిది ఎకరాల భూమిని భూమన ఆక్రమించుకొని తన ఖాతాలో వేసుకున్నట్లు విజిలెన్స్ నిర్ధారించింది. భూమిని చదును, మెరక చేయడానికి దాదాపు లక్ష టన్నుల మట్టిని వాడినట్టు గుర్తించారు. అయితే, ఆక్రమణకు గురైన ఇనాం భూమి నాలుగు ఎకరాలా? ఐదున్నర ఎకరాలా అనేది స్పష్టత రావడానికి సమగ్ర సర్వే చేయాలని విజిలెన్స్ సర్కారుకు సిఫారసు చేసింది. ఇనాం, స్వర్ణముఖి నదీ పరీవాహకాన్ని కలిపేసుకొని అదంతా తన భూమి అని చెప్పడానికి చుట్టూ భూమన భారీ ప్రహరీగోడ నిర్మించారని విజిలెన్స్ పేర్కొంది.

మంగళం: 7.30 ఎకరాలు

మంగళం గ్రామం తిమ్మినాయినిపాలెంలోని సర్వే నంబర్ 47లో 12.91 ఎకరాలు పశువుల గ్రాసం కోసం ప్రభుత్వం రిజర్వ్ చేసింది. సర్వే నంబర్ 47ను ఐదు సబ్ డివిజన్‌లు చేశారు. సర్వే నంబర్ 47-1, 47-5లో మొత్తం 7.30 ఎకరాల భూమిని భూమన ఆక్రమించారని విజిలెన్స్ నిర్ధారించింది. ఇందులో తొలుత ఐదు ఎకరాల భూమిని ఆక్రమించి రోడ్డువేసి, మరో రెండు ఎకరాలను ప్రైవేటు అవసరాలకు వినియోగిస్తున్నట్లుగా గుర్తించింది. దీంతో పాటు సర్వే నంబర్ 47-2లోని మరో 3.07 ఎకరాల భూమిని కబ్జా చేశారని విజిలెన్స్ వెల్లడించింది. సంబంధిత రైతులను బెదిరించి ఆ భూమిని లాక్కొని తన ఖాతాలో వేసుకున్నారని పేర్కొంది. ఇలా ఒక్క మంగళంలోనే 47వ సర్వే నంబర్ పరిధిలో 10.37 ఎకరాల భూమి ఆయన ఆక్రమణలో ఉందని నివేదించింది. ఇందులో ప్రభుత్వ భూమి 7.30 ఎకరాలు అని స్పష్టం చేసింది.

తక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశం

ప్రభుత్వ భూములను తక్షణమే ఆక్రమణ నుంచి విడిపించి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, భూమనపై ఇనాం, నదీ సంరక్షణ చట్టాల కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ప్రభుత్వ భూములను కబ్జా చేసినందుకు భూ కబ్జా నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని సూచించింది. స్వర్ణముఖి నదీ పరీవాహకాన్ని కబ్జా చేసినందుకు నదీ సంరక్షణ చట్టం కింద భూమనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని విచారణ సంస్థ సిఫారసు చేసింది. ఈ నివేదిక ఇటీవల రెవెన్యూశాఖకు చేరింది.

క్రిమినల్ చర్యలకు ఆదేశం

విజిలెన్స్ నివేదిక నేపథ్యంలో తీసుకోవాల్సిన తదుపరిచర్యలపై రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. తిరుపతి కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిసింది. విజిలెన్స్ సిఫారసుల మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్లును ఆదేశించినట్లు తెలిసింది. భూమన చెరలో ఉన్న ప్రభుత్వ, ఇనాం, స్వర్ణముఖి నదీ పరీవాహకంలోని భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని, విజిలెన్స్ సిఫారసుల మేరకు భూమనపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మంత్రి అనగాని ఆదేశించారు. తిరుచానూరు, తిమ్మినాయినిపాలెంలో భూమన చెరలో ఉన్న భూముల్లో సమగ్ర సర్వేచేసి పోలీసుల సహాయంతో ప్రభుత్వ భూములను కాపాడేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తిరుచానూరులోని భూమన తోటకు తరలించిన మట్టి ఎక్కడి నుంచి తీసుకొచ్చారో గుర్తించాలని, దాని కోసం వాడిన మట్టి ఎంత మేరకు ఉందో గుర్తించి దానికి గనుల చట్టం మేరకు సీనరేజీ వసూలు చేయాలని మంత్రి ఆదేశించారు. గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.

‘సమాచార కమిషన్’పై సర్కారు సీరియస్

- విచారణ చేపట్టిన సీఎస్

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): సమాచార కమిషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. అఖిల భారత సర్వీసు అధికారిని తన కార్యాలయంలోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా భావించింది. కమిషన్ సెక్రటరీ గదికి తాళాలు వేయడంతోపాటు, ప్రభుత్వం నియమించిన సెక్రటరీని లోపలికి వెళ్లనీయకుండా బయట వేచి ఉండేలా చేయడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విచారణ చేపట్టారు. కమిషన్ కార్యాలయం నుంచి ఇద్దరు ఉద్యోగులను మంగళవారం పిలిపించి, కార్యాలయంలో సోమవారం ఏం జరిగిందన్న సమాచారం సేకరించారు. కార్యాలయంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. జరిగిన విషయాన్ని ఆ ఉద్యోగులు సీఎస్‌కు వివరించారు. మరోవైపు సోమవారం జరిగిన పరిణామాలపై కొత్త సెక్రటరీ ఆంజనేయులు సీఎస్‌కు కాన్ఫిడెన్షియల్ నివేదికను అందించారు. మరోవైపు ఆంజనేయులు బుధవారం ఉదయం సీఎస్ విజయానంద్‌ను నేరుగా కలిసి కమిషన్ కార్యాలయంలో జరుగుతున్న విషయాలన్నీ వివరించనున్నారు.

రోజంతా కరెంటు ఇవ్వాల్సిందే

- విద్యుత్ సంస్థలకు సీఎస్ విజయానంద్ ఆదేశం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తరుణంలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా రోజంతా కరెంటు సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదేశించారు. మంగళవారం ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ ఇతర అధికారులతో విజయానంద్ సమీక్ష నిర్వహించారు. విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఏపీజెన్కోకు చెందిన థర్మల్, హైడల్ కేంద్రాలతో సహా.. సౌర, పవన, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు, హెచ్‌పీసీఎల్ వంటి పునరుద్పాదక ఇంధన వనరులు, ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్, విద్యుత్ ఎక్స్చేంజ్‌ల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్ర డిస్కమ్‌లు ప్రత్యేకంగా.. ఉదయం, సాయంత్రం పీక్ సమయాల్లో పవర్ స్వాపింగ్ ద్వారా డిమాండ్‌ను తట్టుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఏప్రిల్ 30 నుంచి మే 4వ తేదీ వరకూ డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను సరఫరా చేయగలిగామని విజయానంద్ సంతృప్తి వ్యక్తం చేశారు.



నేటి నుంచి కొత్త రైస్ కార్డులకు దరఖాస్తులు

- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్వీకరణ
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రైస్ కార్డుల జారీకి బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త రైస్ కార్డుల జారీ, రైస్ కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పు, మరణించిన వారి పేర్ల తొలగింపు, కార్డులు సరెండర్ చేయడం తదితర ఆరు రకాల సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘ఐదేళ్లలోపు పిల్లలు, 80 ఏళ్లు నిండిన వృద్ధులు 6,45,765 మందికి ఈకేవైసీ నుంచి మినహాయించాం. ఇప్పటికే 3,94,08,070 మంది రైస్ కార్డులో మార్పులు చేర్పుల కోసం నమోదు చేసుకున్నారు. నెల రోజులపాటు కొత్త రైస్ కార్డుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. 94.4 శాతం మేర ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో నూతన రైస్ కార్డుల జారీకి అవకాశం కల్పించాం. ఈనెల 12వ తేదీ తర్వాత వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు. జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రైస్ కార్డులను జారీ చేస్తాం. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈకార్డు వెసులుబాటు కల్పిస్తుంది. ఈకేవైసీ పూర్తయిన వాళ్లు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరంలేదు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక జూన్‌లో స్మార్ట్ కార్డుల రూపంలో నూతన రైస్ కార్డులను కొరియర్ ద్వారా లబ్ధిదారుల చిరునామాలకు పంపిస్తాం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రైస్ కార్డులు ఇచ్చే అంశం సీఎం చంద్రబాబు పరిశీలనలో ఉంది. అనాథాశ్రమాల్లో ఉండే వృద్ధులు సైతం రైస్ కార్డు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు’ అని మంత్రి తెలిపారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నానికల్లా పంట నష్టం పూర్తి వివరాలు అందుతాయన్నారు. దీపం-2 పథకం కింద నేటికి 1,50,19,303 గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామని తెలిపారు.

50% సబ్సిడీతో టార్పాలిన్లు

భీమవరం టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్లను అందించనున్నామని మంత్రి మనోహర్ తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో మంగళవారం తన శాఖకు సంబంధించిన పశ్చిమ, ఏలూరు జిల్లాల అధికారులు, రైస్ మిల్లర్లు, నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.





విజయవాడలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో నగరం ఉలిక్కిపడింది. బెంజ్‌సర్కిల్‌లో కురుస్తున్న భారీ వర్షం(పై ఫొటో) బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్‌పై నుంచి వెలుగులీనుతున్న మెరుపు

13న దక్షిణ అండమాన్‌కు ‘నైరుతి’

- ఈ ఏడాది వారం ముందే రాక.. నేడూ పలు జిల్లాల్లో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఈ నెల 13వ తేదీన దక్షిణ అండమాన్, దానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో ప్రవేశించనున్నట్లు భారత వాతావరణ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. సాధారణంగా మే 20 తర్వాత అండమాన్‌కు నైరుతి రావాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది వారం ముందే దక్షిణ అండమాన్‌ను తాకేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడినట్టు ఐఎండీ పేర్కొంది. కాగా, కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా మంగళవారం ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. తిరుపతి జిల్లా వినాయకపురంలో 40.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత పెరిగాయి. అలాగే చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 42.4, తిరుపతి జిల్లా రేణిగుంట, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 42.1, కడప జిల్లా ఒంటిమిట్టలో 41.3, కర్నూలు జిల్లా కామవరంలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం కొన్ని ప్రాంతాల్లో 42-43 డిగ్రీల ఉష్ణోగ్రతలతో ఎండ ప్రభావం, మరికొన్ని పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి జిల్లా చింతూరు, గంగవరం మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

వర్షాలకు ఇద్దరు మృతి

తిరుపతి, దాచేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తిరుపతి, పల్నాడు జిల్లాల్లో ఇద్దరు మృతి చెందారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లి దళితవాడలో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఇంటి గోడ కూలి మీదపడడంతో శెట్టిపల్లి అంజి (25) అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కృష్ణా నది తీరాన ఉన్న కొత్తూరులో పుల్లలు ఏరుతున్న సమయంలో పిడుగు పడి ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు.

గ్రూప్-1 మూల్యాంకనం కేసులో.. పోలీసుల అదుపులో ‘కామ్‌సైన్’ మధు!

- హైదరాబాద్ కార్యాలయంలో సోదాలు
- అనంతరం విజయవాడకు తరలింపు
- టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో సుదీర్ఘ విచారణ
- ఏపీపీఎస్సీ ఆఫీసులోనూ ప్రశ్నించిన వైనం
- నేడు కోర్టులో హాజరుపరిచే అవకాశం
- ప్రధాన నిందితుడు పీఎస్ఆర్‌పై పీటీ వారెంట్!

విజయవాడ, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రశ్నపత్రాల డిజిటల్ మూల్యాంకనం కేసులో ‘కామ్‌సైన్’ సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌ను విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని కామ్‌సైన్ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన అనంతరం మంగళవారం ఆయన్ను విజయవాడ తీసుకొచ్చారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సుదీర్ఘంగా విచారించారు. ఎంజీ రోడ్డులో ఉన్న ఏపీపీఎస్సీ కార్యాలయంలో కూడా ప్రశ్నించారు. డిజిటల్ మూల్యాంకనానికి సంబంధించిన ఫైళ్లను ముందు పెట్టి.. ఆ సమయంలో వాటిని నిర్వహించిన కమిషన్ సిబ్బందిని కూడా మధుసూదన్‌తో పాటు కూర్చోబెట్టి ప్రశ్నలు సంధించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. డిజిటల్ మూల్యాంకనం కాంట్రాక్టును కామ్‌సైన్‌కు అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు స్వయంగా ఇచ్చారా.. నాటి సీఎంవో నుంచి ఎవరైనా సిఫారసు చేస్తే ఇచ్చారా అని అడిగినట్లు సమాచారం. అయితే పలు ప్రశ్నలకు ఆయన జవాబులివ్వకుండా దాటవేత ధోరణితో వ్యవహరించినట్లు తెలిసింది. ఆయన్ను బుధవారం విజయవాడ ఒకటో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తారని సమాచారం. ఈ డిజిటల్ మూల్యాంకనం కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రధాన నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ముంబై నటి కాదంబరి జెత్వానీని వేధింపులకు గురిచేసిన కేసులో ఆయన ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గ్రూప్-1 కేసులో ఆయన్ను కోర్టులో హాజరుపరచాలంటే పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ముందుగా మధుసూదన్‌ను కోర్టులో ప్రవేశపెట్టాక పీఎస్ఆర్‌పై పీటీ వారెంట్ ప్రయోగిస్తారని అంటున్నారు. ఈ కేసును నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి.

ఎవరీ మధుసూదన్?

పమిడికాల్వ మధుసూదన్ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందినవారు. హైదరాబాద్ కేంద్రంగా పలు మీడియా సంస్థల్లో పనిచేశారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక మీడియా సంస్థలో ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి.. బాలు అనే స్నేహితుడితో కలిసి ధాత్రి అనే మీడియా సంస్థను స్థాపించారు. వైఎస్ జమానాలో అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాల కాంట్రాక్టును దక్కించుకున్నారు. 2019లో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అధికారంలోకి వచ్చాక.. అసెంబ్లీ సమావేశాల నుంచి ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ ప్రసారం చేసే కాంట్రాక్టు పొందారు. ఆ క్రమంలోనే కామ్‌సైన్ సంస్థను హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.